PRAJAPAKSHAM ★★★

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026


27న పనిచేయనున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు

ఓటు హక్కును హరించే విధానాన్ని అమలు చేస్తున్న సిఇసి

26న సిపిఐ అఖిలపక్ష సమావేశం

07


సంపుటి 09, సంచిక: 295 | శుక్రవారం | 25-09-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ఆయనకు పదవిలో కొనసాగే హక్కు లేదు

## ప్రజల విశ్వాసాన్ని ఘోరంగా

# దెబ్బతీసిన జ్ఞానేశ్

- ఇసిఐ తీరుపై మండిపడిన వామపక్ష జాతీయ నేతలు
- బిజెపి చేతిలో ఇసి కీలుబొమ్మగా పని చేస్తోందని స్పష్టమైందని వ్యాఖ్య
- తాజా పరిణామాలపై భేటీ అయిన వామపక్ష పార్టీలు
- ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్

**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) బిజెపి చేతిలో కీలు బొమ్మగా పని చేస్తోందని స్పష్టమైందని వామపక్ష పార్టీలు పేర్కొన్నాయి. కోట్లాది మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి మినహాయించడంతో సహా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ప్రవర్తన కమిషన్‌పై ప్రజల విశ్వాసాన్ని ఘోరంగా దెబ్బతీసిందని విమర్శించాయి. జ్ఞానేశ్‌కుమార్ సిఇసి పదవిలో కొనసాగే హక్కును కోల్పోయారని, ఇసి విశ్వసనీయత ను పునరుద్ధరించడానికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితి, భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై చర్చించేందుకు న్యూఢిల్లీలోని ఎ.కె.జి. భవన్‌లో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం. ఎ. బేబీ, పొలిట్ బ్యూరో సభ్యులు బి. వి. రాఘవులు, అరుణ్ కుమార్,

తరువాయి 8లో

### 28 నుంచి ఐదు వామపక్షాల నిరసన

ఎన్నికల సంఘం స్వాతంత్ర్యం, విశ్వసనీయత క్షీణించడాన్ని వ్యతిరేకిస్తూ, ఓటు హక్కును, భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, సెప్టెంబర్ 28న షహీద్ – ఎ – ఆజం భగత్ సింగ్ జయంతిని పాటిస్తూ, మహాత్మా గాంధీ జయంతితో ముగిసేలా, సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 2 వరకు వారం రోజుల పాటు దేశవ్యాప్త నిరసనలకు ఐదు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి.ఓటు హక్కును పరిరక్షించండి. ఎన్నికల సంఘం విశ్వసనీయతను పునరుద్ధరించండి– ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని రక్షించండి అనే నినాదంతో నిరసనలు నిర్వహించాలని సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పి కోరాయి.

### కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు

## భూ అక్రమాలపై విచారణకు

# ప్రత్యేక కమిటీ

### చైర్‌పర్సన్‌గా శ్రీదేవసేన నియామకం

- చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘనలపై క్షుణ్ణంగా పరిశీలన
- జగదీశ్‌రెడ్డి, గంగుల సహా పలువురు ముఖ్య నాయకులకు చెందిన భూ వ్యవహారాలపై కూడా విచారణ



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో భూముల కొనుగోలు, కేటాయింపులు, ఇతర అవకతవకలపై సమగ్ర విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ జిల్లాల్లో జరిగిన భూ అక్రమాలపై ఆరా తీసేందుకు ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ జి.ఓ నెంబర్ 134ను జారీ చేసింది. చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘనలపై క్షుణ్ణంగా పరిశీలన జరిపి, ఈ అక్రమాలకు బాధ్యులెవరో తేల్చి, వారిపై తగిన చర్యలకు సిఫార్సులు చేయడమే ఈ కమిటీ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక విచారణ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఎ. శ్రీదేవసేన, నియమితులయ్యారు. కమిటీ కన్వీనర్‌గా రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, సభ్యుడిగా జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో

తరువాయి 8లో

## జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారాలి

మోదీ, షా, సిఇసి 'దేశద్రోహులు' : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌లను 'దేశద్రోహులు'గా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. వారు భారత ఓటు హక్కును ధ్వంసం చేశారని అన్నారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అప్రూవర్‌గా మారాలని ఆయనకు సలహా ఇస్తున్నానని అన్నారు. అలా చేయడం దేశభక్తిని చాటడనమే అవుతుందని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గురువారం ఇక్కడి ఇందిరా భవన్‌లో

తరువాయి 8లో

## సిఇసి రాజీనామాకు 48 గంటల గడువు

లేకపోతే జంతర్‌మంతర్– 2 తప్పదని సిజెపి హెచ్చరిక

**న్యూఢిల్లీ:** ఓటర్ల హక్కులను దెబ్బతీస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) డిమాండ్ చేసింది. ఆయన 48 గంటల్లో పదవి నుంచి తప్పుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని, ఇందులో 'జంతర్ మంతర్ 2.0' కూడా ఉంటుందని హెచ్చరించింది. గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ తారుమారైందని ఆరోపించారు. పౌరుల ఓటు హక్కును వారి నుంచి దూరం

తరువాయి 8లో

## 22-ఎ సమస్యలకు పరిష్కారం

- రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు
- అనుమతులున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లకు మార్గం సుగమం

ప్రజాపక్షం/హైదరాబాద్

జి.ఓ 118, జి.ఓ 76 తర్వాత 22ఎ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న శాసనసభలో ఇచ్చిన హామీ మేరకు సహచర మంత్రులతో చర్చించి, 22ఎ సమస్యలను ఫాస్ట్ ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. 22ఎ జాబితాలో ఉన్నప్పటికీ జిహెచ్‌ఎంసి, హెచ్ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్లకు

తరువాయి 8లో



## గణేశ్ నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాపక్షం/హైదరాబాద్

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని జిహెచ్‌ఎంసితో పాటు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని వేగంగా, సురక్షితంగా,

తరువాయి 12లో

## ప్రపంచ శ్రేయస్సుకు

# చైనా–అమెరికా కృషి

- విభేదాలపై సర్దుబాటు ధోరణి– పరిమిత పోటీ
- సహకారంతో ఒకేదిశగా పయనించాలి
- ఈ రెండూ ప్రత్యర్థులు కాదు, భాగస్వాములు
- వాషింగ్టన్‌లో జిన్‌పింగ్ కీలక వ్యాఖ్య



**బీజింగ్:** ప్రపంచ శ్రేయస్సును చైనా–అమెరికా పరస్పర సహకారంతో ముందుకు నడిపిస్తాయని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు. నూతన శకంలో ఇరు దేశాలూ కలసిమెలసి ఉండేందుకు ఒక మార్గాన్ని కనుగొనాలని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు,ప్రపంచ పరిస్థితులకు సంబంధించిన ప్రధానాంశాలపై ట్రంప్‌తో లోతైన చర్చల కోసం తాను ఎదురుచూస్తున్నానన్నారు. చైనా అధికార పత్రిక సమాచారం ప్రకారం, పదకొండు సంవత్సరాల తర్వాత అమెరికాలో పర్యటిస్తున్న చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ దంపతులకు డోనాల్డ్ ట్రంప్ అరుదైన ఘనస్వాగతం పలికారు. ఆంద్రూ ఎయిర్‌ఫోర్స్ రన్‌వే వద్ద జిన్‌పింగ్, ఆయన భార్య పెంగ్ లియువాన్‌ల రాకకోసం ట్రంప్, ఆయన భార్య మెలానియా ముందుగానే వెళ్ళి ఎదురుచూశారు. సైనికులు సంగీత వాద్యాలు మోగిస్తుండగా స్వయంగా స్వాగతం పలికారు. విమానంలోంచి దిగిన తర్వాత బాలలు వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రెడ్ కార్పెట్‌కు ఇరువైపులా 500 మంది సైనికుల గన్‌శాల్యూట్‌తో ఆయనకు అసాధారణ స్వాగతం పలికారు. ఇరుదేశాల జాతీయ గీతాలాపనల తర్వాత బి–1 బాంబర్ సైనిక విమానాలు విన్యాసాలు నిర్వహించాయి. హోటల్‌కు

తరువాయి 8లో




## భగత్‌సింగ్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలి

- 28న రాష్ట్రవ్యాప్తంగా షాహిద్ జయంతి
- ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో భారీ కటౌట్

ప్రజాపక్షం/హైదరాబాద్

స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్‌సింగ్ జయంతిని ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్, ప్రధాన కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్‌లు పిలుపునిచ్చారు. జయంతి కార్యక్రమాలు కేవలం పూలమాలలకే పరిమితం కాకుండా యువతలో చరిత్రపై అవగాహన, శాస్త్రీయ దృక్పథం, సామాజిక సమానత్వం, విద్య, ఉపాధి వంటి సమకాలీన అంశాలపై చర్చలకు వేదికగా

తరువాయి 8లో

## దానం పిటిషన్ కొట్టివేత

హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** తనపై హైకోర్టు అనర్హత వేటు వేయడాన్ని సవాలు చేస్తూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది. అదే సమయంలో, పార్టీ ఫిరాయింపులపై కీలక వ్యాఖ్యలు చేసింది. పార్టీలు మారడం అనేది వారివారి ఇష్టమని, అయితే ఒక పార్టీ గుర్తుపై పోటీ చేసి మరో పార్టీలో చేరి పదవుల్లో కొనసాగడం సరైంది కాదని

తరువాయి 12లో


'ప్రజాపక్షం' దినపత్రిక 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



Ar. RAJA RAO. M D.Arch., B.Arch.
Cell: 9885158885, 9908958885

ఓం

Ar. NAGA JYOTHI. M B.Arch, (M.Sc Maths)
Mail ID: nice.designers@gmail.com

NDNC

NICE DESIGNERS &
NICE CONSTRUCTIONS

ARCHITECTS, INTERIOR DESIGNERS, STRUCTURAL ENGINEERS, VAASTU PLANNERS,
ESTIMATORS, CONSTRUCTION CONTRACTORS & LICENSED SURVEYORS



Shop No. 1,2&4, First Floor, Aditya Mansion, Opp: GHMC Kapra
Circle Office South Kamalanagar, ECIL (Post), Medchal Dist - 500 062.
Medchal - Malkajgiri Dist. Office : 040-27134900

4th Floor, Sri Vaishnavi Double Ten, Opp: Cyber Towers
Behind Mehfil, Hitech City, Madhapur.
Mail Id: dnc.vaasthunirman@gmail.com
Office : 040-23118838



Ar. RAJA RAO. M
D.Arch., B.Arch

Ar. NAGA JYOTHI. M
B.Arch., M.Sc., Maths

అఖండ భారతదేశం చాలా గొప్పది. అందరూ బాగుండాలి. దానికి మనం చేయవలసింది ఒకే ఒక్కటే - సత్యం మాట్లాడుట, ధర్మంవైపు మగ్గుచూపుడు, న్యాయమైన పనులే చేయుట, శాంతిని నెలకొల్పటానికి అశాంతిపరులను శిక్షంచి మంచివారుగా చేయుట, ప్రేమతో ఒకరితో ఒకరు జీవించుట ఇదే మన అఖండ భారతీయత, సత్యయుగం వైపు మన ప్రయాణం.

ఇట్లు
మీ ఆత్మ శ్రేయోభిలాషి
నిర్మలానంద అతీత సద్గురు
ఆర్కిటెక్ట్
రాజారావు మైలపల్లి

# భూ సంస్కరణలపై చర్చకు తరుణం

ఇటీవల భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నిషేధిత జాబితా గురించి తెలంగాణలో దుమారమే రేగింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని 22 ఎ సెక్షన్ కింద రాష్ట్రంలోని ప్రభుత్వ భూములు, దేవాదాయ, బంజరు, అసైన్డ్, అటవీ భూములకు సంబంధించిన సర్వే నంబర్ వివరాలు ఉంటాయి. వాటితో పాటుగా ప్రైవేటు వ్యక్తులు, సంస్థల ఆధీనంలో ఉండే వివాదాస్పద భూముల సర్వే నంబర్‌లను కూడా ఆ జాబితాలోకి ఎక్కిస్తారు. అంటే ఆ జాబితాలో ఉంచిన భూములను ఎవరి పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు లేదు. ఈ మధ్య కాలంలో కోర్టు ఆదేశాల మేరకు ఆ జాబితాను సరి చేసే క్రమంలో గతంలో 22ఎ లో ఉంచి, కాలక్రమంలో దాని నుంచి బైటపడిన భూముల వివరాలు సాంకేతికంగా తిరిగి అందులో చేరడంతో వివాదం మొదలైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరిలోని కాలనీలలో వేలాది కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. ఈ అంశంపై సెప్టెంబర్ 16న శాసనసభ చర్చ సందర్భంగా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వడమే కాకుండా నెల రోజుల్లో పరిష్కారానికి 12 రకాల మార్గాలను వెల్లడించారు. ఆ సందర్భంలోనే మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులు, పలువురు బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలు, నాయకులు, వారి అనుంగులు ఫామ్ హౌజ్‌లు, తదితర పేర్లతో భూ గరిష్ట పరిమితి చట్టానికి మించిన భూములు కలిగి ఉన్న విషయాన్ని సభ ముందుంచారు. కెసిఆర్ కుటుంబానికి 400లకు పైగా ఎకరా లు ఎర్రవెల్లిలో ఉన్నాయని, పక్కనే నిషేధిత జాబితాలో ఉన్న వందల ఎకరాల భూములను కలుపుకున్నారనే తీవ్ర ఆరోపణ చేశారు. అంతే కాకుండా నిషేధిత జాబితాలోని భూములను వాటిలో కలుపుకున్నారనే తీవ్ర ఆరోపణలు చేయటమే కాకుండా, విచారణకు ఒక కమిటీ వేస్తానని ప్రకటించారు. అందుకు అనుగుణంగా గురువారం నాడు ఐఎఎస్ అధికారిణి ఎ.దేవసేన నేతృత్వంలో విచారణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

శాసనసభ చర్చ సందర్భంగా భూ గరిష్ట పరిమితి చట్టం గురించి సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించడంతో చట్టం ప్రకారం ఎన్నిక ఎకరాల భూమి ఉండాలనే అంశం తెరపైకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఏడాదికి వచ్చే పంటలు, నీటి వసతి ఆధారంగా ఐదుగురు సభ్యుల కుటుంబానికి తరి 10 – 27 ఎకరాలు వరకు భూమి ఉండవచ్చు. మెట్ట, సాగు నీటి వసతి లేని భూమి అయితే కుటుంబానికి 35 – 54 ఎకరా ల వరకు అనుమతిస్తారు. ఆ పైన ఉండే భూమిని 'మిగులు భూమి'గా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఎర్రవెల్లి క్షేత్రంలో సతీమణితో కలిపి కెసిఆర్ కుటుంబానికి 67.13 ఎకరాలు, కెటిఆర్ కుటుంబానికి వివిధ ప్రాంతాలలో 123.19 ఎకరాల భూములు ఉన్నట్లు అసెంబ్లీలో సిఎం వెల్లడించారు. నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా చంద్రబాబునాయుడు, వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిలు ఉన్న సమయంలోనే నాడు రాజకీయ నాయకులు హైదరాబాద్‌కు శివారులలో భూములు కొనుగోలు చేసి, ఫామ్ హౌజ్‌లు ఏర్పాటు చేసుకోవడం ఆరంభమైందని పరిశీలకులు చెబుతుంటారు. అయితే, తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇది విస్తృతమైంది. ముఖ్యంగా కెసిఆర్ ఎర్రవెల్లిలో వ్యవసాయ క్షేత్రంలోనే ఇళ్ళు కట్టుకొని, తరచుగా అక్కడే ఉంటుండడంతో ఫామ్ హౌజ్ పదం ప్రజల నోళ్ళలో నానింది. ఆ తరువాత బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తమ నియోజక వర్గాలలోనో, వెలుపలో ఫామ్ హౌజ్‌లు ఏర్పాటు చేసుకున్న విషయం నాడు పెద్ద ఎత్తున చర్చ జరిగేది. శాసనసభ సమావేశాల చివరి అంకంలోనే కాంగ్రెస్ ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎ, ఎంపిలు కెసిఆర్ ఫామ్ హౌజ్ వద్దకు, తరువాత హరీశ్‌రావు, కెటిఆర్, జగదీశ్‌రెడ్డి తదితరుల ఫామ్ హౌజ్, వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్ళారు. ప్రైవేటు భూముల వద్దకు వెళ్తుండడంపై బిఆర్‌ఎస్ నేతలు అభ్యంతరం పెట్టినప్పటికీ, వారి భూములను చూపడం ద్వారా జనాంతికంగా ఉన్న విషయాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలనేది కాంగ్రెస్ వ్యూహంగా కనపడింది. అదే సమయంలో కాంగ్రెస్ నేతల భూముల గురించి, అందులో సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి తదితరులు భూముల గురించి బిఆర్‌ఎస్ నేతలు ప్రశ్నలు సంధించినా, అది పెద్దగా ప్రజల్లోకి వెళ్ళలేదు. గత ప్రభుత్వ హయాంలో మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ఎంపిల ఫామ్ హౌజ్‌లు, విలాసవంతమైన విల్లాలను కొన్ని యూట్యూబ్ ఛానళ్ళు ప్రముఖుల 'హోం టూర్' పేరుతో చిత్రీకరించాయి. తమ నివాసాలు, ఆడంబరాల ను నేతలు ఉత్సాహపడి మరీ గొప్పలు చెప్పుకొచ్చారు. ఇప్పుడా వీడియో క్లిప్పింగ్‌లు వైరలవుతుండడంతో ఇరుకున పడుతున్నారు. తమ ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల నామినేషన్‌తో పాటు దాఖలు చేసామని బిఆర్‌ఎస్ నేతలు సమర్థించుకునే ప్రయత్నం చేశారు. అయితే, ఉద్యమ కాలంలో ఎన్నికల సమయానికి ఎకరం కూడా లేని, లక్షల్లోనే ఆదాయం చూపిన పలువురు నేతలకు ఇప్పుడు భారీ ఫామ్ హౌజ్‌లు, విల్లాలు, కోట్ల వ్యాపారాలు ఎలా వచ్చాయనే కాంగ్రెస్ నేతల ఎదురుదాటి ఇరకాటంలో పడేస్తోంది.

నిజానికి భూమి అనే అంశాన్ని ఎజెండాలోకి తీసుకువచ్చింది కమ్యూనిస్టులనేది ఎవ్వరినడిగినా చెబుతారు. 'భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం' అనే నినాదంతో నైజాం రాచరిక పాలన, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన చరిత వారిదే. లక్షల ఎకరాలు చెరబట్టిన నిజాం నవాబు, దొరలు దేశ్‌ముఖ్‌ల కోటలను బద్ధలు కొట్టింది వారే. నాటి పోరాటంలో 'దున్నే వానికే భూమి' పేరుతో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పది లక్షల ఎకరాల భూమి పేదలు, రైతులు, రైతు కూలీలకు పంపిణీ జరిగింది. దానికి పోటీగా భూదానోద్యమాన్ని ముందుకు తీసుకువచ్చినా కమ్యూనిస్టుల పోరాటమే భూ పంపిణీకి బాటలు వేసింది. ఆ వెలుతురులోనే దేశవ్యాప్తంగా భూ సంస్కరణలు, భూ పరిమితి చట్టాలు వచ్చాయి. పేదల చేతుల్లోకి భూములు వచ్చాయి. ఆర్థిక సంస్కరణల తరువాత తిరిగి భూములు కేంద్రీకరణ మొదలైంది. సెజ్‌ల పేరిట ప్రభుత్వమే కార్పొరేట్ సంస్థలకు పెద్ద ఎత్తున భూములను కట్టబెట్టింది. ఇందుకు రైతుల నుంచి బలవంతంగా తక్కువ మొత్తానికే భూమి సేకరించి, వాటికి అప్పగించింది. అదే క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోయి, కబ్జాలు, నేతల భూదాహం ఎక్కువవడంతో పట్టణభూపరిమితి చట్టం తొలగించడం, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటులకు బాటలు పడ్డాయి.

సామాన్య మధ్యతరగతి ఊళ్ళలో భూమి అమ్ముకున్నా పట్టణాల్లో ఇంటి స్థలం వచ్చే పరిస్థితి లేదు. అదే సమయంలో నేతలు, బడా బాబులు భూములను చెరబడుతున్నారు. రాష్ట్రంలో 22 ఏ, ఫామ్ హౌజ్‌లపై చర్చ జరుగుతున్న సమయంలో మరోసారి భూ సంస్కరణలు, భూ గరిష్ట పరిమితిపై చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది. పెరిగిన జనాభా, భూముల ధరల నేపథ్యంలో వ్యవసాయ భూములు, పట్టణాలలో ఆవాస స్థలాల పరిమితి అంశంపై విశ్లేషణ జరగాలి. మెజారిటీ ప్రజలకు సాగు భూమి, ఆవాసస్థలం ఉండేందుకు అనువుగా చట్టాలలో మార్పులపై విస్తృత మథనం చేయాల్సిన సమయం ఆసన్నమైంది.



## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

భారత ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ భారత ఓటు హక్కును ధ్వంసం చేశారు. ఆయన వెంటనే రాజీనామా చేయాలి. అప్రూవర్‌గా మారితే కొంతవరకూ దేశభక్తిని నిరూపించుకున్నట్టు అవుతుంది. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్న సిఇసితోపాటు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా దేశద్రోహులు అవుతారు. ఓటును రక్షించే సంస్థ ఎన్నికల సంఘమే. అక్కడి నుంచే మిగతా వ్యవస్థలన్నీ ఉద్భవిస్తాయి. ఓటు ధ్వంసమైతే రాజ్యాంగం పనిచేయదు. చట్టాలు ధ్వంసమవుతాయి. సంస్థలకు అర్థం ఉండదు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే, గతంలో అసెంబ్లీలకు, లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని నేను వంద శాతం నమ్ముతున్నాను. ఓటు చోరీ నుంచి చట్టం చోరీ వస్తుంది. దాని నుంచి సంస్థల చోరీ జరుగుతుంది.

– రాహుల్ గాంధీ
లోక్‌సభలో ప్రతిపక్ష నేత




## ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర.. కష్టాల్లో ఫార్మాసిస్టుల జీవనం

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్ట్ డేను నిర్వహిస్తా రు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల సేవలను గుర్తించ డం, ఔషధాల సురక్షిత వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. వైద్యుడు వ్యాధిని నిర్ధారించి చికిత్సను సూచిస్తే, ఆ చికిత్సలో కీలకమైన మందు సరైనదేనా, సరైన మోతాదులో ఉందా, ఎలా వినియోగించాలి, ఇతర మందులతో ఎలాంటి ప్రభావాలు ఉంటాయి వంటి విషయాల్లో ఫార్మాసిస్టులు ముఖ్యమైన బాధ్యతను నిర్వహిస్తారు. ప్రపంచ ఫార్మసీ రంగానికి సెప్టెంబర్ 25 ప్రత్యేకమైన రోజు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటిక ల్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్ట్ డే నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం 2010 సంవత్సరం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని క్రమబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఫార్మసిస్టుల సేవలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, ఆరోగ్య సంరక్షణలో ఫార్మసీ వృత్తి ప్రాధాన్యతను తెలియజేయడానికి ఈ రోజు ఒక వేదికగా మారింది. ఫార్మసీ చట్టం, 1948 కింద ఏర్పడిన ఫార్మసీ కౌన్సిల్ వ్యవస్థ దేశంలో ఫార్మసీ విద్యకు సంబంధించి న ప్రమాణాలు, ఫార్మసిస్టుల వృత్తిపరమైన రిజిస్ట్రేషన్ వంటి అంశాలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. బి.ఫార్మా, డి.ఫార్మా తదితర కోర్సుల ద్వారా ప్రతి సంవత్సరం వేలాదిమంది ఫార్మసీ విద్యను అభ్యసించి ఆరోగ్య రంగంలోకి ప్రవేశిస్తున్నారు. భారతదేశంలో 10 లక్షలకు పైగా రిజిస్టర్డ్ ఫార్మసిస్టులు ఉన్నారని విస్తృతంగా పేర్కొంటారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపులు, ఔషధ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజారోగ్య రంగాల్లో వారు సేవ లు అందిస్తున్నారు. ఫార్మాసిస్టు అంటే కేవలం మందుల ప్యాకెట్ తీసి రోగికి ఇచ్చే వ్యక్తి కాదు. వైద్యుల ప్రిస్క్రిప్షన్‌ను పరిశీలించడం, మందుల పేర్లు, మోతాదులు, గడువు తేదీలు తనిఖీ చేయడం, మందులను నిర్దిష్ట ఉష్ణోగ్రతలో భద్రపరచడం, రోగికి మందుల వినియోగ విధానాన్ని వివరించడం వంటి అనేక బాధ్యతలను వారు నిర్వహిస్తారు. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎక్కువకాలం మందులు తీసుకోవాల్సి ఉంటుంది. మందులను సమయానికి తీసుకోవడం, వైద్యుల సూచన లేకుండా మోతాదును మార్చకపోవడం, లక్షణాలు తగ్గాయని మందులను అకస్మాత్తుగా ఆపకపోవడం వంటి విషయాల్లో ఫార్మాసిస్టులు ప్రజలకు అవగాహన కల్పించగలరు. ఆసుపత్రులు, మెడికల్ షాపులు అనేక సందర్భాల్లో 24 గంటలూ పనిచేస్తాయి. దీంతో ఫార్మాసిస్టులు రాత్రి వేళల్లో కూడా విధులు నిర్వహించాల్సి వస్తుంది. తగిన సిబ్బంది లేకపోతే ఒకే ఫార్మాసిస్టుపై అధిక పని భారం పడుతుంది. ఎక్కువసేపు నిలబడి పనిచేయడం, రోగులు, వారి బంధువుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం, మందుల లభ్యత, ధరలు, ప్రిస్క్రిప్షన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం వంటి బాధ్యతలు కూడా వారి రోజువారీ పనిలో భాగమే. ఫార్మసీ విద్యను పూర్తిచేసిన యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు, గౌరవప్రదమైన వేతనాలు, వృత్తిపరమైన ఎదుగుదలకు అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. మందు సాధారణ వినియోగ వస్తువు కాదని, వైద్యుల సూచనలకు అనుగుణంగా ఉపయోగించాల్సిన ఆరోగ్య సాధనమని ప్రజలు గుర్తించాలి.

*(సెప్టెంబర్ 25న 'ప్రపంచ ఫార్మసిస్ట్ దే' సందర్భంగా)*

ఆళవందార్ వేణు మాధవ్, 8686051752

# భగత్‌సింగ్‌ను విగ్రహంగా కాదు ఆలోచనగా చదవాలి

## షాహిద్ స్ఫూర్తితో యువత శాస్త్రీయ దృక్పథం కోసం పాటుపడాలి



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు
9705309583

వేల కాగడాలు ఏకమైతే... లక్ష గొంతులు ఒక్కటైతే.... కోటి ఆశలు నిలువెల్లా నింపుతుంటే అతనొక్కడవుతాడు. జాతి ఆత్మ ఘోషను గుండెల నిండా నింపుకొని పుట్టినవాడు. అన్నానికి బదులు ఆవేశం తిని పెరిగినవాడు. వేలమంది ప్రాణాలు విడిచినా మట్టి వాసననే ప్రాణవాయువుగా పీల్చుకొని బతికినవాడు. తెల్లదొరల ముందు.. ధైర్యంగా మీసం మెలేసిన పౌరుష ధీశాలి.. ఉరితాడును సైతం ఎంతో ఇష్టంగా ముద్దాడిన పోరాట యోధుడు, భారత స్వాతంత్ర్య చరిత్రలో అరుణారుణ అక్షరాలతో లిఖించబడిన విప్లవ వేగుచుక్క షహీద్ భగత్ సింగ్....

అతనొక మేధావి.... అతనొక సామాజిక వేత్త....
అతనొక చరిత్రకారుడు.... అతనొక ఉద్యమ కారుడు.....
అతనొక స్వాతంత్ర్యయోధుడు.... అతనొక మార్క్సిస్టు సిద్ధాంత కర్త.....
అతనొక విప్లవకారుడు.... అన్నిటికి మించి అమరుడతడు......
అతనే షాహీద్ భగత్ సింగ్...

భగత్‌సింగ్‌ను స్మరించుకోవడం అంటే ఒక వీరుడి చిత్రపటానికి పూల మాల వేయడం, నినాదాలు చేయడం మాత్రమే కాదు. ఆయనను నిజంగా అర్థం చేసుకోవాలంటే ఆయన చదివిన పుస్తకాలను, రాసిన వ్యాసాలను, చేసిన ప్రశ్నలను, సమాజంపై ఆయనకున్న దృక్పథాన్ని అధ్యయనం చేయాలి. కేవలం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ తన చిన్న జీవితకాలంలోనే భారత స్వాతంత్ర్యాన్ని ఒక విస్తృతమైన సామాజిక విముక్తి ప్రశ్నగా చూశాడు. ఆయనకు స్వాతంత్ర్యం అంటే విదేశీ పాలకుడు వెళ్లిపోవడం మాత్రమే కాదు. పేదరికం, దోపిడీ, అసమానత, అజ్ఞానం, మూఢనమ్మకాలు తొలగి ప్రతి మనిషికి గౌరవంతో జీవించే అవకాశం కలిగే సమాజం నిర్మించడం. అందుకే భగత్‌సింగ్‌ను విగ్రహంగా నిలబెట్టడం కంటే ఆలోచనగా యువతలోకి తీసుకెళ్లడం ఈ తరానికి ఉన్న గొప్ప బాధ్యత.

భగత్‌సింగ్ దేశాన్ని ప్రేమించాడు. కానీ దేశభక్తిని అందమైన విధేయతగా చూడలేదు. సమాజంలో అన్యాయం కనిపిస్తే ప్రశ్నించడం, ప్రజల జీవితాల్లో మార్పుకోసం ఆలోచించడం, దోపిడీకి వ్యతిరేకంగా నిలబడడం కూడా దేశభక్తిలో భాగమేనని ఆయన జీవితం చెబుతుంది. ఆయన విస్తృతంగా చదివాడు, ప్రపంచంలోని రాజకీయ, సామాజిక ఉద్యమాలను అధ్యయనం చేశాడు, తన అభిప్రాయాలను నిరంతరం పరిశీలించుకున్నాడు. అందుకే భగత్‌సింగ్ ఆలోచనలలో పఠనం, తర్కం, విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత ముఖ్యమైన స్థానాన్ని పొందాయి. నేటి డిజిటల్ యుగం లో ఒక వార్త క్షణాల్లో లక్షల మందికి చేరుతుంది. అదే సమయంలో తప్పుడు సమాచారం కూడా అంతే వేగంగా వ్యాపిస్తుంది. ఈ పరిస్థితిలో భగత్‌సింగ్ నుంచి యువత నేర్చుకోవాల్సిన మొదటి పాఠం, ఏది చెప్పినా నమ్మకండి. చదవండి, ప్రశ్నించండి, ఆధారాలను పరిశీలించండి, నిజాన్ని తెలుసుకోండి.

నేటి భారతదేశంలో యువత ఎదుర్కొంటున్న ప్రధా న సమస్యల్లో ఉపాధి ఒకటి. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, తాత్కాలిక మరియు కాంట్రాక్ట్ ఉద్యోగాలపై ఆధారపడుతున్న యువ కార్మికులు. వీరి సమస్యలను కేవలం వ్యక్తిగత వైఫల్యాలుగా చూడలేం. ఉపాధి అవకాశాల సృష్టి, ప్రభుత్వ ఖాళీల భర్తీ, నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అభివృద్ధి, కార్మిక హక్కులు, సామాజిక భద్రత వంటి అంశాలతో నిరుద్యోగ సమస్య ముడిపడి ఉంది. అందువల్ల యువతకు ఉద్యోగం కల్పించడం కేవలం ఎన్నికల సమయంలో ఇచ్చే హామీగా కాకుండా దేశ ఆర్థిక అభివృద్ధికి మరియు యువత గౌరవప్రదమైన జీవనానికి సంబంధించిన ప్రాథమిక సామాజిక ప్రశ్నగా చూడాలి. భగత్ సింగ్ సమాజాన్ని మార్చే శక్తిగా యువతను చూసినట్లే, నేటి యువత కూడా తమ భవిష్యత్తు కోసం వ్యక్తిగత పోటీతో పాటు సమిష్టి సామాజిక చర్చను ముందుకు తీసుకెళ్లాలి.

విద్య సమాజ మార్పుకు అత్యంత శక్తివంతమైన సాధనం. కానీ విద్య కేవలం పరీక్షలో మంచి మార్కులు సాధించి ఉద్యోగం పొందడానికి ఉపయోగపడే సాధనంగా పరిమితమైతే దాని సామాజిక ప్రయోజనం తగ్గిపోతుంది. నిజమైన విద్య మనిషికి జ్ఞానం మాత్రమే కాకుండా ప్రశ్నించే శక్తి, విశ్లేషించే సామర్థ్యం, సమాజాన్ని అర్థం చేసుకునే దృష్టి, బాధ్యతాయుతమైన పౌర స్ఫూర్తి ఇవ్వాలి. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల కు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ విద్యా సంస్థలు బలోపేతం కావాలి. ఉన్నత విద్య ఆర్థికంగా అందనంత దూరంలోకి వెళ్లకూడదు. విద్యార్థి తన కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా తన కలలను వదులుకోవాల్సిన పరిస్థితి ఉండకూడదు. భగత్‌సింగ్ స్వయం గా విస్తృతంగా చదివి తన ఆలోచనా ప్రపంచాన్ని నిర్మించుకున్నాడు. అందువల్ల ఆయన జయంతి సందర్భంగా ప్రతి యువకుడిలో పాఠ్యపుస్తకానికి మించి ప్రపంచాన్ని చదవాలి అనే పఠనా సంస్కృతిని పెంచడం అవసరం.

భగత్‌సింగ్‌ను నేటి కాలంలో అత్యంత ప్రాసంగికంగా నిలబెట్టే అంశాల్లో శాస్త్రీయ మరియు హేతుబద్ధమైన ఆలోచన ఒకటి. ఆయన తన విశ్వాసాలను కూడా ప్రశ్నించడానికి వెనుకాడని మేధో ధైర్యాన్ని ప్రదర్శించాడు. నేను ఎందుకు నాస్తికుడు అయ్యాను వంటి రచనలో తన ఆలోచనా ప్రయాణాన్ని తర్కంతో వివరించాడు. శాస్త్రీయ దృక్పథం అంటే కేవలం సైన్స్ చదవడం కాదు. ఏ విషయాన్నైనా ఆధారం, పరిశీలన, తర్కం ఆధారంగా అర్థం చేసుకోవడం. నేటి సోషల్ మీడియా కాలంలో మూఢనమ్మకాలు, తప్పుడు వైద్య




సమాచారం, నిర్ధారణ లేని ప్రచారాలు, వదంతులు వేగంగా వ్యాపిస్తున్నాయి. యువత ప్రతి సమాచారాన్ని ప్రశ్నించే అలవాటు పెంచుకోవాలి. ఎవరు చెప్పారు? కంటే దానికి ఆధారం ఏమిటి? అనే ప్రశ్నకు ప్రాధాన్యత ఇవ్వాలి. భగత్‌సింగ్ ఆలోచనలను నిజంగా ముందుకు తీసుకెళ్లడం అంటే హేతువు, శాస్త్రీయ దృక్పథం, మానవతా విలువలను యువతలో బలపరచడం. నేటి పోటీ ప్రపంచం ప్రతి యువకుడిని నీవు ఎలా ముందుకు వెళ్తావు? అని అడుగుతోంది. కానీ భగత్‌సింగ్ ఆలోచనలు మరో ప్రశ్నను కూడా మన ముందుంచుతాయి. నీవు ముందుకు వెళ్తున్నప్పుడు నీ చుట్టూ ఉన్న సమాజం పరిస్థితి ఏమిటి? వ్యక్తిగత విద్య, ఉద్యోగం, ఆర్థిక స్థిరత్వం అవసరమే. అయితే అదే సమయంలో సమాజంలో ఉన్న అసమానతలు, పేదరికం, నిరుద్యో గం, వివక్ష, విద్యా అవకాశాల కొరత వంటి సమస్యలపై స్పందించే సామాజిక బాధ్యత కూడా యువతలో ఉండాలి. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడం కాదు. ప్రజా సమస్యలను అర్థం చేసుకోవడం, ప్రశ్నించడం, చర్చించడం, శాంతియుత ప్రజాస్వామ్య మార్గాల్లో పరిష్కారాల కోసం కృషి చేయడం కూడా. భగత్‌సింగ్ వారసత్వాన్ని సజీవంగా ఉంచేది ఇదే చైతన్యం. చదివిన యువత... ఆలోచించే యువత. ఆలోచించే యువత... ప్రశ్నించే యువత. ప్రశ్నించే యువత... సమాజాన్ని మార్చగల యువత.

**భగత్‌సింగ్ ఆలోచనల నుంచి నేటి యువత వరకు – ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం మళ్లీ ఎందుకు మారుమోగుతోంది?**

2026లో ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా జరిగిన యువత ఉద్యమం ఒక ముఖ్యమైన విషయాన్ని మన ముందుకు తెచ్చింది. విద్యా వ్యవస్థలోని సమస్యలు, పరీక్షల విశ్వసనీయత, యువత భవిష్యత్తు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి ప్రశ్నలపై వేలాది మంది యువత వీధుల్లోకి వచ్చారు. ఆ ఉద్యమంలో ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం మారుమోగింది. భగత్‌సింగ్ చిత్రపటాలు కూడా కనిపించాయి. ఇది మొత్తం జెన్ జీ ఒకే రాజకీ య సిద్ధాంతాన్ని స్వీకరించిందని చెప్పడానికి ఆధారం కాదు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. అన్యాయం ఎదురైనప్పుడు ప్రశ్నించే యువత ఉంది. వ్యక్తిగత సమస్యలను సామాజిక ప్రశ్నలుగా మార్చే చైతన్యం ఉంది. భగత్ సింగ్ పేరు, ఇంక్విలాబ్ నినాదం ఇంకా కొత్త తరానికి అర్థవంతమైన రాజకీయ భాషలో భాగంగా ఉన్నాయి. పరీక్షలో జరిగిన అన్యాయం ఒక విద్యార్థి వ్యక్తిగత సమస్యగా మొదలై, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, అవకాశాల సమానత్వం, ప్రభుత్వ బాధ్యత వంటి విస్తృత ప్రశ్నలుగా మారినప్పుడు అక్కడే వ్యక్తిగత ఆవేదన నుంచి సామాజిక చైతన్యానికి ప్రయాణం ప్రారంభమవుతుంది.

భగత్‌సింగ్‌కు ఇంక్విలాబ్ అంటే కేవలం అధికారం లో ఒకరిని తొలగించి మరొకరిని కూర్చోబెట్టడం కాదు. సమాజపు పునాదుల్లో మార్పు తీసుకురావడం. దోపిడీ, అసమానత, పేదరికం, నిరుద్యోగం, సామాజిక అన్యాయం కొనసాగుతూనే రాజకీయ మార్పును సంపూర్ణ స్వాతంత్ర్యంగా చూడలేమనే విస్తృత ఆలోచన ఆయన రాజకీయ పరిణామంలో కనిపిస్తుంది. అందుకే ఇంక్విలాబ్ జిందాబాద్ అనేది ఒక నినాదం మాత్రమే కాదు, సమాజాన్ని మార్చాలనే నిరంతర ఆకాంక్షకు ప్రతీక. నేడు యువతలో సమానత్వం, ప్రజా విద్య, ఉపాధి, కార్మిక హక్కులు, సామాజిక న్యాయం వంటి ప్రశ్నలు మళ్లీ బలంగా ముందుకు వస్తున్నప్పుడు, వాటిని భగత్‌సింగ్ ఆలోచనా వారసత్వంతో అనుసంధానించి చదవాల్సిన అవసరం ఉంది. ఇది యువత అంతా సోషలిజాన్ని స్వీకరించిందనే సరళమైన నిర్ధారణ కాదు. కానీ సమా జం ఎవరి కోసం? అభివృద్ధి ఫలాలు ఎవరికి? విద్య, ఉపాధి అందరికీ సమానంగా ఎందుకు అందకూడదు? సంపద, అవకాశాల అసమానత ఎందుకు కొనసాగాలి? అనే ప్రశ్నలు బలపడుతున్నాయంటే, అక్కడ భగత్‌సింగ్ ఆలోచనలను కొత్త తరం ముందు తిరిగి ఉంచాల్సిన చారిత్రక అవకాశం ఉంది. భగత్‌సింగ్‌ను పోస్టర్‌లో మాత్రమే కాదు, యువత ప్రశ్నల్లో, సమానత్వం కోసం జరిగే పోరాటాల్లో, శాస్త్రీయ ఆలోచనలో, దోపిడీ రహిత సమాజం కోసం జరిగే ప్రజా ఉద్యమంలో సజీవంగా చూడాలి.

భగత్‌సింగ్‌ను వివిధ రాజకీయ, సామాజిక వర్గాలు తమతమ దృక్కోణాల్లో స్మరిస్తుంటాయి. అయితే ఆయన స్వయంగా రాసిన రచనలు, లేఖలు, జైలు నోట్లు, ఆయ న రాజకీయ పరిణామాన్ని పరిశీలిస్తే ఆయనను కేవలం ఒక ఫొటో, ఒక టోపీ, ఒక నినాదం లేదా ఒక వీరోచిత సంఘటనకు పరిమితం చేయడం ఆయన ఆలోచనా విస్తృతిని తగ్గించినట్లే అవుతుంది. భగత్‌సింగ్‌ను చదవడం అంటే ఆయన ఆలోచనలతో ఏకీభవించడం మాత్ర మే కాదు. ఆయన ప్రశ్నలను మన సమాజం ముందు పెట్ట డం, చర్చించడం, విశ్లేషించడం కూడా. ఆయనను స్మరించే ప్రతి విద్యాసంస్థలో, ప్రతి యువజన సంఘం లో, ప్రతి గ్రంథాలయంలో పఠన చర్చలు జరగాలి. భగత్‌సింగ్ చిత్రాన్ని గోడపై పెట్టడం కంటే ఆయన పుస్తకాన్ని యువత చేతిలో పెట్టడం గొప్ప నివాళి. ఆయన పేరును నినదించడం కంటే ఆయన ఆలోచనలను చర్చించడం గొప్ప నివాళి.

**షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతి (సెప్టెంబర్ 28)** సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) తరపున భవిష్యత్ యువతకు సందేశం. భగత్‌సింగ్‌ను కేవలం స్మరించకండి, చదవండి. కేవలం చదవకండి, ఆలోచించండి. కేవలం ఆలోచించకండి, ప్రశ్నించండి. ప్రశ్నించిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో సంఘటితంగా ముందుకు సాగండి.

ఉద్యోగం కోసం పోరాడే ప్రతి నిరుద్యోగి పక్కన నిలుద్దాం. విద్య హక్కు కోసం పోరాడే ప్రతి విద్యార్థి గొంతుకగా నిలుద్దాం. మూఢనమ్మకాల స్థానంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుదాం. అసమానతల స్థానంలో సమానత్వాన్ని, ద్వేషం స్థానంలో మానవత్వాన్ని, నిరాశ స్థానంలో భవిష్యత్తుపై నమ్మకాన్ని నిర్మిద్దాం. యువత చేతుల్లో పుస్తకం ఉండాలి, మెదడులో ప్రశ్న ఉండాలి, హృదయంలో మానవత్వం ఉండాలి, సమాజం పట్ల బాధ్యత ఉండాలి. అదే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి. అదే AIYF నిర్మించాలనుకునే చైతన్యవంతమైన భవిష్యత్ యువత.

## ఒంటరితనాన్ని దూరంచేసే మార్గం ఏదీ?

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వైయిక్తిక కుటుంబాలు రోజు రోజుకు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒంటరితనం విస్తృతంగా వివిధ కుటుంబాల్లో విజృంభిస్తోంది.. అదే సమయంలో సొంత వాళ్ళకు, సొంత ఊళ్లకు దూరం కావడం వల్ల చాలామంది ఒంటరితనం అనుభవిస్తున్నారు.. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారింది... ఇదే సమయంలో ప్రపంచాన్ని ఏకం చేయడానికి నేనున్నా అంటూ గత రెండు దశాబ్దాలుగా పట్టణ ప్రాంతాల నుంచి మారుమూల గ్రామాల్లోకి చొచ్చుకొచ్చిన 'ఆరు అంగుళాల నవీన సాంకేతిక ఆయుధం సెల్ ఫోన్' మొత్తం ప్రపంచాన్ని ఆ మాటకు వస్తే ప్రజల జీవితాలనే మార్చి వేసింది.. అగ్గికి ఆజ్యం పోసినట్లు ముఖ్యంగా మన దేశంలో పబ్లిక్‌రంగంలో ఉన్న టెలికాం బి.ఎస్.ఎన్.ఎల్‌ను అణగదొక్కుతూ, ప్రైవేటురంగంలో అనేక నెట్వర్క్ సంస్థలు 'జియో' వంటివి ఉద్భవించి, ఫ్రీ డేటా అంటూ మొత్తం యావత్ దేశాన్ని సెల్ మత్తుతో ముంచెత్తుతోంది... దీంతో అప్పుడే పుట్టిన చంటి బిడ్డ నుంచి మరణానికి చేరువలో ఉన్న ముసలి వాళ్ళు వరకూ సెల్ మత్తులో ఊగిసలాడుతున్నారు...ఈ సెల్ ను సద్వినియోగం చేసుకునే వారికంటే దుర్వినియోగం చేసుకునే వారే ఎక్కువ అని తెలుస్తుంది..

ముఖ్యం గా రకరకాల యాప్‌లు అందుబాటులోకి వచ్చా యి.. వీటిలో యువతను, బలహీన మనస్తత్వం కలిగిన వారిని బుట్టలో వేసుకునే, ఆకట్టుకునే వారి జీవితాలను నాశనం చేసే అనేక యాప్‌లు పుట్టికొచ్చి, వాటి వలలో చిక్కుకుని విల విల లాడుతున్న పరిస్థితి ఏర్పడింది. అపరిమితమైన డేటా ప్యాక్, అన్ లిమిటెడ్ కాల్స్ వంటి నెట్వర్క్ ప్యాకేజీలు వివిధ సంస్థలు తరచూ తక్కువ ధరలకు అందుబాటులోకి తేవడంతో దాదా పు అందరూ ఈ ప్యాకేజీ లు వాడుతూ తమకు ఇష్టమైన యాప్‌లు చూస్తూ ఈ ప్రపంచంలో కనీసం తమ ఇళ్లలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో మొత్తం సమయా న్ని ఒంటరిగా గడుపుతున్న పరిస్థితి...ఈ ఒంటరితనం సమయాన్నే మంచి మహాద్భుతమైన అవకాశంగా అందిపుచ్చుకుని కార్పొరేట్ ప్రపంచం, వివిధ నెట్వర్క్ సంస్థలు, యాప్‌లు వివిధ సంస్థలు పెద్ద పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ లక్షల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు.. ఈ ఒంటరితనం పోగొట్టుకునే క్రమంలోనే యువత, మహిళలు అనేక అసాంఘిక కార్యకలాపాలకు, చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నా రు. కొందరు మత్తుకు,





మైకానికి లోనవుతుంటే, మరి కొందరు అశ్లీల కార్యక్రమాలకు, వివాహేతర సంబంధాలకు, అక్రమ సంబంధాలకు, హింసా ప్రవృత్తికి లోనవుతున్నారు.. ఇటీవల కాలంలో చాలా హత్యలు, అఘాయిత్యాలు రోజురోజుకి పెచ్చరిల్లిపోవడానికి ప్రత్యక్ష కారణం ఒంటరితనం అయితే, పరోక్షంగా సెల్ ద్వారా అందుబాటులోకి వచ్చిన వివిధ రకాల యాప్‌లు... ఆన్లైన్ గేమ్‌లు, బెట్టింగ్ వ్యాపారాలు, వీడియో గేమ్స్, సులభంగా డబ్బులు సంపాదించే మార్గాలు తెలిపే యాప్‌లు, వీడియోలు, యూట్యూబ్ ఛానెల్స్, రీల్స్, షార్ట్ ఫిల్మ్ ఇలా లెక్కలేనన్ని సౌకర్యాలు అందుబాటులోకి కార్పోరేట్ సంస్థలు, పరిశ్రమలు, నెట్వర్క్ సంస్థలు తీసుకుని రావడంతో లక్షల కోట్ల రూపాయ లు వ్యాపారాలు చేస్తూ, కోట్ల రూపాయలు లాభాలు గడిస్తున్నారు.. ఒకపూట తిండి లేకపోయినా ఫర్వాలేదు కానీ ఒక నిమిషం ఫోన్, నెట్వర్క్ లేకుండా నేటి ప్రజలు ఉండలేకపోతున్నారు అంటే అతిశయోక్తికాదు...ఈ విధంగా సెల్ మాయాజాలంలో ఒంటరితనం పోగొట్టుకునే క్రమంలోనే జీవితాన్ని ఏ రకమైన చైతన్యం, సృజనాత్మకత లేకుండా గడుపుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.. ముఖ్యంగా యువత చాలామంది అనవసరమైన సామాజిక మాధ్యమాల్లో విహరించడం వల్ల చెడు వ్యసనాలకు బానిసలవుతూ సమాజంలో అసాంఘిక శక్తులుగా మారుతూ దేశానికి అతిపెద్ద సామాజిక సమస్యగా తయారవుతున్నారు.. శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్యాలకు, మానసిక రుగ్మతలకు లోనవుతున్నారు. ముఖ్యంగా ఒంటరితనం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొన్ని డేటింగ్ యాప్‌లు లాభా లు గడిస్తున్నారు.. ముఖ్యంగా 'గ్లీడెన్' యాప్‌లో ఇప్పటికే మనదేశంలో 40 లక్షలు మందికి పైగా చేరారు అంటే ఎంత భయంకరంగా అనుచిత ప్రవర్తనకు ప్రజలు లోనవుతున్నారో అర్థం అవుతుంది. ఇంకో విచి త్రం ఏమిటంటే పెళ్ళైన మహిళలు కూడా ఇటువంటి యాప్‌లలో సభ్యులుగా చేరడం కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడానికి కారణం అవుతుంది.

ఐ.ప్రసాదరావు
, 9390509791

## మేఘాలయలో బిజెపిలోకి 8మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు

**గువహతి :** క్రిష్టియన్ మెజారిటీ రాష్ట్రం మేఘాలయలో బిజెపి పంటపండింది. యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ (యుడిపి)కి చెందిన 8మంది ఎమ్మెల్యేలు బుధవారం బిజెపి గూటికి చేరారు. దాంతో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) తర్వాత రెండవ పెద్ద పార్టీగా బిజెపి అవతరించింది. ఫిరాయింపుదారులు న్యూఢిల్లీలో బిజెపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ఈ ఫిరాయింపులతో శాసన సభలో యుడిపి బలం 12నుంచి4కు తగ్గగా, బిజెపి బలం 2నుంచి 10కి చేరింది. యుడిపి, బిజెపి రెండూ కూడా ఎన్‌పిపి నాయకత్వంలోని పాలక మేఘాలయ డెమొక్రటిక్ అలయెన్స్ ప్రభుత్వంలో భాగస్వాములు. బిజెపిలోకి 8మంది ఫిరాయింపుదారులను చేర్చుకుంటున్నట్లు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంబిట్ పాత్రా కేంద్రమంత్రి కిరణ్ రిజుజు సమక్షంలో ప్రకటించారు. తమ ఎన్‌పిపికి ఎట్టి ప్రమాదం లేదని ముఖ్యమంత్రి కన్రాడ్ కె సంగ్మా వ్యాఖ్యానించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ శాఖ (భూ సేకరణ)
ఫారం - 6
(చట్టం -30/2013 లోని సెక్షన్ 11 (1) లోని సబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం )
ప్రాథమిక నోటిఫికేషన్

G1/5652/2026 తేది: 08.09.2026
నెం. సి/40/2026 తేది: 02.09.2026

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, నార్కెట్ పల్లి మండలం చెర్వుగట్టు గ్రామం, నందు భూమి విస్తీర్ణం: **ఎ. 7.36 1/2 గుంటల** పట్టా భూమి ప్రజా ప్రయోజనార్థం ఉదయాసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో భాగంగా కుడి ప్రధాన కాలువ యొక్క D2-2R మైనర్ కి.మీ. 0.537 నుండి కి.మీ. 1.121 మరియు కి.మీ. 1.788 నుండి కి.మీ. 2.975 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013 లోని సెక్షన్ (11) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి. ఓ. యం. ఎస్. నెం.54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్ & ఆర్ / 2ఎ) (క్యాడ్ & డిపార్టుమెంటు) తేది: 25.07.2017 నాడు జారీ చేసినారు అట్టి జి.ఓ. నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యయము II & III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, నార్కెట్‌పల్లి మండలం, చెర్వుగట్టు గ్రామం, విస్తీర్ణం **ఎ.7.36 1/2 గుంటల** పట్టా ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారిచేయనైనది.

మండలం: నార్కెట్‌పల్లి గ్రామం: చెర్వుగట్టు జిల్లా: నల్లగొండ

| క్ర. సం. | సర్వే నెం./ భూమి స్వభావము విస్తీర్ణం (ఎ.గుం) | భూసేకరణ విస్తీర్ణం ఎ.గుం. | పట్టాదారు / ఎంజాయర్ పేరు, భర్త/తండ్రి పేరు | చెట్లు / నిర్మాణాలు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 765 పట్టా/ తరి 1.23 1/2 | 0.00 1/2 | వేముల నర్సింహ తండ్రి మైసయ్య | -- |
| 2 | | 0.09 | జింకల ఆనందం తండ్రి మల్లయ్య | 1 బోరు, పైప్ లైన్, 25 నిమ్మ చెట్లు, 1 వేప చెట్లు |
| 3 | | 0.07 3/4 | వేముల నర్సింహ తండ్రి మైసయ్య | పైప్ లైన్, 2-తాటి చెట్లు |
| | | 0.07 34 | వేముల ఎల్లయ్య తండ్రి మైసయ్య | 2 సమాధులు, 1 దర్గా, పైప్ లైన్ |
| 4 | | 0.38 1/2 | వేముల వెంకన్న తండ్రి మైసయ్య | పైప్‌లైన్ |
| 5 | 766 పట్టా/ తరి 1.14 1/2 | 0.09 | నకిరేకంటి స్వామి తండ్రి రామచంద్రయ్య | 1 బోరు, పైప్ లైన్, 2 టేకు, 8 వేప చెట్లు |
| 6 | | 0.28 | బొబ్బలి సైదులు తండ్రి గంగయ్య | 6 తాటి చెట్లు, 02 వేప,పైప్ లైన్ |
| 7 | | 0.17 1/2 | శీగా సత్తయ్య తండ్రి ఎల్లయ్య | -- |
| 8 | 482 పట్టా/ తరి 0.38 1/2 | 0.21 1/2 | బొబ్బలి సోమయ్య తండ్రి లచ్చయ్య | 2 సమాధులు, 2 వేప చెట్లు |
| 9 | | 0.06 1/2 | దాసరి ముత్తయ్య తండ్రి సాయిలు | 5 తాటి చెట్లు |
| 10 | | 0.10 1/2 | దాసరి ముత్తయ్య తండ్రి సాయిలు | -- |
| 11 | 481 పటా/ తరి 0.11 1/2 | 0.04 | జంగిలి సైదులు తండ్రి లింగయ్య | 1 బోర్, పైప్ లైన్ |
| | | 0.04 | జంగిలి మల్లిఖార్జున్ తండ్రి లింగయ్య | 1 బావి, 1 బోరు, పైప్ లైన్, ఫెన్సింగ్ |
| | | 0.03 1/2 | జంగిలి మహేశ్ తండ్రి లింగయ్య | 1 బోరు, పైప్లైన్, 4 వేప చెట్లు |
| 12 | 480 పట్టా/ తరి 0.36 | 0.11 1/2 | జంగిలి వెంకన్న తండ్రి సైదులు | 1 బావి, 2 బోరు, పైప్ లైన్ |
| 13 | | 0.11 1/2 | జంగిలి శేఖర్ తండ్రి సైదులు | |
| 14 | | 0.04 1/4 | యాస మల్లారెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్‌లైన్ 1 బోరు, పైప్ లైన్ |
| 15 | | 0.04 1/4 | యాస మోహన్ రెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 16 | | 0.04 1/2 | యాస నర్సి రెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 17 | 485 పట్టా/ తరి 0.31 1/2 | 0.01 1/2 | యాస మల్లారెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 18 | | 0.01 1/2 | యాస మోహన్ రెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 19 | | 0.02 | యాస నర్సిరెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 20 | | 0.26 1/2 | తునుపునూరి ప్రభాకర్ తండ్రి సత్తయ్య | పైప్ లైన్ |
| 21 | 486 పట్టా / తరి 0.23 | 0.23 | జాల జానయ్య తండ్రి సాయిలు | పైప్ లైన్ |
| 22 | 471 పట్టా/ తరి 0.14 | 0.02 1/4 | జాల జానయ్య తండ్రి సాయిలు | -- |
| 23 | | 0.10 | జీట్లా సరిత భర్త నాగరాజు | -- |
| 24 | | 0.01 3/4 | జాల జానయ్య తండ్రి సాయిలు | -- |
| 25 | 470 పటా/ తరి 0.22 | 0.08 | జాల జానయ్య తండ్రి సాయిలు | పైప్ లైన్ |
| 26 | | 0.14 | వంగల సత్యనారాయణ రెడ్డి తండ్రి చంద్రా రెడ్డి | పైప్ లైన్ |
| 27 | 469 పటా/ తరి 0.22 | 0.07 | వంగల సత్యనారాయణ రెడ్డి తండ్రి చంద్రా రెడ్డి | పైప్ లైన్ |
| 28 | | 0.03 | మేకల కాంతమ్మ భర్త పట్టాబి | పైప్ లైన్ |
| 29 | | 0.10 | రేగట్టే లింగారెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి | పైప్ లైన్ |
| | | | రేగట్టే వెంకట్రాం రెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి | -- |
| 30 | | 0.02 | రేగట్టే లింగారెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి | పైప్‌లైన్ |
| 31 | | | రేగట్టే వెంకట్రాం రెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి | పైప్‌లైన్ |
| | మొత్తము | 7.36 1/2 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 ( చట్టం నెం. 30/2013) లోని నియమంలోని సెక్షన్ 11 (1) సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ఆర్ & ఎల్.ఎ., విభాగం-2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్. నెం. 6, జి. వి. గూడెం, నల్గొండ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ఆర్ & ఎల్.ఎ. విభాగం-2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, మరియు నష్ట పరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్-15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఎ. విభాగము2, నల్గొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఏ. విభాగం-2, నల్లగొండ.
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్లగొండ.
సం/- జిల్లా కలెక్టర్, నల్లగొండ.
DIPR RO NO. 903/LA/PP/Advt/Pub/2026-27

# 2030 నాటికి పేదరిక నిర్మూలన

- 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- రాష్ట్ర అభివృద్ధి కార్యాచరణకు వేగం పెంచే దిశగా కీలక నిర్ణయాలు
- టిఎస్‌డిపిఎస్ బలోపేతం..
- ప్రత్యేక పిఎంయు ఏర్పాటు
- జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్ రూపకల్పన
- ప్రభుత్వం జిఎఫ్ఎస్‌టి భాగస్వామ్యానికి ప్రతిపాదన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచనుంది. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌కు చెందిన జిఎఫ్ఎస్‌టి వైస్ చైర్మన్ ఎస్.పి.టక్కర్, జిఎఫ్ఎస్‌టి ప్రతినిధులు, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, అమలు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, అభివృద్ధి ఫలితాలను నిరంతరం పర్యవేక్షించేలా వ్యవస్థలను రూపొందించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఆ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం (టిఎస్‌డిపిఎస్) ను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పిఎంయు) ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను పిఎంయు నిర్వహించనున్నారు.

### 2030 నాటికి 'జీరో పావర్టీ'

2030 నాటికి తెలంగాణను 'జీరో పావర్టీ' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక, లక్ష్యిత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి, వారికి అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంతో పాటు స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల ఫలితాలను కొలిచేందుకు, పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలంగాణను 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన, కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించనున్నారు. రాష్ట్రంలోని బలాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సమ్మిళిత అభివృద్ధికి కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

### రంగాల వారీ నిపుణుల సేవలు

రాష్ట్ర ప్రభుత్వ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన నిపుణులు, కన్సల్‌టెంట్ల సేవలను వినియోగించుకోనున్నారు. ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక సహకారాన్ని నిపుణుల ద్వారా పొందనున్నారు. వ్యూహాత్మక ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నాలెడ్జ్ సపోర్ట్, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, కీలక అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు తెలంగాణ ప్రభుత్వం జిఎఫ్ఎస్‌టి మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకునే ప్రతిపాదనను సిద్ధం చేస్తారు.

### జిల్లాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

రాష్ట్ర స్థాయి అభివృద్ధి లక్ష్యాలను జిల్లాల స్థాయిలో కొలిచే వీలున్న ఫలితాలుగా మార్చేందుకు సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఈ ప్రణాళికలకు డేటా ఆధారిత డ్యాష్‌బోర్డులు, స్పష్టమైన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కెపిఐలు), కొలిచే వీలున్న ఫలితాలు, బడ్జెట్ అనుసంధానం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో జిల్లాల అభివృద్ధి పురోగతిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు లోటుపాట్లను గుర్తించి, అవసరమైన చోట సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

### ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్

ప్రభుత్వ శాఖలు, రంగాల నిపుణులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అభివృద్ధి సంస్థలు, ఇతర కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్‌సను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ గ్రోత్ ల్యాబ్స్‌లో ప్రధానంగా పేదరిక నిర్మూలన, మౌలిక వసతులులాజిస్టిక్స్, ఆరోగ్యం, పర్యాటకం, పశుసంపద ఆక్వాకల్చర్, పట్టణీకరణ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ అంశాలపై దృష్టి సారించనున్నారు. అభివృద్ధి అవకాశాలను గుర్తించడం, అమలులో ఉన్న అవరోధాలను పరిష్కరించడం, రంగాల వారీ వ్యూహాలను రూపొందించడం, ప్రాధాన్యతలను కాలపరిమితితో కూడిన, కొలిచే వీలున్న కార్యాచరణ ప్రణాళికలుగా మార్చడం గ్రోత్ ల్యాబ్స్ ప్రధాన ఉద్దేశంగా ఉంటుందని తెలిపింది.

### ఫలితాల ఆధారంగా అభివృద్ధి

టిఎస్‌డిపిఎస్ పిఎంయు బలోపేతం, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్, రంగాల నిపుణుల సేవలు, ప్రభుత్వం జిఎఫ్ఎస్‌టి భాగస్వామ్యం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు, ఫలితాలపై దృష్టి, మిషన్ మోడ్‌లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఈ వ్యవస్థ దోహదపడనుంది. 2030 నాటికి పేదరిక నిర్మూలన, 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు రాష్ట్ర అభివృద్ధి దార్శనికతను కార్యాచరణలోకి తీసుకురావడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని సమావేశంలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కేంద్రం దిగుమతి సుంకాన్ని తగ్గించడం... ఆయిల్ పామ్ రైతులను దగా చేయడమే

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించడం ఆయిల్‌పామ్ రైతులను దగా చేయడమేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్య క్తం చేశారు. ఒకవైపు రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రో త్సహిస్తూ, మరోవైపు దిగుమతి సుంకాన్ని తగ్గించడం కేంద్ర ప్రభుత్వ ధ్వంధ్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు.ఒక చేత్తో రైతులను ఆయిల్‌పామ్ వైపు నడిపిస్తూ.. మరో చేత్తో విదేశీ పామాయిల్‌కు మార్కెట్ సులభతరం చేయడం ఏ విధమైన రైతు అనుకూల విధానమని మంత్రి ప్రశ్నించారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశీ పామాయిల్ దిగుమతులకు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్‌పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశీయ ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దిగుమతి సుంకాన్ని44 శాతానికి పెంచాలని కోరుతుంటే.. కేంద్రం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించడం ఆందోళన కలిగించే పరిణామమని మంత్రి పేర్కొన్నారు. రైతులకు ధర భరోసా కల్పించాల్సిన సమయంలో దిగుమతులను చౌక చేసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఆయిల్ పామ్ దీర్ఘకాలిక పంట అని, మొక్క నాటినప్పటి నుంచి రైతు సంవత్సరాల పాటు నీరు, ఎరువులు, నిర్వహణపై పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని తుమ్మల తెలిపారు. సాగులోకి వచ్చిన తర్వాత విధానపరమైన మార్పులతో మార్కెట్ ధరలపై ప్రతికూల ప్రభావం పడితే నష్టపోయేది రైతులేనన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెద్ద ఎత్తున విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకుపైగా రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని చెప్పారు. పెట్టుబడి రాయితీలు, మొక్కల విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్, మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.కేంద్రం కూడా దేశీయ ఆయిల్‌పామ్ ఉత్పత్తిని పెంచి, వంట నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఎన్ఎంఇఒఒపి ద్వారా లక్ష్యాలు నిర్దేశిస్తోందని మంత్రి గుర్తుచేశారు. అయితే సాగు విస్తరణకు ప్రోత్సాహం ఇస్తూనే దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల రైతుల్లో అనిశ్చితి ఏర్పడుతుందని అన్నారు. ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర కల్పించాలన్నది తెలంగాణ రైతుల ప్రధాన డిమాండ్ అని మంత్రి తెలిపారు. దేశీయ రైతులకు స్థిరమైన ధర భరోసా కల్పించే విధానాన్ని కేంద్రం రూపొందించాలని కోరారు. దేశ అవసరాల్లో గణనీయమైన భాగం వంట నూనెల దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో దేశీయ ఆయిల్‌పామ్ ఉత్పత్తిని పెంచడం అత్యవసరమని తుమ్మల అన్నారు. దేశీయ రైతు నిలబడితేనే దేశం నిలబడుతుంది. రైతును బలోపేతం చేయకుండా దిగుమతులను చౌక చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ సాధ్యం కాదు అని పేర్కొన్నారు.కేంద్రం దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించాలని దేశీయ ఆయిల్‌పామ్ రైతులకు ధర రక్షణ కల్పించే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని మంత్రి డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ

- ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలి
- పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు పెంచాలి
- అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తృతం చేసి పెట్టుబడులు, ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచాలని సూచించారు. పర్యాటక అభివృద్ధి అంటే కేవలం ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడం మాత్రమే కాదని, తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో గురువారం పర్యాటక, సాంస్కృతిక శాఖల ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాజెక్టులు, శాఖ ఆస్తుల వినియోగం, బడ్జెట్ కేటాయింపులు, ప్రైవేట్ పెట్టుబడులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, పర్యాటక బ్రాండింగ్‌పై చర్చించారు.

### పిపిపి విధానంలో కొత్త ప్రాజెక్టులు

పర్యాటక శాఖకు చెందిన భవనాలు, ఖాళీ స్థలాలు, ఇతర ఆస్తులను గుర్తించి పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలో అభివృద్ధి చేయాలని భట్టి సూచించారు. ఆదాయాన్ని సమకూర్చేలా ఆస్తులను వినియోగించడంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే చర్యలు చేపట్టాలన్నారు. పెట్టుబడిదారులకు ఎదురవుతున్న లీజు విధానాలు, ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యత తదితర సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హిల్ టూరిజాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. హైదరాబాద్‌కు వచ్చే దేశీయ, విదేశీ పర్యాటకులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌లను రూపొందించాలన్నారు. హోటళ్లు, రిసార్టులు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద పరిరక్షణకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. రామప్ప వంటి చారిత్రక ప్రదేశాల్లో పరిరక్షణ, నిర్వహణ, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరిరక్షణ బాధ్యతలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టుల మధ్య సమతుల్యత పాటించాలన్నారు. విద్యార్థుల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంచేందుకు 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. విద్యార్థులను చారిత్రక ప్రదేశాలు, మ్యూజియంలు, ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా రాష్ట్ర వారసత్వంపై అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ పెట్టుబడులు, ఉపాధి, ఆదాయం పెరిగేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ స్నిగ్ధా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## డిఎస్‌పి అక్రమాస్తుల కేసులో కొనసాగుతున్న ఎసిబి సోదాలు

- 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు.. బినామీల ఇళ్లలో కీలక పత్రాలు స్వాధీనం
- బొమ్మ వెంకటేశ్ ఇంట్లో రూ.1.35 కోట్ల నగదు.. విదేశీ కరెన్సీ, 14 లీటర్ల విదేశీ మద్యం గుర్తింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగం డిఎస్‌పి సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) సోదాలు కొనసాగుతున్నాయి. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా గురువారం హైదరాబాద్, జహీరాబాద్ పరిధిలోని 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన ఎసిబి అధికారులు, అనుమానిత బినామీల ఇళ్ల నుంచి కేసుకు సంబంధించిన పలు కీలక పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఎసిబి వివరాల ప్రకారం.. డిజిపి కార్యాలయంలో పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ డిఎస్‌పిగా పనిచేస్తున్న సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు గత జూన్ 27న నమోదు చేశారు. అవినీతి నిరోధక చట్టం1988లోని సెక్షన్ 13(1)(బి)తో పాటు 13(2) కింద సిటీ రేంజ్2 ఎసిబి కేసు నమోదు చేసింది. ఈ కేసులో భాగంగా గతంలో నిర్వహించిన సోదాలకు కొనసాగింపుగా తాజా తనిఖీలు చేపట్టారు. భీమ్‌రెడ్డితో ఆర్థిక, ఇతర లావాదేవీలు ఉన్నట్లు అనుమానిస్తున్న బినామీల నివాసాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎసిబి అధికారులు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను సేకరించారు. ఈ క్రమంలో బొమ్మ వెంకటేశ్ అనే వ్యక్తి నివాసంలో రూ.1.35 కోట్ల నగదు గుర్తించినట్లు ఎసిబి వెల్లడించింది. అదే విధంగా విదేశీ కరెన్సీతో పాటు సుమారు 14 లీటర్ల విదేశీ మద్యం కూడా లభ్యమైనట్లు తెలిపింది. విదేశీ మద్యం గుర్తించిన విషయాన్ని ఎసిబి అధికారులు ఎక్సైజ్ శాఖకు తెలియజేశారు. దీనిపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నారు. అవసరమైన కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఎసిబి పేర్కొంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని ఎసిబి తెలిపింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు, నగదు, ఇతర వస్తువుల ఆధారంగా తదుపరి దర్యాప్తు చేపట్టనున్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై స్పష్టత ఇవ్వాలి

- పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే
- అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరూ కూడా తొలగించొద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓటర్ల హక్కుల విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పలు అంశాలపై ఆయన స్పందించారు. గత పది నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెలువడిన నివేదికలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం6లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడానికి అనుసరించిన ప్రక్రియ, చట్టపరమైన ఆధారాలను వెల్లడించాలన్నారు. తొలిసారి ఓటు హక్కు పొందే యువతకు అనవసర ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఇసిఐనెట్ ద్వారా ఓటర్ల డేటాలో మార్పులు చేసే విషయంలో ఎన్నికల నమోదు అధికారుల (ఇఆర్ఓ) పాత్ర, పర్యవేక్షణపై స్పష్టత ఇవ్వాలన్నారు. డేటాలో మార్పులు ఎవరు, ఎప్పుడు, ఏ కారణంతో చేశారనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించిన ఓటర్ల పేర్లు, అందిన అభ్యంతరాలు, తిరిగి చేర్చిన పేర్ల వివరాలను రాష్ట్రాలు, నియోజకవర్గాల వారీగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని ఆ సంస్థ వర్గాలు పేర్కొన్న నేపథ్యంలో, అభ్యంతరాలపై పూర్తి వివరాలను వెల్లడించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. తెలంగాణలో అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని పొన్నం స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడాలని, అనర్హమైన పేర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

## విధి నిర్వహణలో ఎస్ఐ వెంకన్న మృతి బాధాకరం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణేష్ నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కొత్తగూడెం టూ టౌన్ ఎస్ఐ కె. వెంకన్న మృతి చెందడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ వెంకన్న ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని పేర్కొన్నారు. ఆయన మృతి కుటుంబానికే కాకుండా మొత్తం పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులకు సిఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

క్ర.సం.1, **పని పేరు:** శామీర్‌పేట్ వార్డ్ నెం.300, కీసర సర్కిల్-01, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసిలోని శామీర్‌పేట్ చెరువు నుంచి చెత్త, శిధిలాలను టిప్పర్లు, జెసిబి సహాయంతో లేబర్ ద్వారా జవహర్‌నగర్‌కు తరలించడం, **అంచనా విలువ:** రూ.4.95లక్షలు, **బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేది & సమయం:** 25.09.2026 ఉ.10:30గం.ల నుండి 26.10.2026 ఉ.10:30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి
DIPR R.O. No. : 10602-PP/CL/ADVT/2026-27, Date: 24-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I**

| NIT No. | పని పేరు | QTY | బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| కొటేషన్ నోటీసు నెం. 10/HD/EE-I/ MKJ ZONE/ MMC/26-27, Dated: 24.09.2026 | అవసరమైన టోనర్ / ఇంక్ సరఫరా మరియు అన్ని అనుబంధ ఖర్చులతో సహా, కార్యాలయ ప్రాంగణంలోనే ప్రింటర్ కాట్రిడ్జ్‌లను రీఫిల్ చేయడం. | Each | 25.09.2026 ఉ.11.30గం.ల నుండి 28.09.2026 ఉ.11.30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, సెల్ నెం. 9154796465 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 10637-PP/CL/ADVT/2026-27, Date: 24-09-2026

## కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చరవాణిలో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన జలశయాల్లో నీటి మట్టం పరిస్థితి, లోతట్టు ప్రాంతాల పరిస్థితితో పాటు ఇతర అంశాలను అడిగి తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పరిస్థితిని అడిగి తెలుసుకుని వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల తెలిపారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలకు 41 నామినేషన్లు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి 41 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, ముఖ్య ప్రణాళికాధికారి ఎ. శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. మొత్తం 41 మంది నామినేషన్లు దాఖలు చేశారన్నారు. సెప్టెంబర్ 25 శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 26 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, మధ్యాహ్నం మూడు గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటిస్తామని తెలిపారు. పోలింగ్ అక్టోబర్ నాలుగున ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఖమ్మం నగరంలోని ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద గల టిటిడిసి భవన్‌లో పోలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు.

## తుపాన్ బాధితులను ఆదుకోవాలి

### సిపిఐ మండల కార్యదర్శి

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆర్నాబ్ తుఫానుతో నష్టపోయిన బాధితులను వెంటనే ఆదుకోవాలని సిపిఐ నాయకులు అధికారులను కోరారు. మండల పరిధి దంతెలబోర ఎస్‌సి కాలనీలో బుధవారం రాత్రి బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నాబ్ తుఫాన్ కారణంగా బలమైన గాలులు వీచటంతో పలువురు పేదల ఇండ్లు, రేకులు ఎగిరిపోయాయి. దీనితో నిత్యావసర సరుకులు తడిసిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న బాధితులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశాల మేరకు ఎంపిడిఓ రాజారావు, రెవెన్యూ, విద్యుత్ అధికారులతో కలిసి గురువారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు మాట్లాడుతూ ఆర్నాబ్ తుఫాన్ వలన నష్టపోయిన ఒక్కో కుటుంబాలకు నిత్యావసరాల కోసం రూ.50వేల చొప్పున పూర్తిగా ఇళ్లు దెబ్బతిన్నవారికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం తక్షణమే అందజేయాలన్నారు. దెబ్బతిన్న ఇండ్ల స్థానంలో ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసి త్వరితగతిన ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, కూరగాయలు పండించుకొని జీవనం సాగిస్తున్న రైతు వెంకటేశ్వర్లు పంట పూర్తిగా ధ్వంసమయిందని కావునా వెంటనే తక్షణ సహాయం కింద రైతుకు 1,50,000/లు అందించి ఆదుకోవాలన్నారు. జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, సిపిఐ అనుబంధ రైతు సంఘం మండల నాయకులు కోలేటి రాంబాబు, నారాయణరావుపేట సర్పంచ్ బండ సరస్వతి, ప్రశాంత్, నాయకులు రవి, భాస్కర్, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, తాళ్ళ వెంకటేశ్వర్లు, తులశమ్మ, పంచాయితీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిమెంట్లను వెంటనే అమలు చేయాలి

### ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** ఆర్ఎల్‌సి సమక్షంలో ఎఐటియుసితో సింగరేణి యాజమాన్యం కుదుర్చుకున్న 24 అగ్రిమెంట్లను వెంటనే అమలు చేయాలని ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను పారదర్శకంగా ప్రకటించి, అందులో కార్మికులకు 40 శాతం వాటా ఇవ్వాలని కోరారు. మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ పాలసీని పరిష్కరించి అర్హత, సీనియారిటీ ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలని, కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఏరియాలో నెలకు ఒకసారి 'డయల్ టు జీఎం' నిర్వహించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కోసం నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించకుండా సింగరేణి కార్మికులతోనే బొగ్గు వెలికితీయాలని, సంస్థ విస్తరణతో ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. గ్యాసిపికేషన్‌కు అనుకూలంమైన గనులపై శాస్త్రీయ అధ్యయనం చేయాలని, స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రంగయ్య కోరారు. అగ్రిమెంట్ల అమలులో జాప్యం చేయకుండా కార్మికుల హక్కులు, రక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి ఆస్తుల జప్తు

### రూ.21.15 లక్షల విలువైన రెండు కార్లు, బైక్, బ్యాంకు ఖాతా సీజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గంజాయి అక్రమ రవాణా కేసులో నిందుతుడు పల్లపు రఘుకు చెందిన ఆస్తులను జప్తు చేశారు. ఆయనకు చెందిన రెండు కార్లు, మోటార్ సైకిల్, అతని భార్య బ్యాంకు ఖాతాను పోలీసులు జప్తుచేయగా మొత్తం 21.15,907 ఆస్తులగా పోలీసులు పేర్కొన్నారు. ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో 2025 ఆగస్టు 28న నమోదైన కేసులో ఆర్థిక దర్యాప్తు చేపట్టి చెన్నై కాంపిటెంట్ అథారిటీ నుంచి ఫ్రిజింగ్ ఆర్డర్ పొందిన అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ చర్యలు తీసకున్నట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆస్తులు జప్తు చేసేలా దర్యాప్తు చేసిన సిఐ ఎస్ఐ సిబ్బందిని ఎస్‌పి రోహిత్ రాజ్ అభినందించారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్టీసి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తలు పనిచేయాలని ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు పిలుపునిచ్చారు. ఆర్టీసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ ఎన్ఎంయు కలిసి పోటీ చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. మరి కొన్ని సంఘాలతోనూ పొత్తు కలిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం రీజియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం స్థానిక గిరి ప్రసాద్ భవన్‌లో జరిగింది. రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ప్రతి డిపోలోనూ కార్మికులను కలిసి ఎంప్లాయీస్ యూనియన్ విధానాలను వివరించడంతో పాటు ఆర్టిసి మనుగడ, కార్మికుల డిమాండ్లు ఎంప్లాయీస్ యూనియన్ పోరాడి సాధించిన విజయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అప్పారావు కోరారు. రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్, నాయకులు ఎంఆర్‌సిరావు, అరుణకుమారి, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

# టోర్నడో బీభత్సం



### కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి
### రాగల 48గం.లలో అతిభారీ వర్షాలు, ఈదురు గాలులు
### పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
### రైతుల్లో ఆనందం, ఆందోళన
### కొత్తగూడెం నియోజకవర్గంలో కూనంనేని పరామర్శ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అల్పపీడన ద్రోణి కారణంగా టోర్నడో బీభత్సాన్ని సృష్టిస్తోంది. భద్రాద్రి జిల్లాలో వర్షాలు కుండపోతగా పడుతుండగా ఈదురు గాలులు తోడయ్యాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వర్షాల ధాటికి వాగులు వంకలు పొంగిపొర్లుతుండటంతో పాటు చెరువులు కుంటల్లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. వర్షంతో పాటు ఈదురు గాలుల బీభత్సానికి బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర్ ప్రాంతం పూర్తిగా దెబ్బతిన్నది. ఆ ప్రాంతాలోని దుకాణాలపై ఉన్న రేకు కప్పులతో పాటు సమీప ఇళ్లలోని పలు సామాన్లు ఈదురు గాలిలో చెల్లా చెదురయ్యాయి. అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట మండలంలో ఈదురు గాలులకు పలు చెట్లు నేలకొరిగాయి, పామాయిలు చెట్లు సైతం వేళ్లతో సహా ప్రక్కకు ఒరిగాయి. పలెల్లో గొడ్ల చావడ్లు, రేకుల ఇళ్ల పై కప్పులు గాలిధాటికి లేచిపోయాయి. వర్షాల కారణంగా విద్యా సంస్థలకు మరో రోజు సెలువులు ప్రకటించినప్పటికీ రాగల 48 గం.ల పాటు ఈదురుగాలులతో కూడిన వర్ష ప్రభావం ఉండనుండటంతో సెలవులు పొడిగించే అవకాశం ఉంది.

**జలకళ :** కొండలు అటవీ ప్రాంతాల నుండి వరదనీరు దిగువకు చేరుతుండటంతో జిల్లాలోని పలువాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షానికి తెలంగాణాలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి వర్షపునీరు వచ్చి చేరుతోంది. కిన్నెరసాని నిండుకుండలా మారుతోంది. పెద్దవాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది.

నీటి ఉధృతి కారణంగాప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని గుబ్బలమంగి వాగు పెద్ద ఎత్తున పారుతోంది. మరోపక్క వాగులు వంకలు పొంగటంతో నీరు రోడ్లపైకి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతోంది. ఈదురు గాలులతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు అక్కడక్కడ దెబ్బతింటున్నాయి. చెట్లు నేలకొరుగుతున్నాయి. పాత భవనాలకు దూరంగా ఉండాలని అధికారులు ఇప్పటికే సూచిస్తున్నారు.

**రైతుల్లో ఆందోళన :** వర్షాలు సాగుకు కొంత ఊరటనిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం రైతుల్లో



ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే సాగులో ఉన్న పంట పొలాల్లో నీరి నిలిచిపోవడంతో పంటలపై ప్రభావం పడే అవకాశం ఉంది.

మరోవైపు చెరువులు కుంటలు నిండుతుండటంతో రానున్న రోజుల్లో సాగునీటికి ప్రయోజనంగా మారుతుందని రైతులు ఆశిస్తున్నారు.

**అధికార యంత్రాంగం అప్రమత్తం :**
జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సి అవసరం ఏర్పడింది. వర్షాకారణంగా ఏర్పడే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. వర్షాల తీవ్రత దృష్ట్యా అవసరమైతేనే తప్ప బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. ప్రధా



నంగా పిల్లలు వృద్ధులు ఈదురు గాలులతో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రజలెవ్వరూ నీటి ప్రవాహాల వైపు వెళ్లరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**కూనంనేని పరామర్శ :**
టోర్నడో కారణంగా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పాల్వంచ మండలంలోని దంతెలబోర, బంద్రుగొండ, పరిసర గ్రామాల్లో పలు ప్రాంతాలు దెబ్బతినగా ఆ ప్రాంతాలను ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు గురువారం సందర్శించారు ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులకు, రైతులకు ధైర్యం చెప్పారు. ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలు, ఇళ్లకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా కృషి చేయనున్నట్లు చెప్పారు.

# గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రచించాలి

### మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచాలి : ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర పురోగతి
### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** గ్రామాల సమగ్ర అభివృద్ధికి క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని ఎన్‌కే నగర్ కమ్మ సత్రంలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండలాల పంచాయతీ సర్పంచ్‌లు, సెక్రటరీలు, సిబ్బందికి 'విబి జి రామ్‌జి' పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. శ్రమతో కూడిన పనులు చేసే కుటుంబాలకు 125 రోజుల పనిదినాలు కల్పించేలా, 375 రకాల అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో నీటి భద్రత, మౌలిక వసతులు, స్థిరమైన జీవనోపాధి కల్పన అనే మూడు అంశాలపై ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలు చేసే ప్రతి కార్యక్రమం అర్హులకు చేరేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ విద్యాచంచన, వివిధ



మండలాల ఎంపిడిఓలు, ఎంపిఓలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, టెక్నికల్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటితో విద్యార్థుల అవస్థలు

### ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి
### ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చిన్నపాటి వర్షానికే వసతి గృహంలోకి నీరు చేరి విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఖమ్మం నగరంలోని ఎన్నెస్పి క్యాంపులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ (ఎస్సి) బాలుర వసతి గృహం జలమయమై చెరువును తలపిస్తుంది. వసతి గృహంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి వర్షపు నీటిలోనే ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్‌లు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల హాస్టల్ ఆవరణ మొత్తం నీరు చేరి చెరువును తలపిస్తుందన్నారు. వసతి గృహం చుట్టూ సరైన ప్రహరీ గోడ లేకపోవడంతో బయట నీరంతా హాస్టల్‌లోకి చేరుతుందన్నారు. హాస్టల్ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో విష పురుగులు, దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వర్షపు నీరు ఆవరణలో ఉండడంతో విద్యార్థులు గదుల నుంచి బయటకు రాలేక భోజనం చేసేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి హాస్టల్ ఆవరణలోని నీటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు వసతి గృహానికి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయడంతో పాటు భవనానికి మరమ్మతులు చేపట్టాలన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించక పోతే విద్యార్థులతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



## కిన్నెరసానికి భారీగా వరద

**ప్రజాపక్షం/పాల్వంచ :** బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ఆర్నాబ్ తుఫాన్‌తో ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని ప్రాజెక్టులోకి భారీగా వస్తున్న వరద నీటితో నిండుకుండను తలపిస్తున్నది. ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు. జలాశయం పూర్తి సామర్థ్యం 407 అడుగులకుగాను ప్రస్తుతం 40405.60 అడుగులకు చేరింది. వరద ఉధృతిని బట్టి ఏ సమయంలోనైనా ప్రాజెక్టు గేట్లను ఎత్తటానికి ఆస్కారం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్యాం సైట్ అధికారులు తెలిపారు.

# విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ : బిఆర్ఎస్

### విద్యుత్ కేంద్రాల వద్ద ఆందోళన
### పాల్గొన్న పువ్వాడ అజయ్, వద్దిరాజు తదితరులు

**ప్రజాపక్షం/మణుగూరు/పాల్వంచ :** కాంగ్రెస్ పార్టీ విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేయకపోవడం వల్లనే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ నిలిచిపోతుందని వారు ఆరోపించారు. బిఆర్ఎస్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కొత్తగూడెం, మణుగూరు థర్మల్ విద్యుత్ కేంద్రాలను బిఆర్ఎస్‌నాయకులు సందర్శించారు. అజయ్‌కుమార్ నేతృత్వంలో బిటిపిఎస్ వద్ద ఆందోళన నిర్వహించగా రవిచంద్ర నాయకత్వంలో పాల్వంచలోని కెటిపిఎస్ ఎదుట ఆందోళన నిర్వహించారు. పాల్వంచ, మణుగూరులలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులకు, బిఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. పాల్వంచలో బిఆర్ఎస్ నాయకులను లోపలికి అనుమతించ లేదు. ఈ సందర్భంగా మణుగూరులో నిరసనకారులను ఉద్దేశించి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేసిఆర్ నాయకత్వంలో రైతులకు,



గృహ వినియోగదారులకు, పరిశ్రమలకు 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్‌ను అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది గంటలు మాత్రమే అందిస్తుందని అది విడతల వారీగా అందిస్తుందని ఆయన ఆరోపించారు. మణుగూరులో జరిగిన ఆందోళనలో మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు, బిఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, కట్టా కృష్ణార్జున్‌రావు, నర్సింహారావు, పాల్వంచలో మాజీ శాసన సభ్యులు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, దిండిగల రాజేందర్, రాజు గౌడ్, కార్పొరేటర్లు మధుచంద్, గుణచరిత్, పాల్గొన్నారు.





## 'సుప్రీం' తీర్పుతో ఝలక్

### భద్రాచలం ఉప ఎన్నికపై చర్చ
### బిఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వెంకట్రావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** సుప్రీం కోర్టు తీర్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఖైరతాబాద్ నుంచి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికై ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ ఎంపిగా పోటీ చేసిన దానం నాగేందర్‌ను పార్టీ ఫిరాయింపు చట్టం క్రింద రాష్ట్ర హైకోర్టు అనర్హుడిగా ప్రకటించగా గురువారం సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పుతో ఏకీభవిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీనితో ఇప్పుడు ఖైరతాబాద్‌కు ఉపఎన్నిక అనివార్యమైంది. దానం నాగేందర్‌తో పాటు మరి కొంత మంది శాసన సభ్యులు బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంకు చెందిన తెల్లం వెంకట్రావు బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కారు గుర్తుపై గెలిచారు. గెలిచిన కొద్ది రోజులకే ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇందుకు సంబంధించి తెల్లం వెంకట్రావును అనర్హుడిగా ప్రకటించాలని బిఆర్ఎస్ గడిచిన కొంత కాలంగా ప్రయత్నం చేస్తుంది. కాంగ్రెస్‌లో చేరలేదని, కాంగ్రెస్ కండువాలు కప్పుకోలేదంటూ స్పీకర్‌కు వివరణలు అందించారు. కాంగ్రెస్‌లో చేరినట్లు పలు ఆధారాలను బిఆర్ఎస్ స్పీకర్‌తో పాటు న్యాయస్థానానికి సమర్పించింది. మొత్తంగా దానం నాగేందర్ పట్ల వ్యవహరించిన వైఖరినే పార్టీ మారిన మిగిలిన ఎంఎల్‌ఎల పట్ల బిఆర్ఎస్ వ్యవహరించనుంది.



## ఆపదలో అండగా నిలిచిన ఎమ్మెల్యే పాయం

### ఎల్‌ఒసి ద్వారా రూ.2.20లక్షల వైద్య సాయం అందడంతో అరవింద్ కుటుంబం కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/మణుగూరు :** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ వైద్య చికిత్సలకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తున్న పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్‌కు చేతికి సంబంధించిన ఆపరేషన్ అవసరం కాగా, నిజామ్స్ హాస్పిటల్‌లో చికిత్సకు సుమారు రూ.2,20,000 ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న అరవింద్ కుటుంబానికి సహాయం అందించాలని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెంచల రాము ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి (ఎల్‌ఓసీ) ద్వారా రూ.2,20,000 ఆర్థిక సహాయం మంజూరు చేయించేందుకు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొడిశెట్టి ఖాదర్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, నాయకులు కోడి అశోక్, భూపాలపట్నం సర్పంచ్ భవతి, తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట ప్రభుత్వ బాలికల పాఠశాల దుస్థితిని మార్చండి సారూ..



**ప్రజాపక్షం/కాజీపేట :** కాజీపేట పట్టణంలోని ప్రధాన రహదారికి అనుకుని ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కనీస వసతుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విద్యార్థులకు తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడంతో మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించి దాహార్తిని తీర్చారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నప్పటికీ, భోజనం చేసేందుకు సరైన వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో పాఠశాల ఆవరణలో నీరునిలిచి,విద్యార్థులు నీటిలోనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

## కరెంటు కోతలపై ప్రశ్నిస్తే అరెస్టులా?



**ప్రజాపక్షం/మహదేవపూర్:**కరెంటు కోతలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య గొంతు నొక్కుతున్నారని బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.కరెంటు ఇవ్వలేని ప్రభుత్వం ప్రశ్నించే గొంతును నొక్కుతున్నారని ధ్వజమెత్తారు.బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పవర్ ప్లాంట్ల ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేసారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రైతులకు 24 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గోస పెడుతోందని ఆరోపించారు. ఖరీఫ్ పంటలకు సరిపడా నీరున్నా కరెంటు లేక పంటలు ఎండిపోతున్నాయని ప్రజలు అధికారం ఇచ్చింది రైతులను ఇబ్బంది పెట్టడానికేనా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ప్రభుత్వం ఆత్మ పరిశీలన చేసుకోవాలని చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు,మహిళా నాయకురాలు కేదారి గీత బాయి,అలీం ఖాన్,కురతోట శ్రీహరి,బిల్ల కుమార్,వెన్నపెల్లి మహేష్,రేవెల్లి రాజశేఖర్,ఇస్రియాక్,కడారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

**ప్రజాపక్షం/జనగామ:** గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టిన సమగ్ర అభివృద్ధి సాధించడమే వికసిత్ గ్రామ పంచాయితీ ప్రణాళిక లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. కలెక్టరేట్‌లో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు ప్రణాళిక అమలుపై శిక్షణ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాంలు, రీచార్జ్ పిట్లు, డ్రిప్ ఇరిగేషన్, మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ రహదారులు, డ్రైనేజీలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పంచాయితీ భవనాలు, పారిశుధ్య, సోలార్, తదితర మౌలిక వసతుల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. వివిధ శాఖల అధికారులు భాస్కర్, సూరి, భాస్కర్, అంబిక సోని, వెంకటరెడ్డి, రాజా ప్రతాప్, మురళీధర్‌రావు, రవీందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## 'సుప్రీం' తీర్పు కీలక పరిణామం

**ప్రజాపక్షం/జనగామ:** దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించడం పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో కీలకపరిణామమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రజా తీర్పును గౌరవించాల్సిందేనని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు పార్టీ మారడం ప్రజా తీర్పును అవమానించడమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ఫిరాయింపులను ప్రోత్సహించకుండా రాజ్యాంగ నిబంధనలను పాటించాలని డిమాండ్ చేశారు.

## మూడు రోజులు బ్యాంకు సమ్మె

**ప్రజాపక్షం/నెక్కొండ:** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుండి 30 వరకు మూడు రోజుల బ్యాంకు సమ్మె ప్రతిపాదించినట్లు ఎస్‌బిఐ తెలిపింది. సమ్మె ప్రభావంతో ఖాతాదారులకు అసౌకర్యం కల్గకుండా అవసరమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఖాతాదారులు ముఖ్యమైన లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని, నగదు అవసరాలకు ఎటిఎంలు, సిడిఎస్‌లు, యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపిఐ వంటి డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## తెలంగాణ యాసకు వెండితెరపై కొత్త గౌరవం

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ యాసకు వెండి తెరపై కొత్త గౌరవాన్ని తీసుకొస్తున్న దర్శకుడు శ్రీకాంత్ ఓదెల అని బిజెపి వరంగల్ జిల్లా నాయకుడు శ్రీరంగం సాగర్ అన్నారు. గతంలో తెలంగాణ యాసను విలన్, కామెడీ పాత్రలు, పల్లె వెనుకబాటుతనానికి ప్రతీకగా చూపిన సందర్భాలు ఉన్నాయని, ప్రస్తుత అదే యాస కథకు బలంగా మారుతోందన్నారు. శ్రీకాంత్ ఓదెల 'దసరా' చిత్రంతో తెలంగాణ పల్లె జీవితం, ప్రజల మాట తీరు, సంస్కృతిని సహజంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. ప్రస్తుతం 'ది ప్యారడైజ్' వంటి పాన్ ఇండియా చిత్రాలతో తెలంగాణ మట్టి నుండి వచ్చిన కథలు విస్తృత ప్రేక్షకులకు చేరుతున్నాయని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, పల్లె జీవనాన్ని ప్రపంచ ప్రేక్షకుల కు పరిచయం చేస్తున్నకళాకారులకు అభినందనలుతెలియజేసినట్లు శ్రీరంగం సాగర్ పేర్కొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి : ఎఇఓ

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** అబ్దుల్ నాగారం క్లస్టర్ (అబ్దుల్ నాగారం, నర్సాపూర్, బొంతగట్టు నాగారం రెవెన్యూ గ్రామాలు) పరిధిలోని రైతులందరు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎఇఓవినయ్ కుమార్ అన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వలన రైతులందరికీ 11 అంకెల గుర్తింపు కార్డు రావడం జరుగుతుంది. దీని వలన రైతు యొక్క ఆధార్ కార్డుకు భూమి వివరాలు లింక్ చేయబడుతాయి. కావున యూరియా బుకింగ్, రైతు భరోసా, ఇతర పథకాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రైతులు తప్ప ఆధార్ కార్డు, పట్టదారు పాస్‌బుక్‌తో వెంటనే ఎఇఓను రైతు వేదిక వద్ద సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు/మంగపేట:**మారుమూల గిరిజన గూడాల్లోని చిన్నారులకు విద్యను చేరువ చేసి నాణ్యమైన విద్యావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు గురువారం ఏటూరునాగారం మండలం మామిడిగూడెం గ్రామంలో సింగరేణీ కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సమకూర్చిన 15 లక్షల సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కొమరం భీమ్‌నగర్ కాలనీలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.5లక్షల సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడ పుట్టినా ఎక్కడ పెరిగినా ప్రతి చిన్నారికి చదువుకునే అవకాశం ఉండాలన్నారు. పాఠశాలలు రహదారులు విద్యుత్ సౌకర్యం లేని మారుమూల అటవీ ప్రాంతాల్లోనూ విద్యకు అటంకం కలగకుండా అవసరమైన చోట కంటైనర్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గుత్తికోయ ఆదివాసీ గూడెమైన మామిడి గూడెంలో పరిమిత సౌకర్యాల మధ్య విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రతిభ ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పట్టణ ప్రాంతాల విదార్యర్థులకు దీటుగా చిన్నారులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు ఇర్ప మధు సారంగం సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతానికి పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా విద్యాశాఖాధికారి ఎ సిద్ధార్థ రెడ్డి విద్యాశాఖ అధికారుల కృషిని మంత్రి అభినందించారు. మామిడి గూడెంలో త్వరలోబోరు మంజూరు చేసి తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అటవీ శాఖ సహకారంతో అంబులెన్సులు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా మార్గాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు.జిల్లా కలెక్టర్‌తో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు బూట్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం అదనపు ఎస్పి మనన్ భట్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణీ జిల్లా విద్యాశాఖాధికారి ఎ సిద్ధార్థ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ రఘు ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణ బాబుతో పాటు, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు పాల్గొన్నారు.

**కల్యాణ లక్ష్మి చెక్కులు సద్వినియోగం చేసుకోవాలి**

మండలంలో కల్యాణ లక్ష్మి చెక్కుల ఆర్థిక సహాయాన్ని ప్రజా అవసరాల మేరకు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దణసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మండలంలో రైతు వేదిక భవనంలో తహసీల్దార్ తోట రవీందర్ అధ్యక్షతన 23 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి చెక్కుల ఆర్థిక సహాయన్ని వృధా ఖర్చులు చేయకుండా అవసరాల మేరకు సద్వినియోగం చేసుకువాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు జిల్లా పంచాయతీ అధికారి కొండా వెంకయ్య, ములుగు మార్కెట్ చైర్మన్ రేగా కళ్యాణి, ఎంపిడిఓ బద్రు నాయక్, పంచాయతీ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు , యాణయ్య పాల్గొన్నారు.

## చట్టబద్ధంగా, పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియ

### అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ సూచన



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను చట్టబద్ధంగా, పారదర్శకంగా పూర్తి చేయుటకు భూ సేకరణ చట్టం, నిబంధనలు, పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులకు సూచించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో భూ సేకరణలో భూసేకరణ చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులపై రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి హెచ్ఎండిఎ, టిజిఐఐసిలో ఓఎస్‌డిగా విధులు నిర్వహిస్తున్న మనోహర్ తో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇరిగేషన్, సింగరేణి, జెన్‌కో, జాతీయ రహదారులు తదితర అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూసేకరణ జరుగినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో భూ సేకరణ జరిగిందని, అర్హులైన రైతులకు చట్టప్రకారం పరిహారం, పునరావాసం, పునరావాస ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సేకరణలో రైతుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ జాప్యానికి తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఓఎస్‌డిమనోహర్ తెలిపారు. భూసేకరణ చట్టాలకు అనుగుణంగా ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రక్రియకు సంబంధించిన మినిట్స్‌ను నమోదు చేయడంతో పాటు అవసరమైన చోట్ల వీడియో రికార్డింగ్ చేపట్టాలని సూచించారు. భూములు ఇచ్చే రైతులను కేవలం భూమి ఇచ్చేవారిగా కాకుండా ప్రాజెక్టుల్లో భాగస్వాములుగా గౌరవించాలని, అధికారుల వైఖరి వల్ల వారి మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని అన్నారు. అసైన్డ్, ప్రభుత్వ భూములకు సంబంధించి తలెత్తే వివాదాలను నిబంధనల ప్రకారం విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూముల్లో సాగు చేసుకుంటున్న వారి అర్హతలను తహసీల్దార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. భూసేకరణలో భూమి విస్తీర్ణం, రికార్డుల వివరాలు తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మనోహర్ సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఏఓ శ్రీనివాసులు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తధితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌పిఒలతో ఎగుమతులను ప్రోత్సహించాలి



**ప్రజాపక్షం/జనగామ:** ఎఫ్‌పిఒల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్ట ర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై రైతులు, ఎఫ్‌పిఒలు, వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో ఎపిఇడిఎ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఎంటియు 1010 రకం వరి సుమారు 44 వేల ఎకరాలలో సాగవుతోందని, విదేశీ మార్కెట్లో దీనికి మంచి డిమాండ్ ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 22 ఎఫ్‌పిఒలుఎపిఇడిఎ సహకారాన్ని వినియోగించుకుని అంతర్జాతీయ మార్కెట్లను చేరుకోవాలన్నారు. వచ్చే 30 రోజులలో కొనుగోలు దారుల సమావేశాలు, ఎఫ్‌పిఒ మేళాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. చిట్టిముత్యాలు సువాసన బియ్యాన్ని ఒడిఒపి ఉత్పత్తిగా అభివృద్ధిచేసి ప్రీమియం బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు అంబికా సోని, రాణా ప్రతాప్, నర్సయ్య, నూరుద్దీన్, సుకేష్, విజయ్, ప్రతిభ, కృషి, సఖి, తదితరులు పాల్గొన్నారు.

## యుజిడి భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి

### కలెక్టరేట్‌లో రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి (యుజిడి) సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో యుజిడికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పురోగతిపై రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టిపిలు), సీవరేజ్ పంపింగ్ స్టేషన్లు, లిఫ్టింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ అంశాలను కలెక్టర్ సమీక్షించారు.జిల్లాలో మొత్తం 23 ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై అధికారులను కలెక్టర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... యుజిడిపనుల అమలుకు భూసేకరణలో ఎలాంటి జాప్యం లేకుం డా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెం కన్న, హనుమకొండ ఆర్‌డిఓ వెంకటేష్, ఎస్ఇ రాజ్ కుమార్, ఇఇ రవికుమార్, తహసీల్దార్లు, భూసేకరణవిభాగం అధికారులు పాల్గొన్నారు.

## గణేశ్ నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక పర్యవేక్షణ



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న గణేశ్ నిమజ్జన ప్రక్రియను వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ శ్వేత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి వెంకన్న గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రక్రియ కొనసాగుతున్న తీరు, భక్తుల రాకపోకలు, భద్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు నిమజ్జనం పూర్తయిన గణేష్ విగ్రహాల సంఖ్య, ఇంకా నిమజ్జనం చేయాల్సిన విగ్రహాల వివరాలను సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో గణేశ్ విగ్రహాలను సాధ్యమైనంత త్వరగా నిమజ్జన కేంద్రాలకు తీసుకువచ్చి నిమజ్జనం పూర్తి చేసుకునేలా ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా భక్తులు, నిర్వాహకులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రశాంతంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సిపి శ్వేత, కమిషనర్ వెంకన్న సూచించారు. పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. అదేవిధంగా నిమజ్జనం పూర్తైన వెంటనే విగ్రహాల అవశేషాలు, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కమిషనర్ వెంకన్న ఆదేశించారు. ఈ పరిశీలనలో జిడబ్ల్యూఎంసి సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## కాజీపేట డీజిల్ కాలనీలో మహిళ హత్య

### కుమారుడే చంపాడని ప్రచారం



**ప్రజాపక్షం/కాజీపేట :** హనుమకొండ జిల్లా కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కలకలం రేపింది. డీజిల్ కాలనీ బాలాజీనగర్‌లో ఓ మహిళ హత్యకు గురైంది. మృతురాలిని ఉదయశ్రీ(40) గా గుర్తించారు.తల్లిని కుమారుడే హత్య చేశాడని ఆరోపణ స్థానికంగా అందుతున్న వివరాల ప్రకారం.. ఉదయశ్రీకి ఓ వ్యక్తితో అక్రమ సంబంధం విషయంలో కుమారుడు దొరబాబు(20)తో కొంతకాలంగా విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తల్లిని పలుమార్లు కుమారుడు హెచ్చరించినట్లు సమాచారం.అయితే ఆమె వినకపోవడంతో ఆగ్రహానికి గురైన దొరబాబు.. గురువారం ఉదయం ఇంటి మేడపై తల్లిపై దాడి చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉదయశ్రీ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.ఆరోపణలు ఎదుర్కొంటున్న దొరబాబు ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నట్లు తెలుస్తోంది. కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన విభేదాల నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా సమాచారం. అయితే హత్యకు దారితీసిన పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలు పోలీస్‌ల దర్యాప్తులో తేలాల్సి ఉంది. సమాచారం అందుకున్న కాజీపేట పోలీస్‌లు వెంటనే డీజిల్ కాలనీ బాలాజీనగర్‌కు చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, ఉపయోగించిన ఆయుధం, ఘటనకు సంబంధించిన ఇతర ఆధారాలపై పోలీస్‌లు ఆరా తీస్తున్నారు.

## సత్యం మరణం సిపిఐకి తీవ్ర నష్టం

### సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ:**సిపిఐ సత్యంగా పేరుగాంచిన కామ్రేడ్ తొర్ర సత్యం మృతి జనగామ జిల్లాలో సిపిఐ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిందని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. గురువారం జనగామలో వ్యవసాయ మార్కెట్ దగ్గర అమరజీవి కామ్రేడ్ తొర్ర సత్యం స్థూపం వద్ద 5వ వర్ధంతి సందర్భంగా సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కామ్రేడ్ సొప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో రాజారెడ్డి మాట్లాడుతూ ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడిగా, వ్యవసాయ మార్కెట్ హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కామ్రేడ్ సత్యం చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతిచెందడం సిపిఐ జిల్లా నిర్మాణానికి తీవ్ర నష్టం జరిగిందని, ఆ కామ్రేడ్ జిల్లా పార్టీ సహాయ కార్యదర్శిగా, ప్రజానాట్య మండలి నాయకుడిగా కూడా పనిచేస్తూ ప్రజలను ఎంతో ఉత్తేజపరిచారని, కామ్రేడ్ చనిపోవడం ఎంతో బాధాకరమని, అటువంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి వారి కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లిందని రాజారెడ్డి అన్నారు. సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా నాయకులు చామకూర యాకూబ్, గుండెల్లి రాజు, భూమల ఐలయ్య, తిప్పరపోయిన సిద్దులు, యాకయ్య, సుదర్శనం, ఊదరి వెంకటాద్రి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షుడు,సత్యం సతీమణి తొర్రలలిత,కార్మిక,సిపిఐ నాయకులు, పాల్గొన్నారు.

## యాప్ మారే.. ఆగం చేసే!



**ప్రజాపక్షం/గూడూరు;** ఆరుగాలం కష్టపడి పంట పండించే అన్నదాతపై సాంకేతికత పిడుగులా పడింది. ఎరువుల పంపిణీలో పారదర్శకత పేరిట కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సరికొత్త మొబైల్ అప్లికేషన్ ఏజెన్సీ ప్రాంత రైతులకు పెనుశాపంగా మారింది.రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్వహించిన యాప్‌ను రద్దు చేసి ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిన ఈ కొత్త విధానం గిరిజన గిరిజనేతర రైతుల పొట్ట కొడుతోంది.

**పట్టా ఉంటేనే ఎరువులు.. మరి పోడు రైతుల మాటేంటి?**

కొత్తగూడ గంగారం గూడూరు బయ్యారం డోర్నకల్ గార్ల తదితర ఏజెన్సీ మండలాల్లో అత్యధిక శాతం మంది పోడు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారు .ఇక్కడ సాగు చేస్తున్న అనేకమంది గిరిజనులకు ఇంకా అటవీ హక్కు పత్రాలు (ఆర్ఓఎఫ్ఆర్) అందలేదు ఇక తరతరాలుగా ఏజెన్సీలో సాగు చేసుకుంటున్న గిరిజనేతర రైతుల వద్ద సైతం సరైన ఆధారాలు లేవు. గతంలో రాష్ట్ర యాప్ ద్వారా ఆధార్ నంబర్ ఆధారంగానో స్థానిక ధ్రువీకరణతోనో యూరియా కాంప్లెక్స్ ఎరువులు పొందే వెసులుబాటు ఉండేది.కానీ కేంద్రం ప్రవేశపెట్టిన నయా యాప్‌లో పట్టాదారు పాస్ పుస్తకం నంబర్ లేదా రెవెన్యూ హక్కు పత్రం నమోదు చేస్తేనే వివరాలు తెరుచుకుంటున్నాయి. దీంతో పత్రాలు లేని నిరుపేద గిరిజన గిరిజనేతర రైతులకు యాప్‌లో రిజిస్ట్రేషన్ కావడం లేదు.

**సిగ్నల్ లేని పల్లెలు.. స్మార్ట్ ఫోన్ ఎరుగని రైతులు**

ఏజెన్సీ గ్రామాలంటేనే మొబైల్ సిగ్నళ్ల కొరత చాలా గ్రామాల్లో సాధారణ ఫోన్ మాట్లాడటానికే కొండలు గుట్టలు ఎక్కాల్సిన పరిస్థితి అలాంటిది స్మార్ట్‌ఫోన్ వాడటం రాని నిరక్షరాస్యులైన రైతులు ఈ యాప్‌ను ఎలా నిర్వహించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. యాప్‌లో బుకింగ్ పూర్తయ్యాకే లభించే ఆక్యూర్ కోడ్ (క్యూఆర్ కోడ్) చూపిస్తేనే దుకాణదారులు ఎరువులు ఇవ్వాలనే నింబధన వీరి పాలిట శాపంగా మారింది.

**గూడూరు మండలం తక్షణమే ప్రత్యేక వెసులుబాటు కల్పించాలి: మాజీ బిజెపి మండల అధ్యక్షుడు**



ఎరువులు సకాలంలో అందకపోతే దిగుబడులు తీవ్రంగా పడిపోయే ప్రమాదం ఉంది సాంకేతిక నిబంధనలతో గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టకుండా ఏజెన్సీ రైతులకు పాత పద్దతిలోనే ఆధార్ కార్డు లేదా స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారుల (ఎఇఒ లు ) గుర్తింపు ద్వారా ఎరువులు అందించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.గూడూరు మండలతో పాటు జిల్లాలోని అన్ని మండల రైతులకు వ్యవసాయ శాఖ అధికారులతో సాగు చేసినపంటలకు సరిపోయే యూరియా అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**రైతులందరికీ యూరియా అందుతుంది: గూడూరు ఎఒ అబ్దుల్ మాలిక్**



రైతులు యూరియా దొకకడం లేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గూడూరు మండల కేంద్రంలోని అన్ని గ్రామపంచాయతీలకు రైతులకు సరిపడా యూరి యా ఉందని ఆయన అన్నారు. త్వరలోనే ఈ యాప్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రతి ఒక్కరికి యూరియా అందుతుందని ఆయన తెలిపారు. రైతుల సంయమనం పాటించాలన్నారు.

## కెజివిబి పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ప్రజా పక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలం :జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం బీర్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, విద్యార్థినుల వసతి గృహాన్ని (హాస్టల్) ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.కలెక్టర్ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి,వారికి అందుతున్న విద్యా బోధన, మెనూ ప్రకారం లభిస్తున్న భోజనం,ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులకు నిబంధనల ప్రకారం ప్రతిరోజూ పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత కేజీబీవీ భవనంలో ఉన్న అసౌకర్యాల దృష్ట్యా, విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించేందుకు గాను ప్రతిపాధిత ఎంపీపీఎస్ డీపీఈప పాఠశాల భవనంలో వసతులు పరిశీలన చేయాలని సూచించారు.విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెరుగైన ఫలితాల సాధనకై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఆర్‌డిఓ మదుసూదన్ తో పాటు కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత,సత్యనారాయ,తహశీల్దార్ సుజాత,మండల విద్యాశాఖాధికారి నాగభూషణం మరియు పాఠశాల సిబ్బంది రెవెన్యూ సిబ్బంది డిప్యూటి తహసిల్ దార్ శ్రీనివాస్,గిర్దావర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుకు ఇదే అనుకూల సమయం

### జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ తాజా ధర మెట్రిక్ టన్నుకు 24,025గా ఉందని, ఇది రైతులకు ప్రోత్సాహకరమైన ధర అని తెలిపారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని, ఇప్పటికే జిల్లాలో సాగు చేస్తున్న విజయవంతమైన రైతుల తోటలను సందర్శించి వారి అనుభవాలను ఇతర రైతులు తెలుసుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగుకు మొక్కల సరఫరా, నాలుగు సంవత్సరాల పాటు తోట నిర్వహణ మరియు అంతర పంటలకు ఆర్థిక సహాయం, అలాగే డ్రిప్ నీటి పారుదలపై ప్రభుత్వ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు తమ పరిధిలోని హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు హార్టికల్చర్ అధికారులు మరియు ఆయిల్‌పామ్ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు వర్షాలతో వాయిదా

### తదుపరి అక్టోబర్ 1 నుంచి 4 వరకు నిర్వహణ

### 33 జిల్లాల జట్లకు సమాచారం

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 29 వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తలపెట్టిన రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, తుపాను ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కబడ్డీ సంఘం ప్రతినిధులు, నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, ఆధ్వర్యంలో ఈ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశామని తెలిపారు.రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అనుమతితో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచనల మేరకు, మళ్లీ ఈ పోటీల ను అక్టోబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు వేములవాడలోనే నిర్వహించాలని రీషెడ్యూల్ చేసినట్లు ప్రకటించారు. పోటీల తేదీల మార్పు సమాచారాన్ని ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని 33 జిల్లాల కబడ్డీ అసోసియేషన్లకు, ఆయా జిల్లాల జట్లకు చేరవేసినట్లు స్పష్టం చేశారు. జాయింట్ కార్యదర్శి సోమినేని బాలు, నరేష్ సాయి పాల్గొన్నారు.

## దేశ సేవలో విద్యార్థులదే కీలక పాత్ర

### ప్రొఫెసర్ అయోధ్య రెడ్డి




**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** దేశానికి సేవ చేయడంలో విద్యార్థులే కీలక పాత్ర వహించాలని ప్రొఫెసర్ అయోధ్య రెడ్డి అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ డే వేడుక దవదబలు ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. జీవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి ప్రొఫెసర్ అయోధ్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ స్రవంతి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సువర్ణదేవి, కిషోర్,హరిప్రసాద్, డాక్టర్ స్వప్న,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, నెహ్రూ యువ కేంద్రం, స్వచ్ఛ భారత్ బాధ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్

### కాంగ్రెస్ నాయకుడు పురమల్ల శ్రీనివాస్



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట సంజీవని అని కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నియోజకవర్గం కొత్తపల్లి మండలం బావుపేట గ్రామానికి చెందిన లబ్దిదారులు సోమినేని కొండయ్య కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సహకారంతో కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్, మల్యాల రాజాగౌడ్‌తో కలిసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పురమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపద సమయంలో ఆరోగ్యానికి శ్రీరామ రక్ష సీఎం రిలీఫ్ ఫండ్ అని అన్నారు.

## ఈ నెల 30న కరీంనగర్‌కు.. సిఎం రేవంత్ రెడ్డి


- నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం
- ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి
- మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కరీంనగర్ కు రానున్నారు.నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అన్ని హంగులతో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనం గత రెండు నెలల క్రితమే పూర్తయినప్పటికీ కొన్ని కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది.మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా భవనం పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. ప్రధాన ద్వారం, కలెక్టర్ కార్యాలయం, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలతో పాటు ఇతర ముఖ్య ప్రాంగణాలను సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రతి ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.సమీక్ష అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాటు చేస్తున్న ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రాక కోసం నూతనంగా నిర్మించిన హెలిప్యాడ్‌ను మంత్రి పరిశీలించారు. హెలిప్యాడ్‌కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో చేరుకున్న తర్వాత కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం నూతన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో ప్రజాప్రతినిధులు, ముఖ్య నేత లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## భూ వివాదం.. అప్పుల బాధతో యువ రైతు బలవన్మరణం

### గ్రామంలో విషాదఛాయలు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** భూవివాదం అప్పుల బాధతో ఒత్తిడికి గురై ఓ యువరైతు చెట్టుకు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పలుగుగడ్డ(మాందాపూర్)గ్రామంలో గురువారం వెలుగు చూసింది. ఈ సంఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పలుగుగడ్డ గ్రామానికి చెందిన లోకుల సాయిరాం(30) గత కొన్ని నెలల క్రితం తన సోదరుడు లోకుల చందు వద్ద 10 గుంటల వ్యవసాయ భూమిని రూ. 8 లక్షలకు ఖరీదు చేసుకోని రూ. 4లక్షలు బయానగా చెల్లించాడు. మిగత డబ్బులు వాయిద ప్రకారం భూమి రిజిస్టేషన్ చెయించిన అనంతరం ఇస్తానని ఒప్పంద పత్రం వ్రాయించుకున్నాడు. ఈ భూమి కొనుగోలు కోసం ఓ ప్రయివేటు బ్యాంకులలో అప్పుల తెచ్చినట్లు వారు తెలిపారు. ఆయితే వాయిద ప్రకారం డబ్బులు చెల్లించి తాను కొనుగోలు చేసిన భూమిని రిజిస్టేషన్ కోసం వెల్లగా అప్పటికే సదరు భూమిని తన సోదరుడు ప్రయివేటు వ్యక్తుల వద్ద తనాఖ పెట్టి రూ.2లక్షల 30 వేలు అప్పుగా తీసుకోవడంతో రిజిస్టేషన్ నిలిచిపోయింది. ఈ విషయమై తన సోదరునితో పలుమార్లు చర్చించిన ఫలితం దక్కలేదు. అతను చేసిన అప్పు రెట్టింపు కావడంతో అతడు చెల్లించలేక భూమి రిజిస్టేషన్ అగిపోయింది. దీంతో తాను భూమి కోసం చేసిన 8లక్షల అప్పులు అసలు,వడ్డీ పెరిగిపోవడం, భూమి రిజిస్టేషన్ కాకపోవడంతో మానసిక ఒత్తిడికి గురైన సాయిరాం బుధవారం ఉదయం పోలం వద్దకు వెల్లివస్తానని తన భార్య సుజాతతో చెప్పి ఇంట్లో నుండి వెల్లిపోయినట్లు పేర్కొన్నారు. ఓ చెట్టుకు ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు.భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్‌లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. వారి హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం మెనూ చార్ట్ పరిశీలించి కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు, కూరగాయలతోపాటు ఇతర ఆహార పదార్థాలను వాటి నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఈరోజు ఆహార పదార్థాలు సిద్ధంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం వసతి గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. హాస్టల్ ఆవరణ ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు.అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.



## పారదర్శకంగా ఆధార్ సేవలు అందించాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో ఆధార్ సేవలు మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా అందేలా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటర్ కమిటీ సమీక్ష సమావేశాన్ని అదనపు కలెక్టర్ శ్రీరాములు తో కలిసి నిర్వహించారు. జిల్లాలో ఆధార్ నూతన నమోదులు,మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ల పరిస్థితి,పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు.ఆధార్ సేవలకు సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించాలని,స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన నూతన నమోదులు ఎన్ని, ఇంకా ఏయే ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్నాయి అనే వివరాలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్లు పూర్తి చేయడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న బయోమెట్రిక్ అప్‌డేట్లు, నూతన నమోదులను వేగవంతం చేయడానికి తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు.ఈ ప్రక్రియలో వివిధ శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,మహిళా శిశు సంక్షేమ శాఖ, పోస్టల్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.సరిగ్గా డేటా సేకరణ చేయని కేంద్రాలు, నిర్లక్ష్యం వహించే ఏజెన్సీలపై తగిన చర్యలు తీసుకోవాలని,అవసరమైన చోట డేటా కలెక్షన్ రద్దు చేయడం వంటి కఠిన నిర్ణయాలు ఉంటాయని, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ ప్రక్రియను ముమ్మరం చేయాలని, బయోమెట్రిక్ సమర్పణ,సరైన డేటాను ఎప్పటికప్పుడు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. నో టీసులు జారీ చేయాలని, సంబంధిత శాఖల అధికారులు,పోస్టల్ శాఖ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఆధార్ సేవల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు మెరుగైన సేవ లు అందించాలని క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.అసిస్టెంట్ మేనేజర్ రత్నాకర్, జిల్లా అధికారులు, పోస్టల్ అధికారులు, పాల్గొన్నారు.

## నిమజ్జనంలో విషాదం.. విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



**ప్రజాపక్షం/ఎండపెల్లి :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేటలో బుధవారం రాత్రి గణేష్ నిమజ్జన వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొప్పుల రాజశేఖర్ (23) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు.రాత్రి 11 గంటల సమయంలో సౌండ్ బాక్సులకు విద్యుత్ సరఫరా చేసే మెయిన్ వైర్లను కర్రతో సరిచేస్తుండగా ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

**మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి :** వినాయక నిమజ్జనం సందర్భంగా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో విద్యుత్ షాక్ తో మరణించిన కొప్పుల రాజశేఖర్ కుటుంబాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ గురువారం పరామర్శించారు.కొత్తపేట గ్రామంలో రాజశేఖర్ మృతదేహానికి నివాళులు అర్పించిన మంత్రి లక్ష్మ ణ్ కుమార్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

### అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఖరీఫ్ 202627 సీజన్ వరిధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలని.. కొనుగోలు కేంద్రాల్లో అవసరమగు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ సంబధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఖరీఫ్ (వానాకాలం) 2026– 27 సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ సంబంధిత శాఖల అధికారులతో ముందస్తు సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రతి పిపిసి వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు ముందుగానే అందుబాటులో ఉంచాలని, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ స్కేల్స్, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు తదితర అవసరమైన పరికరాలను సమకూర్చాలని సూచించారు. జిల్లాలో ఖరీఫ్ 2026–27 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1 నుండి ప్రారంభించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పిపిసి వద్ద అవసరమైన సంఖ్యలో హమాలీ కార్మికులను అందుబాటులో ఉంచాలని, ధాన్యం రాకకు అనుగుణంగా మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖ మండలాల వారీగా ఖరీఫ్ వరి పంట కోతల షెడ్యూల్‌ను సిద్ధం చేసి, గ్రా మాల వారీగా వరి కొనుగోలు అంచనా మరియు కోతల సమయ వివరాలను ముందుగానే అందించాలని సూచించారు. రైతులు తీసుకువచ్చే ధాన్యంలో నిర్దేశిత తేమ శాతం మరియు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అనవసర జాప్యం లేకుండా స్వీకరించాలని సూచించారు. పిపిసిల వద్ద ధాన్యం పేరుకుపోకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించేలా రవాణా మరియు నిల్వ ఏర్పాట్లను సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు అవసరమైన మేరకు తగిన న్ని లారీలను ముందుగానే సమకూర్చి, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా రవాణా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.ఎస్‌డబ్లు సి గోదాములు, ఎఎంసి గోదాములు, ఇతర ప్రభుత్వ, అందుబాటులో ఉన్న నిల్వ సౌకర్యాలను వినియోగించుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.


## గాయత్రి డిగ్రీ కళాశాలలో 'టిబి'పై అవగాహన


**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లి జిల్లా గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ ఫార్మేషన్ డేను పురస్కరించుకొని టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.టిబి రాకుండా టీబి నివారణకి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నటువంటి అవగాహన సదస్సులో భాగంగా గతంలో టీబీ మందులు వాడిన వారు, వారి కుటుంబ సభ్యులు, 60 సంవత్సరాల వయసు పైబడిన వారు,ఎత్తుకు దగ్గ బరువు తక్కువ ఉన్నవారు,మద్యం సేవించేవారు.అధికంగా సిగరెట్ బీడీ చుట్ట తంబాకు తినేటువంటి వారు 15 రోజులకు మించి తేమడతో కూడిన దగ్గు జ్వరం ఉన్నవారు నేరుగా ఎక్స్రే మరియు పుటం పరీక్ష చేసుకోవాలని టీబి రహిత రాష్ట్రంగా నిలపడమే ధ్యేయంగా గాయత్రి కళాశాల యాజమాన్యం,సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ముందుంటున్నారని దేవ తిరుపతి సీనియర్ చికిత్స పర్యవేక్షకులు తెలియజేయడం జరిగింది. ఎన్ఎస్ఎస్ అనేది ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు తమ పాఠ్యాంశాలతో పాటు సమాజసేవలో పాల్గొనేలా ప్రోత్సహించడం సమాజ శ్రేయస్సు పట్ల బాధ్యతగా వ్యవహరించడం న్యాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం నేను కాదు నువ్వు నాట్ మీ బట్ యు అనే నినాదంతో ముందుకు సాగాలని జే .రవీందర్ సూచించారు.

## పుష్కరాలకు ముందే పనులు పూర్తి

### 2027 ఫిబ్రవరి 29లోపు కోటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు, ఆలయ పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

### మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్





**ప్రజాపక్షం/జగిత్యాల :** 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ముందే పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో పుష్కరాల పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పుష్కర పనుల్లో భాగంగా ధర్మపురి నియోజకవర్గానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.117 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా సుమారు రూ 80 కోట్ల నిధులు కేటాయించాలని కోరగా రూ. 81 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కోటిలింగాల ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 10 కోట్లు కేటాయించిందని పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.16.13 కోట్లతో నిర్మాణం చేస్తున్నామని మంత్రి తెలిపారు.శంకుస్థాపన చేసిన ఈ పనులు 2027 ఫిబ్రవరి 29 లో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గోదావరి పుష్కరాలు నాటికి అన్ని పనులు పూర్తి చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తామని మంత్రి తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. అనంతరం ప్రభుత్వం తల్లిదండ్రులు, వయోవృద్ధులు,దివ్యాంగుల వారోత్సవాల పోస్టర్ ను మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తో కలిసి ఆవిష్కరించారు.కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## పెద్దపల్లి నియోజకవర్గంలో.. విద్యుత్ సమస్యకు పరిష్కారం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే 'చింతకుంట'



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి నియోజకవర్గ వా ప్తం గా విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి నియోజకవర్గంలో మరో నాలుగు 33/11 కెవి సబ్ స్టేషన్‌ల నూ తన నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్య లు చింతకుంట విజయ రమణారావు తెలిపారు.గురువారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులకు ప్రజలకు సమృద్ధిగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ను అందించడమే లక్ష్యంగా 13 కోట్ల 51 లక్షల 59 వేల రూపాయలతో నాలుగు సబ్ స్టేషన్ ల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దరాజు పల్లిలో రెండు కోట్ల 44 లక్షల 83 వేల రూపాయలతో నూతన సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతున్నామని అలాగే సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శాస్త్రి నగర్ లో రెండు కోట్ల 47 లక్షల 56 వేల రూపాయలతో, ఓదెల మండలం రూప్ నారాయణపేటలో నాలుగు కోట్ల 14 లక్షల 90 వేల రూపాయలతో, ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో నాలుగు కోట్ల 44 లక్షల 30 వేల రూపాయలతో సబ్ స్టేషన్ ల నిర్మాణం చేపట్టి నిరంతరం విద్యుత్ అందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి విద్యుత్ కోతలు ఉండవద్దని లక్ష్యంతోనే కోట్లాది రూపాయలతో నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రానున్న వేసవికాలం వరకు పూర్తిస్థాయిలో సబ్ స్టేషన్ లు అందుబాటులోకి వస్తాయన్నారు.సబ్ స్టేషన్ లను అందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క, లతో పాటు జిల్లా మంత్రి శ్రీధర్ బాబులకు ధన్యవాదాలు తెలిపారు.

## 27న పనిచేయనున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు




**న్యూఢిల్లీ:** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, వినియోగదారులకు బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం కలగకుండా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దాని ప్రకారం, ఈనెల 27వ తేదీ, ఆదివారం ప్రభుత్వ రంగ బ్యాంకులు (పిఎస్‌బిలు), ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్‌ఆర్‌బిలు) సాధారణంగా పనిచేస్తాయి. ఈనెల 26వ తేదీ నాలుగో శనివారం కావడంతో సాధారణ సెలవు, 27 ఆదివారం మరో సెలవు. ఆ వెంటనే 28 నుంచి 30 వరకు ప్రతిపాదిత సమ్మె జరగనుంది. దీంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఈనెల 27న అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఎటిఎంలింక్డ్ శాఖలు, కరెన్సీ చెస్టులు పని చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అనుమతి ఇచ్చింది. అయితే ఈ నిర్ణయం ప్రధానంగా ప్రభుత్వ రంగ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు వర్తిస్తుంది. ప్రతిపాదిత సమ్మె జరిగితే శాఖల్లో ప్రత్యక్ష సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. కాబట్టి సమ్మెను వాయిదా వేయాలని అటు ప్రభుత్వం, ఇటు బ్యాంకు యాజమాన్యాలు యూనియన్లను కోరాయి.

## ఓటు హక్కును హరించే విధానాన్ని అమలు చేస్తున్న సిఇసి

'సర్' వివాదంపై కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా నుంచి యువతను, ముఖ్యంగా 'జన్ జెడ్'ను తొలగించే ప్రయత్నం జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశంపై ఎన్నికల కమిషన్‌లో విభేదాలు నెలకొన్నాయన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ గురువారం ఈ ఆరోపణలు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ దురుద్దేశపూరిత చర్యలకు జవాబుదారీ వహించాల్సి ఉంటుందని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. బుధవారం ప్రముఖ జాతీయ దినపత్రిక 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఒక వచ్చిన సంచలన కథనం ద్వారా సిఇసి ఎన్నికల కమిషన్ సమగ్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని పూర్తిగా నాశనం చేసిన తీరు వెలుగులోకి వచ్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. దీనికి తోడు గురువారం మరో కీలక కథనం వెలువడిందని కూడా ఆయన పేర్కొన్నారు. చెల్లుబాటు అయ్యే ఓటర్లను 'ఇసిఐనెట్' సాఫ్ట్‌వేర్ తొలగించడంతో వారిని ఓటర్ల జాబితాలో తిరిగి చేర్చాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) ఏడు రోజుల్లో ఎనిమిదిసార్లు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారని, గోవాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్ఒలు) కూడా ఆ ఓటర్లు చెల్లుబాటు అయ్యే ఓటర్లేనని నిర్ధారించారని రమేశ్ అన్నారు. అయినప్పటికీ ఆ ఇ–మెయిల్స్‌ను పట్టించుకోకుండా ఓటర్లను తొలగించారని రమేశ్ 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనాన్ని ఉటంకిస్తూ, ఎస్ఐఆర్ మొత్తం ప్రక్రియను ఈ ఇసిఐనెట్ సాఫ్ట్‌వేర్‌కు అప్పగించారని ఆయన ఆరోపించారు. దీని ఫలితంగా 'సర్' మూడో దశలో విపత్కర పరిస్థితి ఏర్పడిందని, ఢిల్లీలో 54 శాతం మంది ఓటర్లను, దేశవ్యాప్తంగా దాదాపు 12 కోట్ల మంది ఓటర్లను తొలగించడం లేదా అనుమానాస్పద ఓటర్లుగా గుర్తించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. 'చట్టవిరుద్ధమైన, కేంద్రీకృత చర్యలో భాగంగా ఇఆర్ఒలకు ఇసిఐనెట్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించే అవకాశాన్ని పరిమితం చేశారు. 1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఓటర్ల జాబితాపై చట్టబద్ధమైన అధికారం ఇఆర్ఒకు ఉంటుంది. ఈ నిబంధన ఉల్లంఘనపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కేబినెట్ కార్యదర్శికి లేఖ రాశారు' అని రమేశ్ వివరించారు. కొత్త ఓటర్లను చేర్చేందుకు ఉపయోగించే 'ఫామ్ 6' ద్వారా దరఖాస్తు చేసుకునే ప్రక్రియను కూడా మరింత కష్టతరం చేశారని ఆయన ఆరోపించారు. జెన్‌జిలను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే లక్ష్యంగా చేసుకున్నారని రమేశ్ విమర్శించారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి దాదాపు రెండేళ్లుగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకు తాజాగా వెలువడుతున్న ప్రతి ఆధారం మరింత బలాన్ని ఇస్తున్నదని ఆయన అన్నారు. సిఇసి వైఖరిని ఆయన 'మెథడ్ ఆఫ్ డిస్‌ఎన్‌ఫ్రాన్‌ఛైజింగ్ ఇండియన్స్' (ఎంఒడిఐ/ మోదీ)గా రమేశ్ అభివర్ణించారు. ఈ విధానాన్ని సిఇసి జ్ఞానేశ్ కుమార్ అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా రాజీపడిపోయిందని, ఫలితంగా దాని విశ్వసనీయత దెబ్బతిన్నదని రమేశ్ పేర్కొన్నారు.

## సిఇసిపై మొయిత్రా ఫిర్యాదు



**న్యూఢిల్లీ :** ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరుతూ ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు సమర్పించారు. కాగా, పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో ఓటర్ల చేర్పు, తొలగింపు, పునరుద్ధరణ, ఓటరు నమోదు ప్రక్రియలో మార్పులు సహా ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వచ్చిన కథనాన్ని మొయిత్రా తన ఫిర్యాదులో ప్రస్తావించారు. ఇద్దరు సహచర కమిషనర్ల అభిప్రాయాలకు విరుద్ధంగా సిఇసి స్వయంగా ఎన్నికల కమిషన్ తరపున నిర్ణయాలు తీసుకునే అధికారం లేదని ఆమె పేర్కొన్నారు. అలాగే 'సర్' ప్రక్రియ కోసం ప్రజాధనం గణనీయంగా ఖర్చు చేసినందున, దాని దుర్వినియోగంపై కూడా దర్యాప్తు చేయాలని కోరారు. 2023 సిఇసి, ఇసి చట్టంలోని సెక్షన్ 16 అధికారిక విధుల్లో తీసుకున్న చర్యలకు వారికి కొన్ని రకాల న్యాయ రక్షణ లభిస్తుందని మొయిత్రా అంగీకరించారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు, పోలీసు దర్యాప్తు న్యాయస్థానంలో జరిగే విచారణ కాదని, అందువల్ల ఆ నిబంధన వాటికి వర్తించదని ఆమె వాదించారు.

## అక్రమ కాల్‌సెంటర్ గుర్తింపు

### అమెరికాలో రూ. 100 కోట్లు మోసం

**న్యూఢిల్లీ,** : అమెరికాలోని బాధితుల నుంచి 'టెక్‌సపోర్ట్' పేరుతో సుమారు రూ.100 కోట్ల మేర మోసం చేసిన ఓ అంతర్జాతీయ కాల్ సెంటర్‌ను ఢిల్లీ పోలీసులు గుర్తించారు. ఈ కేసులో 11 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. పితంపుర గ్రామంలోని అద్దె భవనంలో మూడు, నాలుగు అంతస్తుల్లో ఈ కాల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈనెల 21న ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ (ఐఎఫ్ఎస్ఒ) విభాగం అక్కడ దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకుంది. రూ.41 లక్షల నగదు, 29 ల్యాప్‌ట్యాప్‌లు, 25 మొబైల్ ఫోన్లు, ఎనిమిది రౌటర్లు, ఒక ఎస్‌యువిని స్వాధీనం చేసుకున్నారు. భారతీయ న్యాయ సంహిత, సమాచార సాంకేతిక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద ఈనెల 22న కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ముఠా అమెరికాలో ఉంటున్న వారిని లక్ష్యంగా చేసుకుని, ఒక వ్యూహం ప్రకారం 'టెక్‌సపోర్ట్' మోసానికి పాల్పడేది. బాధితుల కంప్యూటర్లలోకి రిమోట్‌గా మాల్‌వేర్‌ను ప్రవేశపెట్టి, సాంకేతిక సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించే పాప్‌అప్‌లను చూపించేవారు. బాధితులు ఆ నంబర్‌కు కాల్ చేస్తే, సాఫ్ట్‌ఫోన్ అప్లికేషన్ ద్వారా ఆ కాల్స్‌ను పితంపుర కాల్ సెంటర్‌కు మళ్లించేవారు. కాల్ సెంటర్ సిబ్బంది ముందుగా సిద్ధం చేసిన స్క్రిప్టుల ఆధారంగా తమనుతాము టెక్నికల్ సపోర్ట్ సిబ్బందిగా పరిచయం చేసుకుని, బాధితుల కంప్యూటర్లకు వైరస్ లేదా ఇతర సమస్యలు వచ్చాయని చెప్పేవారు. అనంతరం రిమోట్ యాక్సెస్ కల్పించే ఇన్‌స్టాల్ చేయించేవారు. బాధితుల బ్యాంకు ఖాతాలు కూడా ప్రమాదంలో ఉన్నాయని చెప్పి, వారిని మరో నిందితుడి వద్దకు బదిలీ చేసేవారు. అతను బ్యాంకు అధికారిగా నటించి గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేయాలని లేదా క్రిప్టోకరెన్సీ బదిలీ చేయాలని ఒత్తిడి చేసేవాడని పోలీసులు తెలిపారు. కొన్ని సందర్భాల్లో ఎఫ్‌బిఐ, ఇతర అమెరికా ఫెడరల్ సంస్థల పేరుతో నకిలీ పత్రాలు పంపి బాధితులను భయపెట్టేవారని పోలీసులు తెలిపారు. నిందితులు విలియమ్స్, రయాన్, సోఫీ, జెన్నీ, అలెక్స్ వంటి నకిలీ పేర్లతో బాధితులతో మాట్లాడేవారని చెప్పారు.



కొత్వాల్ గూడలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కుమార్తె అంజలి-రఘు నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు. కాబోయే వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

## 26న ఎపిలో సిపిఐ అఖిలపక్ష సమావేశం

### వైఎస్ జగన్‌కు ఆహ్వానం



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ఈ నెల 26న విజయవాడ దాసరి భవన్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించ తలపెట్టింది. రాజకీయాలకు అతీతంగా ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా పార్టీలు,రైతు, ప్రజా సంఘాల నేతలను సిపిఐ ప్రతినిధుల బృందం ఆహ్వానించింది. పార్టీ నాయకుల బృందం వివిధ పార్టీల కార్యాలయాలకు వెళ్ళి అగ్రనాయకులను కలిసి అఖిలపక్ష సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వానించింది. సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య,కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి,అక్కినేని వనజతో కూడిన ప్రతినిధి బృందం గురువారం తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి ఆహ్వానం అందజేసింది.

## 'సర్' సాఫ్ట్‌వేర్ వివరాలను ఇసిఐ దాచిపెడుతోంది

టిఎంసి నేత గోఖలే ఆరోపణ

**న్యూఢిలీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' కోసం ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్, అల్గారిథమ్‌కు సంబంధించిన వివరాలను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) వెల్లడించడం లేదని టిఎంసి నేత సాకేత్ గోఖలే ఆరోపించారు. ఆర్‌టిఐ దరఖాస్తుకు ఇసి ఇచ్చిన సమాధానాన్ని ఆయన ఇందుకు ఆధారంగా చూపారు. తాను కోరిన సమాచారం 'వాణిజ్య రహస్యాలు, ట్రేడ్ సీక్రెట్స్, మేధో సంపత్తి' వంటి అంశాలకు సంబంధించినదని, ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(డి) కింద వెల్లడించలేమని ఇసి పేర్కొన్న విషయాన్ని ఆయన వెల్లడించారు. ఏప్రిల్ 17న దాఖలు చేసిన ఆర్‌టిఐలో గోఖలే పశ్చిమ బెంగాల్‌లో 'సర్' కోసం 'ఎనోనెట్'లో ఉపయోగించిన 'లాజికల్ డిస్క్రెపెన్సీ' మాడ్యూల్ లేదా అల్గారిథమ్‌కు సంబంధించిన సాంకేతిక పత్రాలను కోరారు. సాఫ్ట్‌వేర్ రూపకల్పన, దాని పనితీరు, ఓటర్లలో అసమానతలను గుర్తించే ప్రమాణాలు, సాఫ్ట్‌వేర్ కొనుగోలు–అభివృద్ధి పత్రాలు, పరీక్షలు, ధ్రువీకరణ నివేదికలు, అధికారిక నోటింగ్లు, ఇఆర్ఒలకు ఇచ్చిన ఆదేశాల వివరాలను కూడా అడిగారు. కాగా, జులై 21న ఇచ్చిన సమాధానంలో మొదటి రెండు అంశాలకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించలేమని ఇసిఐ తెలిపింది. అయితే పశ్చిమ బెంగాల్‌లో 'సర్' కోసం ప్రత్యేకంగా ఎలాంటి సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను అభివృద్ధి చేయలేదని, ప్రత్యేకంగా ఎలాంటి కొనుగోలు లేదా అభివృద్ధి కూడా జరగలేదని స్పష్టం చేసింది. పలు 'లాజికల్ డిస్క్రెపెన్సీ' కేటగిరీల కింద గుర్తించిన ఓటర్ల సంఖ్య సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల వద్ద ఉండవచ్చని, వారి వద్ద ప్రత్యేకంగా ఆర్‌టిఐ దరఖాస్తులు దాఖలు చేయాలని గోఖలేకు సూచించింది. ఈ నేపథ్యంలో, 'సర్' కోసం ఉపయోగించిన సాఫ్ట్‌వేర్‌ను ఏ సంస్థ అభివృద్ధి చేసిందో ఇసి వెల్లడించాలని గోఖలే డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 'సర్'పై వ్యక్తం చేసిన అభ్యంతరాలపై ఇసిఐ బుధవారం స్పందిస్తూ, సంస్థల్లో నిర్ణయ ప్రక్రియ సందర్భంగా భిన్నాభిప్రాయాలు సహజమేనని వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

## రాజకీయాల్లో ఎంత అధికారాన్ని సాధించినా...

## సేవా మార్గం నుంచి ఎన్నటికీ వైదొలగం

ప్రధాని మోదీ స్పష్టీకరణ



**దేవాస్ (మధ్యప్రదేశ్) :** సేవ అనేది బిజెపి పాలనకు, విలువలకు మూల స్తంభమని, ఎంతటి రాజకీయ అధికారాన్ని సాధించినప్పటికీ తాము ఈ మార్గం నుంచి ఎప్పటికీ వైదొలగబోమని గురువారం ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. రాజకీయాలు, ఎన్నికల కన్నా దేశ నిర్మాణం, దేశ అభివృద్ధి పైనే తమ పార్టీ దృష్టి సారిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. 2047నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని సాకారం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. గుజరాత్‌లోని వడ్నగర్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి వరకు జరుగుతున్న 'సేవా సంకల్ప యాత్ర'లో పాల్గొన్న వారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని సంభాషించారు.'రాజకీయాలు,ఎన్నికలు, పరిపాలనకు వాటి స్థానం ఉంది. కానీ దేశాన్ని నిర్మించి, భారతదేశాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మనం బయల్దేరాం' అని మోదీ అన్నారు. మోదీ 76వ పుట్టిన రోజు, ఎన్నికైన ప్రతినిధిగా ఆయన 25ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాలకు చెందిన యువత పాల్గొంటున్న ఈ యాత్రను నిర్వహిస్తున్నారు. ఈ యాత్రలో పాల్గొన్నవారు ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లాలో ఉన్నారు. వారణాసి, వడ్నగర్ ప్రాచీన నగరాలని, అవి ఇప్పటికీ చైతన్యవంతంగా ఉన్నాయని మోదీ తెలిపారు. వాటిలో ఒకటి తన 'జన్మస్థలం' అని, మరొకటి తన 'కర్మభూమి' అని మోదీ పేర్కొన్నారు. 'గుజరాత్ నుంచి ఢిల్లీ వరకు, సేవ అనేది మన పరిపాలనా వ్యవస్థకు, విలువలకు మూల స్తంభంగా ఉంది. పరిపాలనకు సేవ కేంద్రంగా ఉన్నప్పుడు, 'నాగరిక్ దేవోభవ' అనే సంకల్పం ప్రతీ విధానానికీ మూలంగా ఉంటుంది' అని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. రాజకీయాల్లో మనం ఎంత అధికారం సాధించినా, మన ప్రాథమిక మార్గం సేవగానే ఉంటుందనే విషయాన్ని మన ప్రవర్తన ప్రజలకు తెలియజేయాలి . మనం ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా, సేవా మార్గం నుంచి ఎన్నటికీ వైదొలగబోమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. సేవాభావంతో చేసిన పనులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ప్రజలు సేవ చేసేవారిని ఆశీర్వదిస్తారని అన్నారు. 'నా జీవితం అంతా ప్రజల ఆశీర్వాదాలతోనే నడిచింది. వారి ఆశీర్వాదాలే నాజీవితానికి గొప్ప శక్తిగా నిలిచాయి అని ప్రధాని చెప్పారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయడమే తన జీవితపు ప్రధాన మంత్రం అని ఆయన అన్నారు. 'పేదలు, మహిళలు, బాలికలు, రోగులు, గిరిజనులతో సహా సమాజంలోని వివిధ వర్గాల ప్రయోజనం కోసం తన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సేవా స్ఫూర్తియే పునాది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కి చెప్పారు. సేవా స్ఫూర్తిని దేశ విధానాలకు అన్వయించినప్పుడు దేశ ప్రగతికి సేవయే అతి పెద్ద చోదక శక్తిగా మారుతుందన్నారు.2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పాన్ని నెరవేర్చడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని, యువత ఈ లక్ష్యంతో బలంగా మమేకం కావాలని మోదీ ఆకాంక్షించారు. భారతదేశంలో ప్రయాణం, సేవ రెండూ సామాజిక విలువల్లో లోతుగా పాతుకుపోయాయని, తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో తాను స్వయంగా ఎన్నో యాత్రలకు నాయకత్వం వహించానని ప్రధానమంత్రి అన్నారు.'సేవా సంకల్ప యాత్ర'లో పాల్గొంటున్న యువతతో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడమే వారి ప్రాథమిక లక్ష్యం కావాలని మోదీ పిలుపునిచ్చారు.

## 'వాషిమ్'ను కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలి

మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటనలో రైతుల నినాదాలు



**వాషిమ్ :** మహారాష్ట్రలోని వాషిమ్ జిల్లాలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటన రసాభాసగా మారింది. తమ ప్రాంతాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాని కోరుతూ అక్కడి రైతులు గురువారం నినాదాలు చేశారు. తక్కువ వర్షాపాతం కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి గురువారం మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలోని వాషిమ్, అమరావతి జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఫడ్నవీస్ సోయాబీన్, కంది, పత్తి పంటలను తనిఖీచేసి, ప్రభావిత రైతులతో సమావేశం కానున్నారు. వాషిమ్ జిల్లా కరంజా తాలూకాలోని మస్లాలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటన సందర్భంగా వాషిమ్ జిల్లాను కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని రైతుల బృందం నినాదాలను హోరెత్తించింది. రైతులు ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిసి రూ.50,000 పరిహారం సహా తమ డిమాండ్ల వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. బుధవారం ఫడ్నవీస్ మహారాష్ట్రలోని లాతూర్, ధరాశివ్ పర్యటించి, అక్కడి కరువు లాంటి పరిస్థితిని 'అత్యంత తీవ్రమైనది'గా అభివర్ణించారు. ఈ రెండు జిల్లాల్లో ఈ ఏడాది సాధారణ వర్షపాతంలో సుమారు 50శాతం మాత్రమే నమోదు అయ్యిందని ఫడ్నవీస్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభావిత రైతులకు 'అన్నివిధాలా సాధ్యమైనంత మేరకు సహాయాన్ని' అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

SREE GEERVANI COLLEGE OF EDUCATION
CHOPPADANDI(VILL&MDL),DIST KARIMNAGAGR-505415.
MOB:9848236339

SPOT ADMISSION NOTIFICATION 2026--27

The following unreported/cancelled of B.Ed Candidates should report on or before 29/09/2026 by 5.00 p.m otherwise their seats will be Cancelled and the same may be filled with spot admissions on 30/09/2026 at 10.00 a.m at our college campus as per guidelines of TGCHE /EDCET-2026 Convener

| S NO | RANK | HT NO | STUDENT NAME | CATEGORI | DETAILS OF ALLOTMENT | METHOD |
|---|---|---|---|---|---|---|
| 1 | 15670 | 2625001588 | MUDDAMALLA SRILEKHA | SC - 3 | REG_SC3_OU_GEN | Bio scie |
| 2 | 16963 | 2615002140 | AFIYA NUMERA | BC-B | REG_BCB_OU_GEN | Bio scie |
| 3 | 17021 | 2625001509 | SHEK ARFA MAHVEEN | BC-E | REG_BCE_OU_GEN | Bio scie |
| 4 | 28040 | 2615605030 | AZMERA RAJESHWARI | ST | REG_ST_OU_FEMALE | Bio scie |
| 5 | 1105 | 2615010114 | NAKKA MOUNIKA | BC-D | REG_OPEN_OU_FEMALE | Maths |
| 6 | 14530 | 2615007085 | PEDDI RAJESHAM | BC-B | REG_BCA_OU_GEN | Maths |
| 7 | 21590 | 2625006080 | ROUTHU PRASHANTHI | BC-D | REG_BCD_OU_GEN | Maths |
| 8 | 24938 | 2615010106 | SANGA SANDYA | BC-B | REG_BCB_OU_GEN | Phy scie |
| 9 | 6369 | 2625606309 | MOUNIKA MANDALA | BC-B | REG_OPEN_UNR_GEN | Social |
| 10 | 8369 | 2525004078 | KODIPELLI SAI | SC - 3 | REG_OPEN_UNR_GEN | Social |
| 11 | 10196 | 2615005076 | DHYAVA RADHA | SC - 2 | REG_SC2_UNR_FEMALE | Social |
| 12 | 11665 | 2625401022 | KAMMARI SOUJANYAVANI | SC - 3 | REG_OPEN_OU_GEN | Social |
| 13 | 14062 | 2614104101 | MASKE SHABDANJALI | SC - 3 | REG_OPEN_OU_GEN | Social |
| 14 | 23585 | 2625008155 | BALLA ANUSHA | BC-D | REG_BCD_OU_GEN | Social |
| 15 | 24193 | 2625001501 | MAMIDIPALLY SANGEETHA | SC- 2 | REG_SC1_OU_GEN | Social |
| 16 | 25071 | 2625004052 | ODDETI MANISHA | SC - 3 | REG_SC3_OU_GEN | Social |
| 17 | 25634 | 2615501090 | SHAIK RESHMA | BC-E | REG_BCE_OU_GEN | Social |
| 18 | 26900 | 2615010086 | ROUTHU SUPRAJA | BC-D | REG_BCC_UNR_GEN | Social |
| 19 | 27304 | 2625001155 | MEDI MOUNIKA | BC-A | REG_BCD_OU_FEMALE | Social |

*Ninteen(19) students are not reported.
*Twelve(12)students are not alotted by Edcet Convenor
*TOTAL VACANCIES =Thirty one(31)Only

sd/-
PRINCIPAL
Sree Geervani College of Education.

## పేపర్ లీక్ కేసు నిందితుడి కుమారుడు ఆదిత్యపై..

## నీట్- యుజి 2027 పరీక్షకు హాజరుకాకుండా నిషేధం

**లాథూర్ :** జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఏ) లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ యజమాని, పేపర్ లీక్ కేసు నిందితుడైన శివరాజ్ మోటెగావ్‌కర్ కుమారుడిని రెండేళ్ల పాటు 'నీట్–యుజి' పరీక్షకు హాజరుకాకుండా నిషేధించింది.ఈ ఏడాది జరిగిన నీట్–యుజి పేపర్ లీక్ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) చేత అరెస్ట్ చేయబడిన మోటెగావ్‌కర్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. సెప్టెంబరు 19న ఎన్‌టిఏ విడుదల చేసిన సమాచారం ప్రకారం...ఈ ఏడాది ఆరంభంలో నిర్వహించిన పరీక్షకు సంబంధించి అతడి కుమారుడు ఆదిత్య మోటెగావ్‌కర్ ఫలితాన్ని నిలిపివేశారు. అతడిని నీట్–యుజి 2027 పరీక్షకు హాజరయ్యేందుకు కూడా అనర్హుడిగా ప్రకటించారు. సిబిఐ కథనం ప్రకారం...పరీక్షకు ప్రశ్నాపత్రాలను రూపొందించిన ఎన్‌టిఏ ప్యానెల్‌లో సభ్యుడిగా ఉన్న పివి.కులకర్ణి నుంచి రసాయన శాస్త్ర (కెమిస్ట్రీ) ప్రశ్నా పత్రాలను కొనుగోల్ చేయడానికి శివరాజ్ మోటెగావ్‌కర్ రూ.5 లక్షలు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడి కుమారుడు కులకర్ణి కోచింగ్ క్లాసులకు హాజరయ్యాడని, అక్కడే అతడికి ప్రశ్నలు అందించబడ్డాయని ఏజెన్సీ ఆరోపించింది. జూన్ 21న నీట్–యుజి పరీక్ష నిర్వహించిన అనంతరం జాతీయ పరీక్షల ఏజెన్సీ ఆదిత్య మోటెగావ్‌కర్ ఫలితాన్ని నిలిపివేసి, ఆరోపించబడిన అవకతవకలపై అతని వివరణ కోరింది. ఆయన దీనిపై స్పందిస్తూ...పరీక్ష సమయంలో తాను ఎలాంటి అక్రమ పద్ధతులను అవలంభించలేదని ఆయన ఖండించారు. మే 3వ తేదీ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి, తనకు నోటీస్ జారీ చేశారని, ఆ తర్వాత జరిగిన పున: పరీక్షలో తన ఫలితాన్ని ఎందుకు నిలిపివేశారని ఆయన ప్రశ్నించారు. జాతీయ అర్హత–కమ్–ప్రవేశపరీక్ష (అండర్‌గ్రాడ్యుయేట్ ) లేదా నీట్–యుజి వైద్య విద్యార్థుల కోసం ఎన్‌టిఏచే నిర్వహించబడుతుంది. ప్రశ్నా పత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణల నేపథ్యంలో, వైద్య కోర్సుల ప్రవేశాల కోసం మే 3న జరిగిన నీట్–యుజి పరీక్షను మే 12న ఎన్‌టిఏ రద్దు చేసింది. జూన్ 21న తిరిగి నిర్వహించారు. పత్రాల లీక్‌లు, అలాగే ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించడంలో ఇతర అక్రమ మార్గాలను ఉపయోగించడం వల్ల తలెత్తే క్రిమినల్ కేసులకు సంబంధించిన తన తుది నివేదికను సిబిఐ గత నెలలో ఢిల్లీలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ముందు సమర్పించింది.

ST. JOHN'S COLLEGE OF EDUCATION
Affiliated To Osmania University
OPP: GAIL, CHENGICHERLA(V), CHERLAPALLY PHASE-III
MEDIPALLY(M), MEDCHAL-MALKAJGIRI(DIST)92,TG. PH : 9866519194

B.Ed. SPOT ADMISSIONS 2026

Applications are invited from the candidates those who have not taken admission anywhere so far, and have passed degree and qualified in Ed CET-2026. Eligible candidates should attend for spot admission with all original certificates on 30/09/2026 10 AM at our college premises

The following candidates allotted by the convener TG-Ed CET 2026 have not reported so far. If he/she fails to report on or before 29/09/2026 will be treated as cancelled and seats including vacant seats will be filled in spot admissions by the qualified candidates present on 30/09/2026.

| S.NO. | RANK | HT.NO. | NAME | METHODOLOGY | CATEGORY | DETAILS OF ALLOTMENT |
|---|---|---|---|---|---|---|
| 1 | 1568 | 2624304592 | J BABU RAO | BIOLOGICAL SCIENCE | SC-3 | REG-OPEN-UNR-GEN |
| 2 | 4898 | 2614107856 | CHEEMARLA RANJITH KUMAR | BIOLOGICAL SCIENCE | SC-2 | REG-OPEN-OU-GEN-NCC |
| 3 | 8251 | 2614108825 | MADDI MOUNIKA | BIOLOGICAL SCIENCE | BC-B | REG-BCB-OU-FEMALE |
| 4 | 8461 | 2615601062 | AREPALLY ASHWINI | BIOLOGICAL SCIENCE | SC-2 | REG-SC2-OU-GEN |
| 5 | 23596 | 2624101117 | ASHWALA LAXMI | BIOLOGICAL SCIENCE | BC-A | REG-BCA-UNR-FEMALE |
| 6 | 23629 | 2614301614 | VADTHYA RAJESHWARI | BIOLOGICAL SCIENCE | ST | REG-ST-OU-GEN |
| 7 | 3497 | 2614108695 | POLLAMPALLI MOUNIKA | MATHEMATICS | BC-B | REG-BCB-OU-GEN |
| 8 | 3844 | 2624103111 | MADIPEDDI RAMAKRISHNA | MATHEMATICS | BC-A | REG-BCA-OU-GEN |
| 9 | 14592 | 2624107718 | JATOTHU RAJESHWARI | MATHEMATICS | ST | REG-ST-OU-GEN |
| 10 | 286 | 2614301035 | CHINTA FRANZ TIMON HUBERT | PHYSICAL SCIENCE | BC-C | REG-OPEN-UNR-GEN |
| 11 | 8380 | 2614305371 | GUNDALA JYOTHI | PHYSICAL SCIENCE | BC-D | REG-BCD-OU-GEN |
| 12 | 11596 | 2614107538 | DONTHIDEEPA | PHYSICAL SCIENCE | SC-2 | REG-SC2-OU-GEN |
| 13 | 1157 | 2614107901 | NAKEERTHA SHRAVYA | SOCIAL STUDIES | BC-B | REG-OPEN-OU-FEMALE |
| 14 | 4128 | 2625601744 | TIWARI DINESH KARTHIK | SOCIAL STUDIES | BC-D | REG-OPEN-OU-GEN |
| 15 | 7812 | 2624304063 | RANJANI KUMARI | SOCIAL STUDIES | OC | REG-OPEN-OU-GEN |
| 16 | 8133 | 2624201128 | CHOWAN ANURADHA | SOCIAL STUDIES | ST | REG-ST-OU-GEN |
| 17 | 17865 | 2624305067 | BODA VARAMMA | SOCIAL STUDIES | SC-2 | REG-SC-2-OU-FEMALE |
| 18 | 23168 | 2624107138 | P UMAKANTH | SOCIAL STUDIES | SC-3 | REG-SC3-OU-GEN |
| 19 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |
| 20 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |

The vacant seats may be filled by the candidates of the concerned category as per their merit in TG Ed.CET-2026 and guidelines prescribed by the convener, TG Ed.CET-2026.

# ఇరాన్ ఎవరి ముందూ మోకరిల్లే ప్రసక్తే లేదు

● ఏ శక్తీ మా దేశాన్ని నాశనం చేయలేదు ● అమెరికా బలప్రయోగం మానవతాసూత్రాలకు విరుద్ధం ● న్యూయార్క్ 'పత్రికాగోష్ఠి'లో పెజెష్కియన్ వెల్లడి

**న్యూయార్క్:** ఇరాన్‌ను ప్రపంచంలో ఏ శక్తీ నాశనం చేయలేదని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు.ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన మరునాడు న్యూయార్క్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎవరి ముందూ ఇరాన్ మోకరిల్లే ప్రసక్తే లేదని అన్నారు. ఒక దేశాన్ని నాశనం చేయడాన్ని గురించి అమెరికా పదే పదే మాట్లాడుతోందని, ఇవన్నీ మానవతా సూత్రాలకు విరుద్ధమని హెచ్చరించారు.ఇరాన్‌కు గొప్ప చారిత్రక మూలాలు ఉన్నాయని, ప్రపంచంలో ఏ శక్తి ఇరాన్‌ను నాశనం చేయలేదని అన్నారు.ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేయాలా? లేక ఒక గొప్ప దేశంగా ఎదిగేందుకు అవకాశం ఇవ్వాలా? అనే విషయంలో తాను ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదని ఐక్యరాజ్యసమితి సర్వసభ సమావేశంలో ట్రంప్ హెచ్చరిక ధోరణి ప్రసంగం చేశారు. దీనికి సమాధానంగా పెజెష్కియన్ పాత్రికేయులవద్ద పైవిధంగా స్పందించారు.ఒక ఒప్పందం కుదిరితే ఇరాన్ పశ్చిమాసియాలో లేదా ప్రపంచంలోనే ఒక అత్యుత్తమమైన దేశంగా ఎదిగేందుకు వీలు కలుగుతుందని, లేకపోతే సర్వనాశనం చేస్తామని ట్రంప్ అన్నారు. దీనిని ప్రస్తావించకుండా పెజెష్కియన్ స్పందించారు. ప్రపంచంలో అమెరికా బలప్రయోగ విధానం అనుసరిస్తోందని,బెదిరింపులకు దిగుతోందని విమర్శించారు. ఈ విధమైన బెదిరింపులు అంతర్జాతీయ సూత్రాలకు, చట్టాలకు పూర్తి విరుద్ధమన్నారు.వెనిజులా, క్యూబా, గ్రీన్‌లాండ్ తదితర దేశాల విషయంలో అమెరికా అనుసరిస్తున్న బెదిరింపు ధోరణులను ఆయన ప్రస్తావించారు. ఇంతబహిరంగంగా గతంలో ఎవ్వరూ దారుణ చర్యలకు ఒడిగట్టలేదని, ఇవన్నీ మానవతా సూత్రాలకు విరుద్ధమని అన్నారు. ఇరాన్ ఎన్ని ఒత్తిడులు ఎదుర్కొన్నప్పటికీ, ఐక్యంగా నిలబడ్డారని,క్షేత్రస్థాయిలో దేశాన్ని కాపాడుకుంటున్నారన్నారు.

**ఉగ్రవాదులంకాదు.. ఉగ్రవాద బాధితులం**

"మేం ఉగ్రవాదులం కాదు, అమెరికా ఉగ్రవాద బాధితులం'' అని మసూద్ పెజెష్కియన్ అన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 81వ సెషన్‌లో కేటాయించిన సమయం ప్రకారం బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ,అమెరికా ఉగ్రవాదానికి ఇరాన్ బలైపోతోందన్నారు.ఇరాన్ ప్రజలు అమెరికా ఉగ్రవాదానికి బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇరాన్ తనను తాను కాపాడుకోవడాన్ని ఆపదని, అదేసమయంలో శాంతికోసం చర్చలు జరపడానికి సిగ్గుపడబోదని అన్నారు. ఈ



అంతర్జాతీయ వేదికపై ఇరాన్ ఎదుర్కొంటున్న బాధలను తెలియజేయడానికే ఇక్కడకు వచ్చామన్నారు.ఒకవైపు యుద్ధం జరుగుతున్న తరుణంలో శత్రుదేశ నగరం న్యూయార్క్‌లో కాలుమోపి అంతర్జాతీయ వేదికపై ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ చేసిన ప్రసంగం ఆ దేశ ప్రజల జేజేలు అందుకుంది. గడచిన ఫిబ్రవరినెలలో అమెరికా దాడుల్లో మరణించిన ఇరాన్ సర్వాధినేత ఆయొతొల్లా అలీ ఖమేనీతోపాటు మినాబ్‌లో మరణించిన 160 మందికిపైగా పిల్లలకు సంబంధించిన పెద్ద పెద్ద ఫొటోలను ఆయన జనరల్ అసెంబ్లీ సమావేశంలో అందరి ఎదుటా ప్రదర్శించారు.''మమ్మల్ని మేం రక్షించుకుంటున్నాం అంతే, మేం ఎవ్వరిమీదా యుద్ధం చేయడం లేదు, మేం ఉగ్రవాదులం కాదు,అమాయకులైన ప్రజలను లక్ష్యంగా చేసుకుని పిరికిపందల్లా దాడులు చేస్తున్నారు దురాక్రమణదారులు,మేం మాకున్న సంపూర్ణ బలాన్ని ఉపయోగించి మమ్మల్ని మేం కాపాడుకుంటున్నాం,ఇప్పటికీ వారు మా మీద దాడులు చేసినా సరే, మేం వారి ముందు మోకరిల్లే ప్రసక్తే లేదు, మా మర్యాద,మా సార్వభౌమాధికారం,మా ప్రాదేశిక సమగ్రతలను మేం కాపాడుకుంటాం'' అని చెప్పారు. మమ్మల్ని లొంగదీయాలని ప్రయత్నిస్తే సాధ్యంకాదని శత్రువులు అర్థం చేసుకోవాలి,కానీ ఇప్పటికీ మేం చర్చలకు సిద్ధంగా ఉన్నాం'' అని ప్రకటించారు. అదేసమయంలో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌తో న్యూయార్క్‌లోనే ముఖాముఖీ చర్చలకు డోనాల్డ్ ట్రంప్ సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు.పెజెష్కియన్ ప్రసంగంపై ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ భాఘెర్ ఘాలిబాఫ్ స్పందిస్తూ, న్యూయార్క్‌లో అంతర్జాతీయ వేదికపై పెజెష్కియన్ 3000 సంవత్సరాల క్రితంనాటి ఇరాన్ నాగరికతను ప్రతిబింబించారని ప్రశంసించారు.ఎంతో ధైర్యం,సాహసంతో,స్థిరంగా నిలబడి శత్రుకేంద్రంలో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఆత్మాభిమానాన్ని,శక్తిసామర్థ్యాలను చాటి చెప్పారన్నారు.

# అఫ్గానిస్థాన్‌లో పాక్ దాడులు

నలుగురు మృతి

**కాబూల్:**అఫ్గానిస్థాన్‌లోని పది ప్రాంతాలపై పాకిస్థాన్ దళాలు గురువారం తెల్లవారకముందుగానే దాడులు చేశాయి. ఈ దాడుల్లో నలుగురు అఫ్గానిస్థాన్ పౌరులు మరణించారని ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ చెప్పారు.పాకిస్థాన్ దళాలకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. సరిహద్దుల నుండి తమ దేశంలోకి డ్రోన్ దాడులు జరిగాయని పాకిస్థాన్ ఆరోపించిన తర్వాత ఈ ప్రతీకార దాడులు జరిగాయి.కాందహార్,పక్టియా,ఖోస్ట్ రాష్ట్రాలోని పది ప్రాంతాలలో డ్రోన్లు దాచి ఉంచిన కేంద్రాలపై ఈ దాడులు చేసినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఇటీవలి నెలల్లో పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ మధ్య పరస్పర దాడులు మితిమీరాయి. ఇది క్రమంగా శత్రుత్వంగా మారుతోంది. తెహ్రిక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాదులకు అఫ్గానిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తూ తరుచు ఈ దాడులు చేస్తోంది.ఐతే సరిహద్దుల్లోంచి పాకిస్థాన్‌లోకి ఉగ్రవాదుల చొరబాట్లను అడ్డుకున్న తర్వాత తమ దేశంలోకి ఎనిమిది డ్రోన్లతో దాడులు జరిగాయని,దానికి ప్రతీకారంగా పది ప్రాంతాలపై దాడులు చేశామని పాకిస్థాన్ పేర్కొంది.

# వెనిజులా ఎన్నికలకు డెల్సీ హామీ

**న్యూయార్క్:**వెనిజులాలో స్వేచ్ఛగా పూర్తిస్థాయి ప్రజాస్వామ్యబద్ధ ఎన్నికలు నిర్వహిస్తామని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ హామీ ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఆమె మొదటిసారి మాట్లాడుతూ, దేశంలో ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఐతే ఒక తేదీ లేదా నెలను ఆమె ప్రకటించలేదు. దేశంలో ఇతర ప్రభుత్వ సంస్థలు ఎన్నికల నిర్వహణకు పూర్తి సహకారం ఇస్తాయన్నారు. దేశ పరివర్తనకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ఎన్నికలు నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు.వెనిజులాలో ఎన్నికలు జరపాలని న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి కార్యాలయం వెలుపల మంగళవారం ఆమెకు నిరసన ప్రదర్శన ఎదురైంది. వెనిజులాలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు అవకాశం ఇవ్వాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. చమురు వద్దు,కొత్త ముఖం,పాత పాలన'' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెనిజులా జాతీయ జెండాలను ప్రదర్శకులు ప్రదర్శించారు.అమెరికా ప్రభుత్వం వల్లనే మనదేశం స్వేచ్ఛకు దూరమైందని కారకస్ నుండి వలస వచ్చిన 34 ఏళ్ళ సోషల్ మీడియా మేనేజర్ మిగెల్ ఎడ్వర్డో మార్టినెజ్ విమర్శించారు.

# సైనికుల ఆత్మాహత్యా యత్నాలు


అబ్రహాం లింకన్ నౌకలో



**దుబాయ్:**పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా అమెరికా మోహరించిన ప్రతిష్ఠాత్మకమైన అబ్రహాం లింకన్ యుద్ధ నౌకలో ఉన్న సైనికులు విసుగెత్తిపోయి గత్యంతరం లేక ఇప్పటివరకూ ఎనిమిదిసార్లు ఆత్మాహత్యా ప్రయత్నాలు చేశారు. ట్రంప్ ప్రభుత్వం ఈ విషయాన్ని అధికారికంగా అంగీకరించిందని కాంగ్రెస్ సభ్యుడు ఒకరు గురువారం ప్రకటించారు.గత ఏడాదిలో ఈ విమాన వాహక నౌకను మధ్యధరా సముద్రంలో మోహరించారు.అనేకమంది అమెరికా సైనికులు నెలల తరబడి ఈ నౌకలో ఉండపోయారు. దీనివల్ల వారి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. వారు ఇళ్ళకు వెళ్ళి చికిత్స పొందాలని గాఢంగా కోరుకుంటున్నారు.వారికి సరైన ఆహార సరఫరా కూడా కొరవడింది. ఇంటి మీద బెంగ పెరిగింది. మరోవైపు తీవ్రమైన యుద్ధ ఒత్తిడి,ప్రాణహాని పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఈ దశలో వారు సెలవులు లేక,ప్రత్యామ్నాయ మార్గాలు లేక ఆత్మహత్యలకు ప్రయత్నం చేశారు. ఈ వార్తలన్నీ అంతర్జాతీయ మీడియాలో ప్రముఖంగా బయటకు వచ్చాయి. కానీ దీనిపై ట్రంప్ సరిగ్గా స్పందించలేదు.అబ్రహాం లింకన్ నౌకలో జరిగిన పరిస్థితులపై ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీకి చెందిన సభ్యుడు కిరిస్టెన్ గిల్లిబ్రాండ్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తాత్కాలిక నావికాదళ కార్యదర్శి హాంగ్ కావో పంపిన ఒక లేఖ ద్వారా సైనికులు ఆత్మహత్యలకు ప్రయత్నం చేశారన్న విషయాలు వెలుగుచూశాయి. ఈ లేఖను ఎ.ఎఫ్.పి స్వయంగా పరిశీలించింది. ఇవి కేవలం ఆత్మహత్యలకు ప్రయత్నాలే తప్ప నౌకలో ఆత్మహత్యలు జరగలేదని కూడా ఆ లేఖ ధృవీకరించింది.ఆగస్టునెలలో ఎయిర్ వింగ్‌కు చెందిన ఒక నావికులు సముద్రంలోకి దూకాడు. కానీ వెంటనే హెలికాప్టర్ ద్వారా అతడి ప్రాణాలు కాపాడారు.సముద్రంలోంచి బయటకు తీసుకువెళ్ళారు. మార్చినెలలో కూడా మరో నావికులు సముద్రంలో దూకాడు. అతడి సహచరులు బయటకు తీసుకువచ్చి స్వస్థలానికి పంపించారు. లింకన్ ఓ డ దక్షిణ చైనా సముద్రంలో విధులు నిర్వహించడానికి 2025లో కాలిఫోర్నియా నుండి బయలుదేరింది. ఫిబ్రవరి చివరిలో ఇరాన్‌పై దాడులు ప్రారంభించడానికి ముందుగానే ఈ నౌకను పశ్చిమాసియాకు తరలించారు.286 రోజులు సముద్ర ప్రయాణం తర్వాత చివరకు ఆ నౌక థాయ్‌లాండ్‌లో ఆగింది. నౌకలో సైనికుల మానసిక అనారోగ్యం,అస్వస్థత,అపరిశుభ్రతల గురించిన వార్తలను ట్రంప్ తేలిగ్గా కొట్టిపారేశారు.రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ కూడా ఇవన్నీ తప్పుడు వార్తలని అన్నారు.

# మీడియాపై నిషేధాన్ని తిరస్కరించిన కోర్టు

వైట్‌హౌస్‌లో ప్రవేశానికి జడ్జి ఆదేశం



**వాషింగ్టన్:**వైట్‌హౌస్‌లోకి అడుగుపెట్టకుండా సిఎన్ఎన్,ఎంఎస్ నౌ,పొలిటికో టీవీ నెట్‌వర్క్ పూల్‌పై నిషేధం విధిస్తూ ట్రంప్ సెప్టెంబరు 22వ తేదీన జారీ చేసిన ఉత్తర్వును అమెరికా న్యాయమూర్తి తిరస్కరించారు. తక్షణం ఈ ఉత్తర్వులను రద్దుచేసి మీడియాను వైట్‌హౌస్‌లోకి 14 రోజులపాటు అనుమతించేందుకు తాత్కాలిక ఉత్తర్వు ఇచ్చారు. దీంతో ట్రంప్‌కు న్యాయస్థానం ద్వారా మరో ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ తీసుకున్న అనేక దూకుడు చర్యలను అమెరికా సుప్రీంకోర్టు సహా అనేక జిల్లా, రాష్ట్రస్థాయి న్యాయస్థానాలు తిరస్కరిస్తూనే ఉన్నాయి. ఈ పరంపరలో భాగంగా మీడియా పూల్‌పై ట్రంప్ విధించిన నిషేధం చెల్లదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.''ట్రంప్ చర్య మీడియా సంస్థలకున్న రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలను నెరవేర్చకుండా వారికున్న సముచితమైన హక్కులను ఉల్లంఘించే అవకాశం ఉంది, వెంటనే ఆ మూడు వార్తాసంస్థలను వైట్‌హౌస్‌లోకి ప్రవేశ పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలి'' అని కొలంబియా జిల్లా కోర్టు న్యాయమూర్తి తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. తన వార్తలను వక్రీకరిస్తున్నారని, అసత్య ప్రచారం చేస్తున్నారని ట్రంప్ ఈ మీడియా పూల్‌పై మండిపడ్డారు. ఈ మూడు టీవీలకు సంబంధించిన నెట్‌వర్క్ పూల్‌పై నిషేధం విధించే చట్టబద్ధమైన హక్కులు తనకు ఉన్నాయని ట్రంప్ వాదించారు. ఆయన నిషేధం విధించిన కొద్ది సేపటికే వైట్‌హౌస్‌కు చెందిన ''ట్రంప్ టీవీ–24/7'' తన ప్రసారాలు ప్రారంభించింది. పొలిటికో,సిఎన్ఎన్,ఎంఎస్ నౌలకు చెందిన పాత్రికేయులకున్న గుర్తింపు కార్డులను లాక్కుని వారిని లోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో ఈ నెట్‌వర్క్ పూల్‌లో ఉన్న టీవీ సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కొలంబియా కోర్టు పైవిధంగా స్పందించింది.ట్రంప్ నిషేధం విధించిన వెంటనే ఇతర మీడియా సంస్థలు కూడా తోటి సంస్థలకు తమ సంఘీభావం ప్రకటించాయి. ఫాక్స్‌న్యూస్, సిబిఎస్ మీడియా, ఎన్‌బిసి, ఎబిసి, సిఎన్ఎన్ ఒక ఉమ్మడి ప్రకటనలో ట్రంప్ వైఖరిని ఖండించాయి. గతంలో ఇతర ప్రధాన స్రవంతి మీడియాతో కూడా ట్రంప్ ఇదేవిధంగా ఘర్షణాత్మక వైఖరి అనుసరించారు. బిబిసితో కోర్టుకేసు ఇప్పటికీ విచారణలో ఉంది. సిబిఎస్,న్యూయార్క్ టైమ్స్,ఫాక్స్‌న్యూస్ సహా 49 మీడియా సంస్థలు కూడా పొలిటికో,సిఎన్ఎన్,ఎంఎస్ నౌల వ్యాజ్యానికి మద్దతు ఇచ్చాయి.ఒక న్యాయపరమైన పత్రాన్ని కోర్టులో దాఖలు చేశాయి.ట్రంప్ తరచు మీడియా సంస్థలను విమర్శిస్తారు. వాల్‌స్ట్రీట్ జర్నల్,ద న్యూయార్క్ టైమ్స్,బిబిసిలతో కూడా ఆయన గతంలో ఘర్షణలకు దిగారు.

## ప్రత్యేక కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

పాటు ఆయా సంబంధిత జిల్లాల కలెక్టర్‌లను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు(కెసిఆర్), ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులతో పాటు మాజీ మంత్రులు కె.టి.రామారావు(కెటిఆర్), టి.హరీశ్ రావు, జి.జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, పలువురు ముఖ్య నాయకులకు చెందిన భూ వ్యవహారాలపై ఈ కమిటీ ప్రధానంగా విచారణ జరపనుంది. ఎర్రవల్లి, సిరివెంకటాపూర్ భూములు, భూములు, రంగనాయకసాగర్ సమీపంలోని స్థలాలు, జన్వాడ్‌లో కెటిఆర్ కుటుంబ సభ్యులు, అనుచరులు కొనుగోలు చేసిన భూములపై ఆరా తీయనున్నారు. అలాగే అజీజ్ నగర్‌లో హరీశ్ రావు భూములు, వట్టినాగులపల్లిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి భూములు, శంకరాహిల్స్ కొనుగోళ్లపై కూడా పరిశీలన జరగనుంది. దీంతో పాటు మల్లన్నసాగర్ భూసేకరణ ఆరోపణలు, అసైన్డ్ భూముల ఆక్రమణలు, ధరణి మాడ్యూల్ దుర్వినియోగం, భూదాన్ భూముల కొనుగోళ్లు, జీరా భూముల్లో ఎల్విన్ స్టీఫెన్సన్ లీజ్ భూముల రెగ్యులరైజేషన్ వ్యవహారాలపై విచారణ చేపట్టనున్నారు. అంతేకాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ భూముల కేటాయింపులు, మహబూబ్ నగర్ జిల్లా గుండేడ్‌లోని పలు సంస్థల వ్యవహారాలు, మిడ్ మానేర్ రిజర్వాయర్ పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల కేటాయింపులలో జరిగిన అక్రమాలపై కమిటీ విచారించనుంది. విచారణకు సంబంధించి ఏ శాఖ నుంచైనా అవసరమైన రికార్డులు, పత్రాలు, డేటాను సేకరించే సంపూర్ణ అధికారాలను కమిటీకి ప్రభుత్వం కల్పించింది. విచారణను వేగవంతం చేసి నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

## దెబ్బతీసిన జ్ఞానేశ్

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ఢిల్లీ కార్యదర్శి రవి రాయ్ హాజరయ్యారు.భారత ఎన్నికల సంఘం పనితీరుపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన పరిశోధనాత్మక కథనంలో వెల్లడైన అంశాలపై వామపక్ష పార్టీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఏకపక్ష ఎస్ఐఆర్, ఫారం–6లో మార్పులు, నియమ నిబంధనలను మార్చేయడంపై ప్రతిపక్ష పార్టీలు పదేపదే లేవనెత్తిన ఆందోళనలను ఆ కథనం సమర్థించాయని వామపక్ష నేతలు పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లు స్వయంగా పలు నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆ ఆందోళనలను పట్టించుకోలేదని, ఇసిఐ ఒక స్వతంత్ర సంస్థగా కాకుండా బిజెపి చేతిలో కీలుబొమ్మగా పనిచేస్తోందన్నది స్పష్టమైందని అన్నారు. ఇసిఐ ఒక సాధారణ సంస్థ కాదని, భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్య విశ్వసనీయత దాని స్వాతంత్ర్యం, నిష్పాక్షికత, న్యాయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

**ఎన్నికల కమిషనర్‌ల ఎంపిక పద్ధతిని మార్చాలి**

సిఇసి పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, ఓటర్ల జాబితా నుండి అన్యాయంగా మినహాయించబడిన వారందరి ఓటు హక్కులను పునరుద్ధరించాలని ఐదు వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు డి.రాజా(సిపిఐ), ఎం.ఎ.బేబీ(సిపిఐ(ఎం)), దీపాంకర్ భట్టాచార్య( సిపిఐ(ఎంఎల్) లిబరేషన్), జి.దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్), మనోజ్ భట్టాచార్య (ఆర్ఎస్‌పి)ల పేరుతో ప్రకటన విడుదల చేశారు. ఇసిఐ స్వతంత్ర, ప్రజాస్వామ్యయుత పనితీరును పునరుద్ధరించాలని, ఎన్నికల కమిషనర్ల నియామకానికి ఉన్న ప్రస్తుత వ్యవస్థను తొలగించి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన సుప్రీంకోర్టు ప్రతిపాదించిన ఎంపిక కమిటీ ఆధారిత యంత్రాంగాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

## 48 గంటల గడువు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని ఆయన విమర్శించారు. 'జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయకపోతే దేశవ్యాప్తంగా నిరసనలు ప్రారంభిస్తాం. ఆ తర్వాత ఢిల్లీలో ఆందోళన చేపడతాం. సిఇసి రాజీనామా చేయకపోతే జంతర్ మంతర్ 2.0 తప్పకుండా జరుగుతుంది' అని దీప్కే స్పష్టం చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని భావిస్తే ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో పాల్గొనకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఎన్నికల ఫలితాలు తారుమారవుతున్నాయని మీకు తెలుసంటే, మీరు వాటిలో పాల్గొనకూడదు. దీనిపై మీరు ఒక వైఖరి ఎంచుకోవాలి. ఒక నిర్ణయం తీసుకోవాలి' అని ప్రతిపక్ష పార్టీల నేతలను కోరారు. జ్ఞానేశ్ కుమార్‌ను భారత ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పుగా దీప్కే అభివర్ణించారు. ఎవరికి ఓటు వేసే హక్కు ఉండాలో ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తోందని ఆయన విమర్శించారు. 'మన ఓటు హక్కును రద్దు చేయడానికి జ్ఞానేశ్ ఎవరు?' అని ప్రశ్నిస్తూ, ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్'కు సంబంధించిన అంశాలపై ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు, సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పదేపదే ప్రశ్నలు లేవనెత్తినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించిన మరుసటి రోజే సిజెపి స్పందిస్తూ, ఈ వ్యాఖ్యలు చేసింది. దేశవ్యాప్తంగా 'సర్' అమలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల పర్యవేక్షణలోనే సాగుతోంది. అయితే గత పది నెలల్లో తమకు తెలియకుండా తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాలపై సంధు, జోషి కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఆ పత్రిక కథనం పేర్కొంది. ఒకే రోజు నాలుగుసార్లు వారు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు కూడా తెలిపింది.

## ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని కోరారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద భగత్‌సింగ్ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.ధర్మేంద్ర మాట్లాడుతూ భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న జన్మించారని తెలిపారు. తన రచనలు, జైలు లేఖలు, రాజకీయ ఆలోచనల ద్వారా భగత్‌సింగ్ యువతను సామాజిక మార్పుపై ఆలోచింపచేలా చేశారని పేర్కొన్నారు. భగత్‌సింగ్ పేరును కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా ఆయన జీవితాన్ని, రచనలను, ఆలోచనలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత చరిత్రను తెలుసుకుని, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేలా జయంతి కార్యక్రమాలను నిర్వహించాని కోరారు. శ్రీమాన్, నేర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లా, మండలం, పట్టణం, విద్యాసంస్థల్లో విద్యార్థులు, యువత భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. భగత్‌సింగ్ జీవిత చరిత్రపై చర్చలు, పుస్తక ప్రదర్శనలు, విద్యార్థి సమావేశాలు, యువజన సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, విద్యను కొనసాగించడం, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవడం, సామాజిక అసమానతలపై అవగాహన పెంచుకోవడం వంటి అంశాలను జయంతి కార్యక్రమాల్లో చర్చించాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. సత్య ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుషేక్ మహమూద్, సల్మాన్ బేగ్, రాష్ట్ర సమితి సభ్యులు కళ్యాణ్, రాజ్‌కుమార్, అక్రమ్, అరుణ్, భాను, బి. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, పురపాలక సంస్థలు, డిటిసిపి లేదా ఇతర పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవన నిర్మాణం లేదా అపార్ట్‌మెంట్ అనుమతులు పొందిన ఆస్తులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఎ సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అనుమతి పొందిన అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ తప్పనిసరిగా దరఖాస్తుదారులు సమర్పించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో తలెత్తే సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా రిజిస్ట్రార్, హెచ్ఎండిఎ లేదా పురపాలక సంస్థ లేదా గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. ఈ ఆదేశాలను తక్షణమే అమల్లోకి తెచ్చేందుకు వీలుగా అన్ని జిల్లా కలెక్టర్లు, డిటిసిపి, హెచ్ఎండిఎ అధికారులకు రెవెన్యూ శాఖ ఆదేశాలు పంపింది. 22ఎ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇప్పటికే అమలులోకి వచ్చిన నిర్ణయాలే నిదర్శనమని మంత్రి తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని దాదాపు 64 కాలనీల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జి.ఓ 118కు అనుగుణంగా మెమో జారీ చేయడం, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యను జి.ఓ 76 ద్వారా పరిష్కరించే దిశగా కీలక నిర్ణయం తీసుకోవడం వీటిలో ప్రధానమైనవని మంత్రి చెప్పారు. భూమి, ఇల్లు వంటి అంశాల్లో ప్రజలు సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలకడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. 22ఎలోని అన్ని భూములను ఒకే గాటన కట్టకుండా, భూమి స్వభావం, అందుబాటులో ఉన్న రికార్డులు, చట్టబద్ధమైన అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హమైన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపశమనం కలిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఈ నిర్ణయంతో తెలంగాణలోని వేలాది మంది ఆస్తిదారులు, ప్లాట్లు, ఫ్లాట్ల కొనుగోలుదారులకు పెద్ద ఎత్తున ఊరట లభించనుంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పలు నివాస కాలనీల ప్రజలకు ఈ నిర్ణయం లబ్ధి చేకూర్చనుంది. చాలా కాలంగా స్తంభించిపోయిన రియల్ ఎస్టేట్ లావాదేవీలకు మళ్లీ చలనం వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బాధితులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకోవడం ద్వారా తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది.

## అప్రూవర్‌గా మారాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దేశానికి వారు చేసిన నష్టాలపైమోదీ, షా విచారణను ఎదుర్కొంటారని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన రాహుల్, 'సిఇసి చేసిన పని భారత దేశానికి వ్యతిరేకంగా చేసిన చర్య' అని పేర్కొన్నారు. 'ఇది రాజ్యాంగంపై, దేశ న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి. ఓటును కాపాడాల్సిన బాధ్యత మీపై ఉంది. దీనిని రుజువు చేయడానికి మా వద్ద తగినంత సమాచారం ఉంది. దీనికి పరిణామాలు తప్పవు. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంటే మేము చూస్తూ మౌనంగా కూర్చోం. దీనికి బాధ్యులైన వారికి శిక్ష పడుతుంది' అని రాహుల్ అన్నారు. ఇప్పుడు జరుగుతున్న వ్యవహారంపై ప్రధాని మోదీ, హోంమంత్రి షా ఇద్దరిపైనా విచారణ జరుగుతుందని, ఈ కుట్రలో వారే అగ్రస్థానంలో ఉన్నారని రాహుల్ విమర్శించారు. వారు ఈ దేశానికి చేసిన ద్రోహంపై విచారణ జరుగుతుందని రాహుల్ అన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ధ్వంసం చేసినందుకు వారు 'దేశద్రోహులు' అవుతారని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ, అమిత్ షా మాట్లాడిన తీరును ప్రజలు గమనించాలని కోరిన రాహుల్, కొన్ని వీడియోలను విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఆ వీడియోల్లో అమిత్ షా బిజెపి మరో 30 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని చెప్పడం, ప్రధాని మోదీ 'అబ్ కీ బార్ 400 పార్' అనే నినాదం చేయడం వినిపించాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో పనిచేసే ఏ రాజకీయ నాయకుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని రాహుల్ అన్నారు భారతదేశంలో ప్రభుత్వంపై ప్రజల్లో ఏర్పడే వ్యతిరేకత ఒక ప్రాథమిక రాజకీయ శక్తి గా మారుతుందని, అది ప్రభుత్వాలను, నాయకులను ఎదుర్కొంటుందని రాహుల్ అన్నారు. బంగ్లాదేశ్ యుద్ధంలో విజయం సాధించినప్పటికీ, ఏడాది, రెండేళ్లలో ఇలాంటి వ్యతిరేకత కారణంగానే ఇందిరా గాంధీపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడిందని రాహుల్ చెప్పారు. 'ప్రతి నాయకుడి విషయంలోనూ ఇది జరిగింది. కానీ మోదీ, షా, బిజెపి విషయంలో ఇది జరగడం లేదు. ఇప్పుడు దానికి సమాధానం ఏమిటో మనకు తెలుసు' అని అన్నారు. ఒక వ్యక్తికి ఉన్న ప్రజాదరణను, ఒక ప్రభుత్వం పనితీరును మనం అర్థం చేసుకోగలమని, కానీ, ప్రజా వ్యతిరేకత పూర్తిగా అదృశ్యం కాదని అన్నారు. సద్దాం హుస్సేన్ పాలించిన ఇరాక్‌లో, ఉత్తర కొరియాలో కూడా సంపూర్ణ మద్దతు అనేది ఉండదని వ్యాఖ్యానించారు. ఓటు మన ప్రజాస్వామ్యానికి పునాదని రాహుల్ అన్నారు. ఎన్నికల సంఘం రక్షించే ఓటు రాజ్యాంగాన్ని కూడా రక్షిస్తుందని పేర్కొన్నారు. ఓటును ధ్వంసం చేసి ఉంటే మన రాజ్యాంగం కూడా ధ్వంసమైనట్టేనని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం ధ్వంసమైతే చట్టాలు చట్టబద్ధతను కోల్పోతాయని, సంస్థలు అర్థరహితంగా మారతాయని ఆయన అన్నారు. ఓటును రక్షించే సంస్థ ఎన్నికల సంఘమేనని, అక్కడి నుంచే మిగతా వ్యవస్థలన్నీ ఉద్భవిస్తాయని రాహుల్ అన్నారు. ఓటు ధ్వంసమైతే రాజ్యాంగం పనిచేయదని, చట్టాలు ధ్వంసమవుతాయని, సంస్థలకు అర్థం ఉండదని పేర్కొన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని తాను వంద శాతం నమ్ముతున్నానని రాహుల్ అన్నారు. 'ఓటు చోరీ నుంచి చట్టం చోరీ వస్తుంది. దాని నుంచి సంస్థల చోరీ జరుగుతుంది' అని మండిపడ్డారు.

## చైనా–అమెరికా కృషి

(మొదటి పేజీ తరువాయి)

వెళ్ళేమార్గంలో కారు మార్గానికి ఇరువైపులా అమెరికాలో ఉన్న చైనీయులు, అమెరికన్లు ఇరు దేశాల జెండాలు ఊపుతూ ఆయనకు స్వాగతం పలికారు.ఒక లిఖితపూర్వక సందేశంలో జీ జిన్‌పింగ్ అమెరికా ప్రజలకు తన శుభాకాంక్షలను తెలియజేశారు.ఉమ్మడి కృషి ద్వారా తన అమెరికా పర్యటన ఖచ్చితంగా సత్ఫలితాలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరుదేశాల శ్రేయస్సును పెంపొందించడమే కాకుండా ప్రపంచశాంతికి కొత్త ఆశలు కల్పిస్తుందన్నారు.ఇరుదేశాలూ చాలాకాలంగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్నాయని, వారి పరస్పర ప్రయోజనాలు గాఢంగా ముడిపడి ఉన్నాయన్నారు.అమెరికా–చైనా ప్రత్యర్థులు కాదని,ఈ రెండు దేశాలు భాగస్వామ్యులని, యావత్ ప్రపంచ శ్రేయస్సును ముందుకు నడిపిస్తాయని వ్యాఖ్యానించారు.చైనా జాతి గొప్ప పునరుజ్జీవనం,అమెరికాను గొప్పగా తీర్చిదిద్దడం ఈ రెండూ విషయాలు ఏకకాలంలో సాధ్యమవుతాయన్నారు.ఈ రెండు దేశాలు పరస్పర విజయాలు సాధించడంలో ఒకదానికొకటి సహాయం చేసుకుంటూ ప్రపంచ శ్రేయస్సును ముందుకు నడిపిస్తాయన్నారు.వ్యూహాత్మకమైన స్థిరత్వంతో కూడిన నిర్మాణాత్మక సంబంధాలు సాధించే విషయంపై మే నెలలో ట్రంప్ చైనా పర్యటన సందర్భంగా చేసిన ప్రతిపాదనను తాను కూడా అంగీకరించానన్నారు. ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి ఇది మార్గదర్శకంగా నిలిచిందన్నారు.రెండు దేశాలూ పరస్పర సహకారాన్ని లక్ష్యంగా చేసుకుని ఒకేదిశగా ముందుకు ప్రయాణం చెయ్యాలని ప్రతిపాదించారు.ఇరుదేశాలు పరిమిత పోటీతో ఉండాలని,విభేదాలను సర్దుబాటు చేసుకోగలస్థాయిలో వ్యవహరించాలని,శాంతి వాగ్దానాలతో ఇరు దేశాలమధ్యా స్థిరమైన సంబంధాలను ప్రోత్సహించాలని జిన్‌పింగ్ అన్నారు.'ఇరుదేశఋాలమధ్యా నిర్మాణాత్మక సంబంధాలు నిరంతరం సుసంపన్నం కావాలని ఆశించారు.అమెరికాలో అన్నివర్గాల ప్రజలతో విస్తృతంగా మమేకమై స్నేహాన్ని బలోపేతంచేయడానికి తాను ఆసక్తిగా ఉన్నానన్నారు. 'ప్రపంచం అభివృద్ధి చెందుతోంది,కాలం మారుతోంది,కానీ చైనా–అమెరికా మధ్య శాంతియుత సహజీవన చారిత్రక తర్కం మారలేదు,ఇరుదేశాలమధ్యా స్నేహపూర్వక మార్పిడికి సంబంధించిన సద్భావనలో మార్పులేదు,ఈ రెండు దేశాలపట్లా అంతర్జాతీయ దేశాలకు ఉన్న సాధారణ అంచనాలు కూడా మారలేదు'' అని జిన్‌పింగ్ ఉద్ఘాటించారు.ఆ తర్వాత ట్రంప్ జిన్‌పింగ్ దంపతులకు,వారి పరివారానికి బ్రహ్మాండమైన విందు ఏర్పాటు చేశారు.

**జనవరి 10 వరకూ సుంకాల తగ్గింపు**
**తొలిసారి కృత్రిమ మేధపై చర్చ**

అమెరికా–చైనా మధ్య నవంబరునెలతో ముగిసిపోయే వాణిజ్య ఒప్పందాన్ని జనవరి పదో తేదీ వరకూ పొడిగించుకున్నట్లు అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు.ఎక్కువకాలంపాటు తక్కువ సుంకాలతో వాణిజ్యం చేసేందుకు ఈ ఒప్పందాన్ని పొడిగించామన్నారు. అదేవిధంగా అరుదైన ఖనిజాలను పొందడానికి కూడా అమెరికా తన ప్రయోజనాలను చూసుకుంది.గడచిన అక్టోబరులో ట్రంప్ దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా చైనాతో సుంకాలను ఏడాదిపాటు తక్కువస్థాయిలో కొనసాగించేందుకు అంగీకరించారు. ఈ ఒప్పందం ఈ నవంబరుతో ముగియనున్నదశలో ఈ పొడిగింపునకు రెండు దేశాలూ అంగీకరించాయి.అదేవిధంగా కృత్రిమ మేధపై మొదటిసారి ఈ రెండు దేశాలు చర్చలు పూర్తి చేసినట్లు చైనా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి హే యాడాంగ్ గురువారం చెప్పారు.పరస్పర గౌరవం,శాంతియుత సహజీవనం,పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికపై ఇరు దేశాలకు ఆందోళన కలిగించే అంశాలపై లోతైన,నిర్మాణాత్మక చర్చలు జరిగినట్లు చెప్పారు.

# మారథాన్‌లో ‘సీమ’కు చరిత్రాత్మక కాంస్యం

## మిక్స్‌డ్ రిలేలో రజతం

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. ఐదో రోజు షూటర్లు వెండి వెలుగులు విరజిమ్మగా.. అథ్లెట్లు కూడా పోడియంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. పది వేల మీటర్ల పరుగులో సీమా కుమారి కంచు మోత మోగించింది. సీమ కాంస్యం అందుకున్న ఇరవై నిమిషాల్లోనే మిక్స్‌డ్ రీలే(4x400 మీటర్ల) ఫైనల్లో భారత బృందం రజతం ఒడిసిపట్టింది. ఫలితంగా భారత్ ఖాతాలో 17 పతకాలు చేరాయి. జపాన్‌లోని నగోయలో జరుగుతున్న పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు పతక పోరులో దూసుకెళ్తున్నారు. మిక్స్‌డ్ రిలే విభాగంలో. మిక్స్‌డ్ విభాగం ఫైనల్లో పూవమ్మ రాజు, విశాల్ థెన్నరసు, విథ్యా రామరాజు, మను టీఎస్లు రెండో స్థానంతో రజతం గెలుపొందారు. గురువారం ఫైనల్లో.. విథ్యా, విశాల్ చిరుతలా పరుగెత్తారు. వీరి కృషి ఫలితంగా ఈ టోర్నీలో తమ రికార్డును కాపాడుకుంది మిక్స్‌డ్ రీలే బృందం. ఇదివరకు 2018లో స్వర్ణం, 2022 ఎడిషన్లో భారత టీమ్ రజతం గెలుపొందింది. అంతకుముందు.. మహిళల 10 వేల మీటర్ల పరుగులో సీమా కుమారి సత్తా చాటింది. ఈ మారథాన్ రేసులో 16 ఏళ్లుగా పతకం కోసం నిరీక్షిస్తున్న భారత్‌ను సంబురాల్లో ముంచెత్తింది. ఫైనల్లో 32:50:05 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని కాంస్య పతకాన్ని ముద్దాడిందీ హిమాచల్ ప్రదేశ్ అథ్లెట్. ఆమె మూడో స్థానానికి పరిమితమవ్వగా.. విన్ఫ్రెడ్ యవీ(బహ్రెయిన్) పసిడి, నొజొమి(జపాన్) వెండి పతకాలు సాధించారు. కామన్వెల్త్ క్రీడల్లో విఫలమైన భారత చిరుత గురిందర్వీర్ సింగ్ ఈసారి అంచనాలు అందుకున్నాడు. పురుషుల 100 మీటర్ల పరుగులో అతడితో పాటు ఇండియన్ బోల్ట్ అనిమేశ్ కుజుర్ సెమీస్‌కు దూసుకెళ్లాడు. పురుషుల కబడ్డీలో భారత జట్టు దర్జాగా సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో తో చైనీస్ తైపీని ఇండియా చిత్తు చేసింది.







## పతకాల వేటలో దూసుకెళ్తున్న భారత్

## ఐదో రోజు ఏకంగా 5 పతకాలు

జపాన్‌లోని నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నారు. ఆసియా క్రీడల ఐదో రోజు గురువారం భారత్ మొత్తం 5 పతకాలను సొంతం చేసుకుంది. దీంతో ఇప్పటివరకు భారత్ సాధించిన మొత్తం పతకాల సంఖ్య 17కు చేరింది. అథ్లెటిక్స్, వుషు, రోయింగ్, షూటింగ్ విభాగాల్లో మన అథ్లెట్లు సత్తా చాటగా..పురుషుల కబడ్డీ, హాకీ జట్లు ఘన విజయాలతో ముందుకు సాగుతున్నాయి. ఐదో రోజు ఇండియాకు మికస్డ్ 4x400 మీటర్ల రిలేలో అద్భుతమైన ప్రదర్శనతో రజత పతకం లభించింది. వుషు పోటీలలో పతకం సాధిస్తుందని భావించిన రోషిబినా దేవి నాఓరెమ్ రజత పతకంతో మెరిసింది. రోయింగ్‌లో పతకాల వేటను కొనసాగిస్తూ పురుషుల డబుల్ స్కల్స్ విభాగంలో సత్నామ్ సింగ్, సల్మాన్ ఖాన్ల జోడీ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వీటితో పాటు అథ్లెటిక్స్ 10,000 మీటర్ల రేసులో సీమా, మికస్డ్ స్కీట్ ఈవెంట్లో అనంత్జీత్ సింగ్ నరుకాపరినాజ్ ధాలివాల్ జోడీ భారత్కు కాంస్య పతకాలను అందించారు. ఇతర టీమ్ ఈవెంట్లలోనూ భారత్ కు శుభపరిణామాలు ఎదురయ్యాయి. పురుషుల హాకీ పూల్ మ్యాచ్లో భారత్ 8—2 తేడాతో దక్షిణ కొరియాను చిత్తు చేసి ఘన విజయం సాధించింది. మరోవైపు భారత పురుషుల కబడ్డీ జట్టు అద్భుతమైన ఆటతీరుతో సెమీఫైనల్‌కు అర్హత సాధించి పతకాన్ని ఖాయం చేసుకుంది.








## దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్

## కొరియాపై భారత్ విక్టరీ

ఆసియా క్రీడల హాకీ ఈవెంట్లో ఇండియా దుమ్మురేపుతోంది. పూల్ ఏ నుంచి భారత జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. టోక్యోలో గురువారం దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా 8—2 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత స్ట్రయికర్ దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దిల్‌ప్రీత్‌తో పాటు అభిషేక్, శిలానంద్ లక్రా, సుఖ్జీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, రాజిందర్ సింగ్ కూడా గోల్స్ చేశారు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే తొలిసారి దక్షిణ కొరియాపై ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇండియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ విక్టరీతో ప్రస్తుతం పూల్ ఏ స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. శనివారం జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు జపాన్‌తో భారత్ తలపడనున్నది.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## హోర్ముజ్ జలసంధి ఎందుకు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది?

- 2026లో నాబ్ఫిడ్ ఏ రంగానికి సంబంధించిన సంస్థగా వార్తల్లో నిలిచింది?
  మౌలిక సదుపాయాల దీర్ఘకాలిక ఆర్థిక సమీకరణకు సంబంధించిన అభివృద్ధి ఆర్థిక సంస్థ
- నాబ్ఫిడ్ పూర్తి రూపం ఏమిటి?
  నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్.
- పిఎం ఇ–బస్ సేవ పథకం ప్రధాన లక్ష్యం ఏమిటి?
  పట్టణ ప్రజా రవాణాను మెరుగుపరచడానికి 10,000 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం.
- పిఎం ఇ–బస్ సేవను ఏ కేంద్ర మంత్రిత్వ శాఖ అమలు చేస్తోంది?
  గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.
- పిఎం ఇ–బస్ సేవలో 2026 ఆగస్టు నాటికి ఎన్ని బస్సులు పనిచేస్తున్నట్లు నమోదైంది?
  500కు పైగా.
- 2026 బ్రిక్స్ న్యూఢిల్లీ ప్రకటనలో స్థానిక కరెన్సీల వినియోగానికి ఎందుకు ప్రాధాన్యం ఇచ్చారు?
  సరిహద్దు దాటి జరిగే వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థలను బలోపేతం చేయడానికి.
- బ్రిక్స్ విస్తరణలో 2026 నాటికి చేరిన ముఖ్య దేశాల్లో ఇరాన్తో పాటు ఏ దేశాలు ఉన్నాయి?
  ఇండోనేషియా, ఈజిప్ట్, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు.
- 2026 బ్రిక్స్ సమావేశంలో భారత్ ఏ ప్రపంచ సమస్యకు సంబంధించి ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ప్రతిపాదించింది?
  అంటువ్యాధుల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ప్రతిపాదించింది.
- సింధు నదీ జలాల ఒడంబడికకు సంబంధించి భారత్ ఏ వైఖరి తీసుకుంది?
  అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాన్ని భారత్ తిరస్కరించింది.
- సింధు నదీ జలాల ఒడంబడిక ఏ రెండు దేశాల మధ్య ఉంది?
  భారత్, పాకిస్థాన్.
- సింధు జలాల ఒడంబడిక 1960లో ఏ సంస్థ మధ్యవర్తిత్వంతో కుదిరింది?
  ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో.
- 2026లో బ్రిక్స్ దేశాలు ఐక్యరాజ్యసమితి సంస్కరణల్లో ఏ అంశాన్ని కోరాయి?
  అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించాలని కోరాయి.
- 2026లో ప్రపంచ వాణిజ్యంలో ఆందోళన కలిగిస్తున్న అంశాలు ఏవి?
  సుంకాలు, వాణిజ్య రక్షణవాదం, సరఫరా గొలుసుల అంతరాయం.
- 2026లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న ప్రధాన భౌగోళిక రాజకీయ అంశాలు ఏమిటి?
  పశ్చిమ ఆసియా ఘర్షణలు మరియు ఇంధన సరఫరా అంతరాయాలు.



- హోర్ముజ్ జలసంధి ఎందుకు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది?
  ప్రపంచ చమురు, సహజవాయువు సముద్ర రవాణాలో ఇది కీలక మార్గం.
- బాబ్ ఎల్ మాండెబ్ జలసంధి ఏ సముద్ర మార్గానికి కీలకం?
  ఎర్ర సముద్రం–అడెన్ గల్ఫ్ సముద్ర మార్గానికి.
- 2026లో బ్రిక్స్ అధ్యక్ష పదవిని భారత్ ఏ దేశానికి అప్పగించింది?
  చైనాకు.
- బ్రిక్స్‌లో భారత్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యం ఎందుకు ఉంది?
  గ్లోబల్ సౌత్ నాయకత్వం, బహుళధ్రువ ప్రపంచ వ్యవస్థ, వాణిజ్య వైవిధ్యీకరణ, ఆర్థిక సహకారానికి వేదికగా ఇది ఉపయోగపడుతుంది.
- 2026లో ఐక్యరాజ్యసమితి ఏ కొత్త ప్రపంచపట రూపకల్పనపై తీర్మానం ఆమోదించింది?
  ఈక్వల్ ఎర్త్ మ్యాప్.
- మెర్కేటర్ ప్రొజెక్ట్‌పై ఈక్వల్ ఎర్త్ మ్యాప్‌కు ఉన్న ప్రధాన ప్రయోజనం ఏమిటి?
  ఖండాల విస్తీర్ణాన్ని మరింత వాస్తవికంగా చూపిస్తుంది, ముఖ్యంగా ఆఫ్రికా పరిమాణాన్ని.
- 2026లో ప్రపంచ వాతావరణ పరిస్థితుల్లో ఆగస్టు నెలకు ఉన్న ప్రత్యేకత ఏమిటి?
  ఆగస్టు 2026 ప్రపంచంలో అత్యంత ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచింది.
- 2026 ఆగస్టులో ప్రపంచ ఉష్ణోగ్రత పారిశ్రామిక పూర్వ స్థాయితో పోలిస్తే సుమారుగా ఎంత పెరిగింది?
  సుమారు 1.65 డిగ్రీల సెల్సియస్.
- వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న ప్రధాన ప్రమాదాల్లో ప్రధానమైనవి ఏవి?
  తీవ్ర ఉష్ణోగ్రతలు, అడవి మంటలు, నీటి కొరత, పంట నష్టం, వలసలు.
- 2026లో హిమాలయాల్లో వార్తల్లో నిలిచిన ప్రత్యేక హిమనదీ నిర్మాణాలు ఏమిటి?
  హ్యాంగింగ్ గ్లేసియర్స్ లేదా వేలాడే హిమనదాలు.
- హ్యాంగింగ్ గ్లేసియర్ అంటే ఏమిటి?
  ప్రధాన లోయ హిమనదికి పైభాగంలో లేదా నిటారైన పర్వత వాలుపై వేలాడుతున్న హిమనదీ అవశేషం.
- 2026లో షార్ప్‌టెయిల్ శాంపైర్ ఏ అంశానికి సంబంధించి వార్తల్లో నిలిచింది?
  పక్షి జాతి, వలస పక్షుల జీవావరణం, జీవవైవిధ్య పరిశీలనకు సంబంధించి.
- షార్ప్‌టెయిల్ శాంపైర్ ప్రధానంగా ఏ రకమైన పక్షి?
  వలస తీరప్రాంత పక్షి.
- అనాక్ క్రకటావా ఏ దేశంలో ఉంది?
  ఇండోనేషియాలో.
- అనాక్ క్రకటావా ఏ అగ్నిపర్వత వ్యవస్థలో భాగం?
  క్రకటావా అగ్నిపర్వత వ్యవస్థలో.

# రేకొండ రైతుల భూములకు పట్టాలు ఇప్పించాలి

### రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటికి మాజీఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, రేకొండ గ్రామంలోని సర్వే నం.927, ఇతర సర్వే నంబర్లలోని భూములు సాగుచేసుకొని జీవిస్తున్న రైతులకు ఆ భూముల పట్టాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో ఖాస్తులో ఉండి సాగు చేసుకొని జీవిస్తున్న రైతుల భూములకు పట్టాలు ఇచ్చి భూ సమస్యలు పరిష్కారం చేసి రైతులకు న్యాయం చేయాలని గురువారం హైదారాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రేకొండ రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రేకొండలో కొంత మంది రైతులు మరియు వారి కుటుంబాలు సుమారు 60 సంవత్సరాలుగా ఈ భూములను స్వాధీనంలో ఉంచుకొని వినియోగించుకుంటున్నారని,ఈ సుదీర్ఘ కాలంలో వారు తమ శ్రమతో భూములను చదును చేసి, అభివృద్ధి చేసి, సాగుకు అనుకూలంగా మార్చుకొని, వివిధ పంటలను సాగు చేస్తూ వచ్చే ఆదాయమే వారి కుటుంబాల జీవనోపాధికి ప్రధాన ఆధారంగా ఉందని, ఈ భూములు కేవలం ఆస్తి మాత్రమే కాకుండా, అనేక కుటుంబాల జీవనాధారంగా మారాయనీ, తరతరాలుగా వారి కుటుంబాలు ఈ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని మంత్రికి వివరించారు. గతేడాది రెవెన్యూ అధికారుల నివేదికలో మొత్తం 103.03 ఎకరాల భూమి లబ్ధిదారుల అనుభవంలో ఉన్నట్లు తేల్చారని,నివేదికలో సంబంధిత లబ్ధిదారుల ప్రస్తుత స్వాధీనం,అనుభవానికి సంబంధించిన వివరాలు కూడా నమోదు కాబడ్డాయని అన్నారు. ప్రత్యేకంగా సర్వే నం.927లో కాలువ నిర్మాణానికి 2.09 ఎకరాల భూమి సేకరణకు నోటిఫై చేయబడినట్లు, కాలువ భాగాన్ని మినహాయించిన అనంతరం 2.04 ఎకరాల భూమి స్వాధీనంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. అదేవిధంగా 2.09 ఎకరాల భూమికి సంబంధించి అవార్డు జారీ లేదా పరిహారం చెల్లింపుకు రికార్డు లేదని అధికారులు తెలిపారన్నారు. భూముల కేటాయింపు, అసైన్‌మెంట్ ప్రక్రియను తుది నిర్ణయానికి తీసుకువెళ్లే ముందు,ప్రస్తుత రైతుల దీర్ఘకాలిక స్వాధీనం, సాగు, భూముల అభివృద్ధి, వారి కుటుంబాల జీవనాధారంపై ఆధారపడటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, చట్టాలు, నిబంధనలు మరియు అర్హతా ప్రమాణాలకు లోబడి, నిజమైన ప్రస్తుత సాగుదారులకు సాగుకు అనుకూలమైన భూమిని కేటాయించే,అసైన్ చేయాలని, నామమాత్రమైన మరియు సహేతుకమైన ధరపై భూమిని కేటాయించాలని, సర్వే నం.927కు సంబంధించి కాలువ కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ, కాలువ ఆక్రమించిన వాస్తవ విస్తీర్ణం, అవార్డు జారీ, పరిహారం చెల్లింపు రికార్డులు మరియు మిగిలిన సాగుభూమి విస్తీర్ణాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు. ప్రస్తుత సీలింగ్ కేసులను కూడా పునఃపరిశీలించి, అవసరమైతే సంబంధిత డిక్లరెంట్‌కు సంబంధించిన సీలింగ్ కేసును తిరిగి తెరిచి, డిక్లరెంట్ యొక్క వాస్తవ మిగులు భూమి ఎంత ఉందో నిర్ణయించాలని, సీలింగ్ డిక్లరేషన్ దాఖలు చేయడానికి ముందే డిక్లరెంట్ మరియు వారి కుటుంబ సభ్యులు కోర్టు డిక్రీలు, రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజులు, సదాబైనామాలు మరియు ఇతర చట్టబద్ధమైన లావాదేవీల ద్వారా విక్రయించిన లేదా బదలాయించిన భూములను, పొరపాటున సీలింగ్ డిక్లరేషన్‌లో చేర్చినట్లయితే, వాటిని పరిశీలించి, చట్టపరంగా విక్రయించబడిన లేదా బదలాయించబడిన భూములను మినహాయించి, డిక్లరెంట్‌కు వాస్తవంగా ఉన్న మిగులు భూమిని తిరిగి నిర్ణయించాలని,దీర్ఘకాలంగా సాగు చేసుకొని జీవిస్తున్న రైతులకు ఆ భూములను నామమాత్రపు రేటుకు కేటాయించి,అసైన్ చేసే విధంగా తగిన ఆదేశాలు జారీ చేసి, వారికి పట్టాలు ఇచ్చేందుకు సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని చాడ వెంకట్‌రెడ్డి మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రైతులు చాడ శ్రీధర్‌రెడ్డి, పరిపాటి వెంకటరెడ్డి, బావు రవీందర్, సుధాకర్, రాగులు సంపత్ రెడ్డి, మిరియాల కనకా రెడ్డి, చాడ సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం




### పారదర్శకంగా ఇండ్ల ఎంపిక ప్రక్రియ

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతన్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల పరిధిలో ఇండ్లులేని నిరుపేదలకు లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించే ప్రక్రియ గురువారం పాల్వంచ, కొత్తగూడెంలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై కూనంనేని మాట్లాడుతూ జి2 నిర్మాణ విధానంలో గతంలో కొందరిని లాటరీ పద్ధతిలో ఎంపిక జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు అర్హులైన వారందరికీ పారదర్శకంగా ప్రజా స్వామ్య పద్ధతిలో లాటరీతీసి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ లాటరీ విధానంలో సామాజిక న్యాయానికి పెద్ద పీఠ వేశామని, మరికొన్ని ఓపెన్ కేటగిరీలో లబ్దిదారులకు అందించామన్నారు. గూడులేని నిరుపేదల కుటుంబాల వారికి అండగా నిలవడమే బాధ్యతగా పనిచేస్తున్నామని, లాటరీలో ఇండ్లు రానివారికి ఇందరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యుటి మేయర్ సిరిపురపు లలితకుమారి ప్రజా ప్రతినిధులు వీరబాబు, కొత్వాల శ్రీనివాస్‌రావు, మండే వీరహన్మంతరావు కమీషనర్ సుజాత, డిప్యుటీ కమీషనర్ విజాయనంద్, తహసీల్దార్ ప్రసాద్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ హక్కులకు పోరాటాలు




### ఎస్‌టియు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గన్నోజు ప్రసాద్

### ఎస్‌టియు 80 వసంతాల వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఉపాధ్యాయ హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టియు పోరాటాలు చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు గన్నోజు ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం వీరభవన్ ఆవరణలో ఎస్‌టియు 80 వసంతాల వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంంగా గన్నోజు ప్రసాద్, సిపిఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్ సారధి రెడ్డితో కలిసి మాట్లాడుతూ స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్‌టియు) 80 వసంతాల ఉత్సవా లు హైదరాబాద్‌లోని నాగోల్‌లోని శుభం గార్డెన్స్ లో ఈనెల 27 ఆదివారం జరగనున్నాయని తెలిపారు. వసంతాల ఉత్సవాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం 80 ఏళ్లుగా ఎస్‌టియు తన వంతు పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా నాయకులు నీలం వెంకటేశ్వర్లు, సంకపల్లి శ్రీనివాసరెడ్డి, గుర్రపు సత్యనారాయణ, శ్రీనివాస వర్మ, పాండురంగ చారి, కేదాస్ రమేష్, అజ్మీర వేణు, తండా సందీప్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు కాదు..ఉచిత విద్య అందించాలి

### సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రభుత్వాలు ఉచిత పథకాలకే పరిమితం కాకుండా విద్యార్థుల భవిష్యతును దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన ఎఐఎస్‌ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి సయ్యద్ జలాలుద్దీన్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు విద్యను వ్యాపారంగా మార్చకుండా, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో కాషాయాకరణ ప్రోత్సహించే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక పీజుల వసూళ్లను నియంత్రించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం మరింత ఐక్యంగా ఉద్యమించాలని ఎఐఎస్‌ఎఫ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నవంబర్ 16,17 తేదీల్లో సంగారెడ్డి పట్టణంలో జరిగే ఎఐఎస్‌ఎఫ్ సంగారెడ్డికి జిల్లా మహాసభలు విజయవంతం చేసేందుకు ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు అనంద్, రెహమాన్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తురెడ్డి, విద్యార్థి నాయకులు అశోక్, ప్రశాంత్, అజమ్, నర్సింలు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.




# ‘సర్’ ప్రక్రియతో ఓటు హక్కు కోల్పోకుండా చూడాలి

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** సర్ ప్రక్రియ కారణంగా గతంలో ఉన్న ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజలు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొందని, తమ ఓటు జాబితా నుంచి తొలగిపోతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి బూత్‌స్థాయి అధికారులు తగిన సూచనలు, మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతూ గురువారం సిపిఐ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 2.50లక్షల మంది ప్రజలు సర్ ప్రక్రియ కారణంగా గతంలో ఉన్న ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఏళ్లుగా ఓటు వేస్తున్న పౌరులను పాత రికార్డులు, మ్యాపింగ్ వివరాలు, ఇతర పత్రాల పేరుతో వివరణలు కోరడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లు, చిరునామా మారినవారి వివరాలు వంటి అంశాలను సరిచేయడం వంటి ప్రక్రియలో నిజమైన ఓటర్లు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, రాములు, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబులు తదితరులు పాల్గొన్నారు.



## దేవరకొండ ఖిల్లాకు మహర్దశ...

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ఖిల్లా, ఖిల్లా గుట్టను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్ అన్నారు. గురువారం ఖిల్లా అభివృద్ధికి ఇప్పటికే రూ. 75లక్షలు మంజూరు అయ్యాయని, ఖిల్లా గుట్ట సమగ్ర అభివృద్ధి కోసం సుమారు రూ. 5కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును దేవరకొండకు తీసుకువచ్చి రూ. 5కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించనున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్గొండ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ మున్సిపల్(ఖిల్లా)పార్క్‌లో నిర్వహించిన యువ టూరిజం క్లబ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంఎల్ఏ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడారు. దేవరకొండ ప్రాంతానికి చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పరంగా ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసి బస్సులపై దేవరకొండ ఖిల్లా, పూర్ణకుంభం గుర్తులు కనిపించేవని, దేవరకొండ ఖిల్లా ఈ ప్రాంతానికి చారిత్రక ప్రతీకగా నిలించిందని, దాని వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులతో పాటు మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, నర్సింహా, వెంకటేష్‌గౌడ్, రైస్, సురేష్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, హరికృష్ణ, సాయిచంద్రగౌడ్, విద్యాశాఖ అధికారులు, యువ టూరిజం క్లబ్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్షానికి కొట్టుకుపోయిన తాత్కాలిక బ్రిడ్జి

తాళ్లమల్కాపురం - కీతవారిగూడెం మధ్య
స్తంభించిన రాకపోకలు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తుల ఆగ్రహం



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండలంలోని తాళ్ల మల్కాపురం గ్రామ శివారులో నూతన వంతెన నిర్మాణ ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి వంతెన (డైవర్షన్ రోడ్డు) వర్షపు వరద దాటికి కొట్టుకుపోయింది. దీంతో తాళ్లమల్కాపురం కీతవారిగూడెం గ్రామాల మధ్య ప్రధాన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ప్రవాహ ఉధృతిని తట్టుకోలేక తాత్కాలికంగా వేసిన పైపులు, మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో రహదారి తెగిపోయింది. దీంతో ఉదయం నుంచే రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంబించిపోయాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మండల కేంద్రానికి వెళ్లే ఉద్యోగులు, నిత్య ప్రయాణికులు అవతలి వైపు వెళ్లలేక తీవ్ర అవస్థలు పడ్డారు. అత్యవసర వైద్య సేవల కోసం రోగులను తరలించాలన్నా వాహనాలు వెళ్లే మార్గం లేకపోవడంతో సమీప గ్రామాల మీదుగా కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు.

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం...** వంతెన పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, నాసిరకం పనుల వల్లే ఈ దుస్థితి తలెత్తిందని గ్రామస్తులు మండిపడ్డారు. వర్షాకాలం సమీపించినా శాశ్వత వంతెన పనులను వేగవంతం చేయలేదని, తాత్కాలిక రహదారిని కూడా తూతూ మంత్రంగా వేసి వదిలేయడం వల్లే స్వల్ప వరదకే కొట్టుకు పోయిందని ఆరోపించారు. సంబంధిత ఆర్ అండ్ బి శాఖ ఉన్నతా ధికారులు వెంటనే స్పందించి, యుద్ధప్రాతిపదికన తాత్కాలిక రాకపోకలను పునరుద్ధరించాలని, అలాగే నత్తనడకన సాగుతున్న నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## సూర్యాపేట జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** అల్పపీడన ప్రభావంతో సూర్యాపేట జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుండి గురువారం వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. ఉదయం నుండి ఆకాశం అంతా మేఘావృతమై వర్షం కురిసింది. జిల్లాలోని కోదాడ, తుంగతుర్తి నియోజక వర్గాలు ఓ మోస్తారు భారీ వర్షాలు పడ్డాయి. ఎల్‌నినోతో గత నెల రోజుల నుండి ముఖం చాటేసిన వరుణుడు కాస్త కరుణించడంతో ఎండిపోయే దశకు వచ్చిన మెట్ట పంటలకు ఊపిరిపోసినట్లు అయింది. వేసవిని తలపించేలా ఎండ వేడిమితోపాటు తీవ్ర ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయిన జిల్లావాసులు గత రెండు రోజులుగా వాతావరణం చల్లబడి వర్షాలు పడుతుండడంతో ఉపశమనం కలిగింది. వాతావరణ శాస్త్రవేత్తలు అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిస్తాయని ముందుస్తు హెచ్చరికలు జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

### నీట మునిగిన స్నేహనగర్

భారీ వరదతో ఎదురెక్కి వచ్చిన చేపలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో సూర్యాపేట మున్సిపాలిటిలోని 14వ వార్డు స్నేహనగర్ కాలనీ నీట మునిగింది. ఎగువ ప్రాంతం నుండి వరద నీరు భారీగా కాలనీలోకి చేరడంతో సమీప చెరువులో ఉన్న చేపలు ఎదురెక్కి వచ్చాయి. దీంతో కాలనీవాసులు చేపలు పట్టుకునేందుకు ఎగబడ్డారు. ఇదిలాఉంటే రోడ్లపై భారీగా నీరు చేరడంతో కాలనీవాసులు ఇంట్లో నుండి బయటకు వెళ్లేందుకు తీవ్ర అవస్తలు పడ్డారు. స్థానిక కౌన్సిలర్ గాలి సాయి కుమార్ కాలనీవాసులు సమాచారం అందించడంతో అక్కడ పర్యటించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీవాసులు కోరడంతో మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్ళారు. వార్డు ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





# నిండుకుండలా మూసీ

వరద ఉధృతి పెరిగితే
గేట్లు ఎత్తే ఛాన్స్
ఆరు మండలాలు..
41 గ్రామాలకు హెచ్చరికలు జారీ
ప్రాజెక్టు దిగువ ప్రాంత
ప్రజలు అప్రమత్తంగా
ఉండాలని సూచనలు



**ప్రజాపక్షం/నకిరేకల్:** జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో రెండో అతిపెద్దదైన మూసీ రిజర్వాయర్ కు ఎగువ నుంచి వస్తున్న వరదతో నిండుకుండలా మారుతోంది. గత రెండు రోజులుగా ఎగువ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైన సమయంలో గేట్లు ఎత్తేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మూసీ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) 645 అడుగులు కాగా.. ప్రస్తుతం 640.58 అడుగులకు చేరింది. 4.46 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి గాను 3.35 టీఎంసీల నీరు ఉంది. గత 24 గంటల్లో 1,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**ఆరు మండలాలు.. 41 గ్రామాలు**

మూసీ గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి ఏర్పడితే దిగువ ప్రాంతాలపై ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.

**సూర్యాపేట జిల్లా:** సూర్యాపేట,పెన్‌పహాడ్, పాలకీడు మండలాల్లోని రత్నాపురం,రామవరం, హనుమాన్ తండా,వెంకట్రాంపూర్, నంద్యాలగూడెం, కొంకతిమ్మని అన్నారం,సర్కిలేపేట,కాసరాబాద్,అనాజిపురం, అనంతారం, దోసపహాడ్, సజ్జాపురం, గంటవారిగూడెం, ఎల్లారం,సోమవరం, చింతకుంట్ల, పులగం బండ తండా,మూసీ ఒడ్డు సింగారం,ఎల్లాపురం,శూన్యపహాడ్ గ్రామాలు.

**నల్లగొండ జిల్లా:** కేతేపల్లి,మాడుగులపల్లి,మిర్యాలగూడ మండలాల్లోని బొప్పారం,కాసనగోడు, చికటిగూడెం,కొత్తపేట,ఉప్పలపహాడ్,కొప్పోలు, భీమారం,ఆమనగల్,లక్ష్మీదేవిగూడెం,రావులపెంట,రాజాపేట,నర్సింహులగూడెం,తక్కెళ్లపాడు,కాల్వపల్లి,ఆళ్లగడప,రాయనిపాలెం, ములకల కాల్వ,కేశవాపురం,తుంటుకుంటవిల్ల,వాడపల్లి,వజీరాబాద్ గ్రామాలు.

**నదిలోకి వెళ్లొద్దు :** మూసీ పరివాహక,దిగువ ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లరాదని అధికారులు స్పష్టం చేశారు.నది పరిసరాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గేట్లు ఎత్తే సమయంలో అధికారులు చేసే సూచనలు, భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## ఎంజియులో మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపిన అంబులెన్స్ డ్రైవర్

విద్యార్థి కాలు విరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



**ప్రజాపక్షం/నల్లగొండ:** మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థి భద్రతపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది.యూనివర్సిటీలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి మద్యం మత్తులో ట్రాక్టర్ నడుపుతూ విద్యార్థిని ఢీకొట్టిన ఘటన కలకలం రేపింది.ఈ ప్రమాదంలో ఐఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి నితిన్ కుడి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు.వెంటనే అధికారులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గతంలో కూడా ఇదే ఉద్యోగి మద్యం మత్తులో యూనివర్సిటీకి వచ్చినందుకు యాజమాన్యం సస్పెండ్ చేసినట్లు విద్యార్థులు చెబుతున్నారు.తాజా ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు.విద్యార్థులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించే భద్రతా సిబ్బంది, వాహనాలు నడిపే ఉద్యోగులకు కూడా ఇదే తరహా పరీక్షలు నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.మద్యం సేవించి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని,ఈ ఘటనలో సెక్యూరిటీ ఆఫీసర్ నిర్లక్ష్యం ఉందని, ఆయనను కూడా విధుల నుంచి తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పలువురు విద్యార్థి సంఘాల నాయకులు,రాజకీయ నాయకులు ఆసుపత్రికి వెళ్లి నితిన్‌ను పరామర్శించి, ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**ఉద్యోగులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలి**

విద్యార్థుల భద్రత విషయంలో యూనివర్సిటీ యాజమాన్యం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్,బిఆర్ఎస్ నల్లగొండ టౌన్ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.యూనివర్సిటీలో విద్యార్థులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తున్న విధంగానే యూనివర్సిటీ ఉద్యోగులు, ముఖ్యంగా వాహనాలు నడిపే డ్రైవర్లకు కూడా అవసరమైన సమయంలో బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలని కోరారు.

**గాయపడిన విద్యార్థి వైద్య ఖర్చులను యూనివర్సిటీ భరించాలి**

ఎంజియూలో విద్యార్థుల భద్రతపై యూనివర్సిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు.యూనివర్సిటీలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి మద్యం మత్తులో ట్రాక్టర్ నడుపుతూ విద్యార్థిని ఢీకొట్టిన ఘటనపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఘటనపై యూనివర్సిటీ అధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని,బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నితిన్‌ను పరామర్శించిన వారిలోఎంజీయూ బిఆర్ఎస్‌వి అధ్యక్షుడు వాడపల్లి నవీన్,జిల్లా నాయకులు పల్లి శివశంకర్ యాదవ్,పల్లె రంజిత్ కుమార్, అంబటి ప్రణీత్ తదితరులు ఉన్నారు.



## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మహిళా సంఘాలకు రూ.8.29లక్షల వడ్డీలేని రుణాల
చెక్కుల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/గుండాల :** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం గుండాల మండల కేంద్రంలోని స్థానిక హైమావతి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య మండలంలోని 92 మహిళా సంఘాలకు రూ. 8.29 కోట్ల వడ్డీలేని రుణాలను పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ముందుగా గుండాల మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ షాపును ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసి, మహిళా సంఘాల సభ్యులు క్రమశిక్షణతో పొదుపు చేయడం, తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం వల్లే బ్యాంకులు పెద్ద మొత్తంలో రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరిగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దశరథగుప్త, సర్పంచ్ ఐలయ్య, మహేష్, ఉప సర్పంచ్ రమేష్, మండ సమైఖ్య అధ్యక్షురాలు వాణి, రివిజినల్ మేనేజర్ అనిల్‌కుమార్, ఎస్బిఐ మండల మేనేజర్ శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులను గౌరవించి కంటికి రెప్పలా కాపాడుకుందాం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమాజానికి, కుటుంబానికి మార్గదర్శకులైన వయోవృద్ధులను గౌరవించి, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారం రోజులపాటు నిర్వహించే వయోవృద్ధుల వారోత్సవాల గోడపత్రికను గురువారం కలెక్టరేట్‌లోని విసి ఛాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా, ఇంట్లోనే ఉంచుకొని ప్రేమగా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు హితవు పలికారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకుండా నిర్లక్ష్యం చేసే పిల్లల స్థూల వేతనం నుంచి నేరుగా 15 శాతం లేదా గరిష్టంగా రూ.10వేల వరకు కట్ చేసి, తల్లిదండ్రుల ఖాతాకు జమ చేసేలా కఠిన నిబంధనలు ఉన్నాయని స్పష్టం చేశారు. వృద్ధుల హక్కులు, చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సీనియర్ సిటిజన్లకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కేటాయించిన ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 14567 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా కమిటి సభ్యులు సీతారామయ్య, జి. విద్యాసాగర్, ఎస్‌డి హమీద్‌ఖాన్ పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు, విద్యుత్ అందివ్వడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో, రెండు పంటలకు అవసరమైన సాగునీటిని విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. గురువారం దామరచర్ల మండల పరిధిలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల నుంచి రైతులు, బిఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ధర్నా అనంతరం ప్లాంట్ లోపలికి వెళ్లేందుకు నిరసనకారులు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. భారీగా మోహరించిన పోలీసు బలగాలు బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారులను నిలువరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అనంతరం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్లాంట్ లోపలికి వెళ్ళి సీఈతో మాట్లాడి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పంటలు ఎండిపోకుండా రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా చేయడంతో పాటు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ రైతులకు సరిపడా కరెంట్ అందించడం లేదని విమర్శించారు. గత కేసీఆర్ హయాంలో స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగాలను ఆంధ్ర ప్రాంత వ్యక్తులకు అమ్ముకుంటోందని ఆరోపించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే, ఈ ప్రభుత్వం బొగ్గు సరఫరా చేయకుండా అమ్ముకుంటూ ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తోందని విమర్శించారు. సాగు సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు రెండు పంటలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జిల్లా అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ నాయక్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిషోర్, ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, తిప్పన విజయసింహా రెడ్డి, రాష్ట్ర నాయకులు రఘు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులకు ఎటిఎంగా మారిన యాదాద్రి పవర్ ప్లాంట్

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ధ్వజం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో బినామీ కాంట్రాక్టులు, కమిషన్ల పేరుతో కోట్ల రూపాయల భారీ అవినీతి చోటుచేసుకుందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణం వద్ద కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన అత్యంత భారీ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ నాయకులు నిర్వహించిన మీడియా సమావేశానికి ఆయన ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేటీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారితే, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావులకు ఏటీఎంగా మారిందని మండిపడ్డారు.బొగ్గు నిల్వలు ఏమాత్రం అందుబాటులో లేని ప్రాంతంలో కేవలం కమిషన్ల కోసమే పవర్ ప్లాంట్‌ను నిలబెట్టారని, దూర ప్రాంతాల నుంచి బొగ్గును రవాణా చేయడం వల్ల ప్లాంట్‌పై తీవ్రమైన అదనపు ఆర్థిక భారం పడుతోందని వివరంగా వెల్లడించారు. అభివృద్ధి పేరు చెప్పి పార్టీ ఫిరాయింపులకు పాల్పడి, ప్రాజెక్టుల నిర్మాణంలో వందల కోట్ల రూపాయల కమిషన్లు దండుకున్నారని విమర్శించారు. ప్లాంట్ కోసం భూములు ఇచ్చి సర్వస్వం త్యాగం చేసిన స్థానిక భూనిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశారని, అర్హులైన పేదలను పక్కనపెట్టి బిఆర్ఎస్ నాయకుల కుటుంబ సభ్యులకు, అనుచరులకు ఉద్యోగాలు ఇప్పించుకున్నారని ఆరోపించారు. గతంలో ఇంతటి భారీ అవినీతికి పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని పవర్ ప్లాంట్ సందర్శనకు వచ్చారో ప్రజలకు జవాబు చెప్పాలని నిలదీశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నాలుగు యూనిట్లను త్వరగా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఐదో యూనిట్‌ను కూడా ప్రారంభించే దిశగా పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, భూనిర్వాసితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం ఇంచార్జి కలెక్టర్ ఛాంబర్‌లో ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూమ్ (2BHK) ఇండ్ల నిర్మాణ ప్రగతిపై జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు, సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి, లబ్ధిదారుల ఎంపిక, మంజూరులు, నిధుల విడుదల తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అర్హులైన గుడిసెదారులందరినీ గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. ఇండ్ల మంజూరు, నిధుల విడుదలలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు L3 స్థాయి నుంచి L1 స్థాయికి సడలింపు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనివల్ల అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రయోజనాలు వేగంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ అలివేలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక కట్టడాల పరిశీలన




**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రాచీన సామ్రాజ్య రాజధానియైన ఇంద్రపాల నగరాన్ని సందర్శించారు.క్రీస్తు శకం నాలుగవ శతాబ్ది కాలంలో ఎంతో వైభవంగా వెలుగొందిన ఇంద్రపాలనగర ప్రాంతం గత వైభవాన్ని ఒకసారి నెమరు వేసుకొని అప్పటి చారిత్రక కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త,తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలోనే కాక భారతదేశ వ్యాప్తంగా ఉన్న అనేక చారిత్రక కట్టడాలను, సుప్రసిద్ధ ప్రదేశాలను విద్యార్థులు సందర్శించడమే కాకుండా వాటి పట్ల అవగాహన పెంపొందించుకొని,గత పాలకుల వైభవాన్ని,పరిపాలనా విధానాన్ని,ప్రజల సంస్కృతిని, భౌగోళిక స్థితిగతులను అధ్యయనం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు.యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.కిషన్ మాట్లాడుతూ చారిత్రక కట్టడాలను,సుప్రసిద్ధ ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసి భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటి పాలకులపై ఉందన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొప్పుల లక్ష్మి



**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** అల్లాదుర్గం మండల కేంద్రం పోచమ్మ గుడి నుండి జగిర్యాల ఎక్స్ రోడ్ పివి డబ్ల్యు వరకు రూ.7.20 కోట్లతో రోడ్డు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఆదేశానుసారం గురువారం వట్టిపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, కొప్పుల లక్ష్మి శేషారెడ్డి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణంతో గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌డి ఇ విల్సన్, ఎఇ రమేష్, సీనియర్ నాయకులు సుభాష్ రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నరసింహారెడ్డి, డిసిసి కార్యదర్శిలు బాలకిషన్, అంజా గౌడ్, మెదక్ జిల్లా ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షుడు బలరాం, సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, శశిధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, హరికృష్ణ, వీరన్న, శంకర్ నాయక్, నరసింహులు, శేఖర్, ప్రభు, భూమ్ రెడ్డి, బేతయ్య, జైపాల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ప్రదేశాల పరిశీలన



**ప్రజాపక్షం/ పటాన్‌చెరు :** పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు రామచంద్రాపురం ,రాయసముద్రం చెరువుల వద్ద గణేష్ నిమజ్జన ప్రదేశాలను సైబరాబాద్ సిపి రమేష్ రెడ్డి, పోలీసు అధికారులు, ఆయా విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలలో భాగంగా తీసుకోవాలసిన చర్యలు సిపి పోలీస్ అధికారులకు వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిపి రమేష్ రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం జరగనున్న వినాయక నిమజ్జన ప్రక్రియలో భాగంగా గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా గణనాథుల నిమజ్జనం చేసే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు పోలీసు అధికారులతో పాటు ఆయా శాఖల అధికారులకు సిబ్బందికి అదేశించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గట్టి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇదే విధంగా నిమజ్జన కార్యక్రమాలలో భాగంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గణేష్ నిమజ్జనంలో విషాదం

**ప్రజాపక్షం/వెల్దుర్తి:** మెదక్ జిల్లా మాసాయిపేట గ్రామం లో గణేష్ నిమజ్జనంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం రాత్రి నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవ శోభయాత్ర గురువారం తెల్లవారుజామున 3 గంటలకు నిమజ్జన స్థలమైన గంగమ్మ గుడి వద్ద హల్దీ బ్యాక్ వాటర్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మాసాయిపేటకు చెందిన కామిండ్ల గణేష్ (30) ప్రమాదవశాత్తు వంతెనపై గల రెయిలింగ్ నుంచి జారి బ్యాక్ వాటర్‌లో పడిపోయి మునిగిపోయారు. ఉదయం విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు చేరుకొని గాలింపులు చేపట్టగా గణేష్ ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం 6 గంటలకు గణేష్ మృతదేహం వెలికి తీశారు. ఈ గాలింపులో అగ్నిమాపక దళం పాల్గొన్నారు.

## రంగాయిపల్లిలో యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** ఇంటి కోసం తీసుకున్న లోన్ కట్టలేక,ఆర్థిక ఇబ్బందులు, మనస్తాపంతో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్న ఘటన మనోహరాబాద్ మండలంలోని రంగయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగయిపల్లికి చెందిన పెద్దబాల యాదగిరి, నాగవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి పెద్ద కుమారుడు హరిప్రసాద్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం కొత్త ఇల్లు నిర్మాణం కోసం కుటుంబ సభ్యులు లోన్ తీసుకున్నారు. అయితే, ఇటీవల జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో హరిప్రసాద్ కాలు విరిగింది. దీంతో అతను సరిగా పనికి వెళ్లలేకపోయాడు. ఆదాయం లేకపోవడంతో ఇంటి లోన్ ఇఎంఐ చెల్లించడం భారంగా మారింది.ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన హరిప్రసాద్, బుధవారం రాత్రి వినాయక నిమజ్జనానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. అనంతరం పొలం సమీపంలోని ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సుభాష్ గౌడ్ వెల్లడించారు.

## అనుమతుల్లేని డిజె వాహనం సీజ్



**ప్రజాపక్షం / జన్నారం :** అనుమతులు లేకుండా అధిక శబ్దంతో డిజె నిర్వహిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ తెలిపారు. మురిమడుగు గ్రామంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో బుధవారం నిబంధనలు ఉల్లంఘించి డిజె ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు డిజెల నిర్వహణపై ఆంక్షలు విధించినప్పటికీ, ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ప్రజల ప్రశాంతతకు విఘాతం కలిగించేలా వ్యవహరించినట్లు చెప్పారు. గ్రామానికి చెందిన ముల్కల్ల సంజీవ్ టాటా ఏసీ ట్రాలీలో డిజె సిస్టం ఏర్పాటు చేసి అధిక శబ్దంతో ప్రచారం చేస్తుండటంతో వాహనాన్ని పరికరాలతో సహా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

## 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని 27వ తేదీన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు ,అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## విద్యార్థుల సౌకర్యార్థం సంక్షేమ వసతి గృహం

### మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి




**ప్రజాపక్షం / జైపూర్ :** విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం షెడ్యూల్డ్ కులాల సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మండల కేంద్రంలో రూ.1.81 కోట్ల సిఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న ఎస్‌సి వసతి గృహ భవన నిర్మాణానికి గురువారం ఆయన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిసిపి ఎ. భాస్కర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమనపల్లిలో రూ.200 కోట్లతో 2,500 మంది విద్యార్థుల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తున్నామని తెలిపారు. చెన్నూర్ డిగ్రీ కళాశాలలో రూ.2 కోట్లు, జూనియర్ కళాశాలలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కోసం ఆర్‌కె ఒసిలో నూతన గని ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ద్వారా జర్మన్ భాష నేర్పించి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి, గోదావరి పుష్కరాల కోసం రూ.70 కోట్లతో ఘాట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. అంతకుముందు మండల కేంద్రంలోని కస్తూర్బాని సందర్శించి విద్యార్థినులకు బ్యాగులు, బూట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి అభివృద్ధి శాఖ డిడి చాతరాజుల దుర్గాప్రసాద్, తహసిల్దార్ వనజారెడ్డి, ఎంపిడిఒ శ్రీపతి బాపురావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డిసెంబర్ రెడ్డి, చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తివారి, నాయకులు రఘునాథ్, రవీందర్ రెడ్డి, సంపత్ రెడ్డి, జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో 'వనం మనం'



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పర్యావరణ పరిరక్షణ అందరి లక్ష్యం కావాలని, పర్యావరణానికి విఘాతం కలిగించకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ స్టేట్ కన్వీనర్ నవీన్ అన్నారు. గురువారం స్తానిక వినాయక్ నగర్ లోని టైం స్కూల్ లో పిల్లలచే చెట్లు నాటే కార్యక్రమం 'వనం మనం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు వాతావరణం, సమశీతోష్ణస్థితిని కల్పించడంతో పాటు జీవకారుణ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ స్టేట్ కో ఆర్డినేటర్ గురుచరణం, అడిషనల్ సెక్రెటరీ భాస్కర్ రాజు, జాయింట్ సెక్రెటరీ సాయి బాబా, నిజామాబాద్ జోనల్ ప్రెసిడెంట్ సతీష్, సభ్యులు పోతన్న, పాఠశాల అధ్యాపక బృందం, బాల బాలికలు పాల్గొన్నారు.

## రెండురోజులు మద్యం షాపులు బంద్

### పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** గణేష్ నిమజ్జనం నేపథ్యంలో శాంతి బద్రతల దృష్ట్యా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోగల ప్రజలందరికి తెలియజేయునది సెక్షన్ 20 (1) తెలంగాణ ఎక్సైజ్ యాక్టు 1968 ప్రకారంగా గణేస్ నిమజ్జనం నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలో గల కల్లు దుకాణాలు, డిపోలు, ఐఎంఎల్ షాప్స్ / 2బి బార్స్ / క్లబ్బులు / టిడి 1 మరియు టిఎస్‌బిసిఎల్ మొదలగునవి శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి ఆదివారం ఉదయం 6 గంటల వరకు (25 సాయంత్రం 6 గంటల నుండి 27 ఉదయం 6 గంటల వరకు) మూసి వేయబడును అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు.

## నిమజ్జన ఏర్పాట్లపై ఎస్‌పి పర్యవేక్షణ

**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి నితికా పంత్ ఆదేశించారు. కాగజ్‌నగర్ పెద్దవాగు, ఆసిఫాబాద్ పెద్దవాగు వద్ద చేపట్టిన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను వర్షంలోనూ గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు పాటిస్తూ వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. జిల్లాలో నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, ప్రజల భద్రతకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ పరిశీలనలో కాగజ్‌నగర్ డిఎస్‌పి వహీదుద్దీన్, రూరల్ సిఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

### బాధితులకు సకాలంలో పరిహారం అందేలా చర్యలు

### రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య



**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు న్యాయం జరిగేలా రెవెన్యూ పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ కలిసి పోలీసు ,రెవెన్యూ ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి సంక్షేమ శాఖలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలు ఇతర అణగారిన వర్గాల ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అదికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ కేసులు, రోస్టర్ పాయింట్లు అమలు, బ్యాగ్ లాగ్ ఖాళీలు ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. అట్రాసిటీ కేసుల్లో బాదితులకు త్వరతగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపాలని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి లకు సంబందించిన కేసుల పరిష్కారంపై కలెక్టర్, ఎస్‌పిలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. సిద్దిపేటలో మొబైల్ కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ కు సూచించారు. ఔట్‌సోరింగ్ ఏజెన్సీలలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు వారి కోటా మేరకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల హక్కుల ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారికి విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమాలకు అధికారులు ప్రజలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ లబ్దిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమలులో అధికారులు జాప్యం నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ భూసేకరణలో ఆసైన్డ్ భూములు, కోల్పోయిన ఎస్‌సి, ఎస్‌టిలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా పరిధిలో పరిష్కరించగలిగిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని కమిషన్ చైర్మన్ సూచనలు , సలహాలు అమలుచేస్తామని తెలిపారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల్లో 109 మంది బాదితులకు జనవరి 2026 నుంచి ఆగస్టు 31 వరకు రూ. 1.70కోట్ల పరిహారం అందించామని తెలిపారు. ఎస్‌పి పరితోష్ ఫంకజ్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత సమయంలోపు చార్జీషీట్లు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్‌సి, ఎస్‌టి నుంచి వివిధ సమస్యలపై రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య వినతులను స్వీకరించారు. ఈ సమీక్షసమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అదికారి అఖిలేష్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అదికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు ,ఆర్డీఓలు మున్సిపల్ కమిషనర్లు దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

### ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

### కుంటాలలో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ



**ప్రజాపక్షం /కుంటాల :** హక్కుల సాధనకు వీరనారి చాకలి ఐలమ్మను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన తెలంగాణ వీర నారి(చిట్యాల)చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తన భూమిని రక్షించుకునేందుకు రజాకార్లు, జమీందార్లతో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని చెప్పారు. ఆమె ఆశయాలను కేవలం స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వాటిని ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అసెంబ్లీ సమావేశాల్లో బలంగా ప్రస్తావించి ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల గొంతుకగా తన గళాన్ని వినిపిస్తానని స్వామి ఇచ్చారు. ఐలమ్మ ఆశయాలు పోరాట స్ఫూర్తి భావితరాలకు అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, తహసీల్దార్ కమల్ సింగ్, విగ్రహ కమిటీ అధ్యక్షుడు దేవేంధర్, సర్పంచ్ జక్కుల గజేందర్, ఫ్యాక్స్ చైర్మన్ సట్ల గజ్జరాం, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లు అశోక్, లోలం శ్యాంసుందర్, డిసిసిబి డైరెక్టర్ వెంకటేష్, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్,ఐకెఆర్ ( పిఎ)నాలం శ్రీనివాస్, పడకంటి దత్త్రాద్రి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు విశ్రాంత ఉపాధ్యాయులు రమేష్ గౌడ్, రజక సంఘం కులస్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి కోసం ఉచితశిక్షణ



**ప్రజాపక్షం/బోథ్ :** వర్టిస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ ప్రాజెక్ట్ సాక్షంతో సౌజన్యంతో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న 45 రోజుల ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా కోర్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై, శిక్షణను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువత సొంత కాళ్లపై నిలబడేలా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, వర్టిస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్‌లు కలిసి ఉచిత శిక్షణ అందించడం చాలా అభినందనీయమని కొనియాడారు. 45 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణ కాలంలో అభ్యర్థులకు ప్రాక్టికల్ విద్యకోసం ల్యాప్‌టాప్‌లు, ఉచితంగా యూనిఫామ్, స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేస్తున్నారని తెలిపారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను అందజేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రతినిధులు, వర్టిస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాతా శిశు సంరక్షణకు పెద్దపీట

### మృతుల కుటుంబాలకు పరిహారం

### కలెక్టర్ రాజర్షిషా



**ప్రజాపక్షం/మావల:** రిమ్స్ ఆసుపత్రి నవజాత శిశువుల వార్డు అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మృతి చెందిన ఐదుగురు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా వెల్లడించారు. గురువారం ఆయన చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు మరిపెల్లి చందన, ప్రేమలత అగర్వాల్‌లతో కలిసి రిమ్స్‌లోని క్రిటికల్ కేర్ వార్డు, పీడియాట్రిక్స్ విభాగాలను సందర్శించి భద్రతా ప్రమాణాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను పటిష్టం చేస్తున్నామన్నారు. మాతా శిశు సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ 34 ప్రత్యేక బెడ్లు, ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయాలతో అత్యాధునిక వార్డును అందుబాటులోకి తెచ్చామన్నారు. మెరుగైన వైద్యం కోసం ఏడుగురు చిన్నారులను హైదరాబాద్‌కు తరలించినట్లు చెప్పారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు బాధిత కుటుంబాలను పరామర్శించి ఘటనపై విచారణకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డిడబ్ల్యుఒ మిల్కా డిసిపిఒ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చర్యలు

### కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత పేర్కొన్నారు. సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ సహకారంతో పునరుద్ధరించిన మండలంలోని లైంగుడ పంచాయతీ పరిధి మారేపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సుమారు రూ.2.20 లక్షల వ్యయంతో పాఠశాల పునరుద్ధరణ పనులకు సహకారం అందించిందని తెలిపారు. దీని ద్వారా విద్యార్థులకు మెరుగైన, ఆహ్లాదకరమైన అభ్యసన వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మౌలిక వసతుల కల్పనలో దాతలు, ప్రజలు భాగస్వాములు కావడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఎంపిడిఒ ఉజ్వల్ కుమార్, సంస్థ వ్యవస్థాపకుడు పి.రామ్ కుమార్, ఎంఇఒ, ఎపిఒ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు సదుపాయాలు కల్పించాలి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** గోదావరి పుష్కరాలకు బాసరకు వచ్చే భక్తులందరికీ అన్ని సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ బాసరలో పుష్కరాల పనులను సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.భక్తుల పార్కింగ్, విఐపి, వివిఐపిల పార్కింగ్,హెలిప్యాడ్ నిర్మించనున్న ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల రాకపోకల సామర్థ్యానికి అనుగుణంగా పార్కింగ్ స్థలాలను ఆయా మార్గాలవారీగా ఏర్పాటు చేయాలన్నారు. ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. భక్తుల అవసరాల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.సంబంధిత అధికారులు అంతా పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పనులన్నీ నాణ్యవంతంగా ఉండాలని చెప్పారు.అనంతరం నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు.ఈ పరిశీలనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఈఈ ఆర్ అండ్ బి సుభాష్,తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సారూ.. ఈ దారిని జర పట్టించుకోండి!

### రాకపోకలకు నిత్యం ప్రమాదాల భయం



**ప్రజాపక్షం / రెబ్బెన :** కొమురవెల్లి నుంచి రేచినికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై రాకపోకలకు తీవ్ర అవరోధంగా మారింది. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఈ మార్గంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో పాటు కొంతమంది రైతులు వ్యవసాయ పనుల కోసం రోడ్డును తవ్వి పూడ్చకుండా వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. లోతు తెలియక వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తవ్వి వదిలేసిన ప్రదేశాల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం భయం గుప్పిట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. నీటి గుంతలను తప్పించబోయి కిందపడి గాయాలపాలవుతారేమోనని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో గుంతలు సరిగ్గా కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. చిన్నపాటి అజాగ్రత్త కూడా ప్రాణాలకే ముప్పుగా పరిణమిస్తోంది. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారి ఇంత అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. వ్యవసాయ పనుల కోసం రోడ్డును తవ్వేసి అలానే వదిలేసినా ఎవరిపైనా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగి నిండు ప్రాణం పోతేనే అధికారులు స్పందిస్తారా అని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజలు, విద్యార్థుల రాకపోకలకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ ఫెస్టివ్ ఎంటర్‌టైనర్ 'జనవరి 12 విడుదల' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి.

# రీల్



## 'దీపు' గా కృతి శెట్టి

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ ఫెస్టివ్ ఎంటర్‌టైనర్ 'జనవరి 12 విడుదల' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ఇంట్రెస్టింగ్ ట్యాగ్లైన్‌తో వస్తున్న ఈ చిత్ర టైటిల్‌ను మేకర్స్ ఇటీవల హిలేరియస్, ఎంటర్టైనింగ్ వీడియో ద్వారా ప్రకటించారు. దీంతో సినిమాపై బజ్ మరింత పెరిగింది.ఇప్పటికే వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్స్‌ను పరిచయం చేసిన మేకర్స్ కృతి శెట్టి 'దీపు' గా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కృతి శెట్టి ట్రెడిషనల్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. పర్పుల్‌పింక్ కలర్ హాఫ్ సారీలో అందంగా కనిపించారు. ఆమె ఆహ్లాదకరమైన చిరునవ్వు ఈ ఫస్ట్ లుక్కు మరింత చార్మ్, ఎలిగెన్స్‌ను తీసుకొచ్చింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్, ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌కు తోడు కీర్తి సురేష్, కృతి శెట్టి లాంటి స్టార్స్ ఉండటంతో ఈ చిత్రం ఫెస్టివల్ సీజన్‌లో ఫుల్ ఎంటర్ టైనింగ్‌గా ఉండబోతోంది.ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ చిత్రానికి సంగీతం: జివి ప్రకాష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ కృష్ణ, సినిమాటోగ్రాఫర్: సమీర్ రెడ్డి, ఎడిటర్: తమ్మిరాజు.

## 'లవ్ అండ్ వార్' ఫస్ట్ లుక్ రిలీజ్




సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ వంటి ముగ్గురు స్టార్ హీరోహీరోయిన్లు కలిసి నటిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.తాజాగా ఈ సినిమాకు సంబంధించిన రణ్బీర్ కపూర్ ఫస్ట్ లుక్ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రణ్బీర్ పూర్తిగా కొత్త లుక్లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. సంజయ్ లీలా భన్సాలీ సినిమాల్లో కనిపించే గ్రాండ్ విజువల్స్, రిచ్నెస్ ఈ పోస్టర్‌లోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. రణ్బీర్ ఇప్పటివరకు కనిపించని కొత్త అవతార్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్‌కు జత చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా విజువల్స్‌కు అద్భుతంగా సరిపోయింది. సంగీతం విషయంలో భన్సాలీ మార్క్ మరోసారి కనిపించింది.ఈ పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసిన మేకర్స్ వోహ్ రుత్బా, వోహ్ రౌబ్, వోహ్ జునూన్! అంటూ క్యాప్షన్ ఇచ్చారు. 'లవ్ అండ్ వార్' చిత్రం 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. రణ్బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ విడుదల చేయనున్నారు.

## దారి తప్పిన 'ది ప్యారడైజ్'

రివ్యూ



సవారీ జాతి కథ 'ది ప్యారడైజ్' అని చెప్పాడు బాగానే ఉంది కానీ ఈ సవారీ జాతి పోరాటం ఎప్పుడు జరిగింది ? ఏ కాలంలో జరిగింది ? అనేది మాత్రం మూడు గంటల సినిమాలో ఎక్కడా చెప్పలేదు . సవారీ జాతి వాళ్ళు ఏ ''గుర్తింపు'' (ఐడెంటిటీ) కోసమైతే ఏళ్ళ తరబడి పోరాటం చేస్తున్నారో ఆ 'గుర్తింపు' అప్పటి ఎమ్మెల్యే కేసీఆర్ నాయకత్వంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్వయంగా సవారీ జాతి వాళ్ళ దగ్గరికి వచ్చి గుర్తింపు ఇచ్చినట్టు చూపించాడు. కానీ ఇది ఏ కాలంలో జరిగింది అనేది మాత్రం సినిమాలో ఎక్కడా చెప్పలేదు. ఎన్టీఆర్ , కేసీఆర్ లను స్క్రీన్ మీద చూసి ఆశ్చర్యపోవలసి వచ్చింది. ఒక చరిత్ర గురించి కానీ లేదా ఒక జాతి గురించి కానీ చెప్పాలనుకున్నప్పుడు ఆ చరిత్ర ఎప్పుడు జరిగింది? ఏ కాలంలో జరిగింది అనేది ఖచ్చితంగా సినిమా ప్రారంభంలోనే చెప్పాలి. అప్పుడే ప్రేక్షకుడికి ఆ కథమీద ఆసక్తి ఉంటుంది. ఒక జాతి గుర్తింపు కోసం జరిగిన హోరాహోరీ పోరాటంలో చివరికి ఆ జాతి నాయకుడే గెలిచినపుడు ఆ జాతికి గుర్తింపు రాకుండా అడ్డుకున్న విలన్ ను ఖచ్చితంగా ఈ జాతి నాయుడు చంపెయ్యాలి. అప్పుడే కథకు న్యాయం జరుగుతుంది. సినిమా చూసిన ప్రేక్షకుడు శభాష్ అనుకుంటాడు. కానీ 'ది ప్యారడైజ్' సినిమాలో అలా జరగలేదు. తన తల్లి మొదలు పెట్టిన పోరాటం కొడుకు పూర్తి చేసినప్పుడు దుర్మార్గుడైన విలన్ ను ఖచ్చితంగా అంతం చేస్తేనే కథకు న్యాయం జరుగుతుంది.

### కథ

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో కలిసిన ఒక సంస్థాన్ 'ది ప్యారడైజ్'. ఈ ప్యారడైజ్ ప్రాంతాన్ని మాలిక్ (మోహన్ బాబు ) అనే అతను పాలిస్తుంటాడు. ఇక్కడ మాలిక్ చెప్పిందే వేదం. ఇదే ప్రాంతంలో బానిసలుగా నివసిస్తున్న 'సవారీ'జాతి దేశంలో 'గుర్తింపు' కోసం పోరాటం చేస్తోంది. సమ్మక్క (హీరో తల్లి) మొదలు పెట్టిన ఈ జాతి గుర్తింపు పోరాటం చివరికి కొడుకు (హీరో నాని) ఎలా ముగించాడు అనేది కథ. ఇందులో నాని పాత్ర పేరు కేవలం 'జడల్' అని మాత్రమే చూపిస్తాడు. క్లైమాక్స్‌లో ఈ 'జడల్' అసలు పేరు రివీల్ చేశాడు. చివరికి ఈ సవారీ జాతి వాళ్లకు గుర్తింపు ఎలా లభించింది? ఏం జరిగింది? హీరో నాని రెండు జడలు ఎందుకు వేసుకున్నాడు అనేదే తెలుసుకోవాలంటే ప్యారడైజ్ సినిమా చూడాలసిందే. ఇక్కడ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఎంచుకున్న కథ మంచిదే. కానీ ఈ కథను నడిపించిన విధానం బాగాలేదు. సినిమా చూస్తున్నంత సేపు కథను కాకుండా హింసను నమ్ముకున్నట్టు కనిపిస్తుంది. నరకడాలు, మనుషులను కోసేయ్యడాలు చాలా దారుణంగా చూపించారు. సినిమా మొత్తం వర్షం పడుతూనే ఉంటుంది ... కొన్ని సన్నివేశాల్లో తప్ప. సినిమా ప్రారంభంలోనే చనిపోయిన ప్రముఖుల ఫోటోలకు నివాళి అర్పించిన శ్రీకాంత్ ఓదెల ప్రజా యుద్ధ నౌక గద్దర్ పాడిన 'పొడుస్తున్న పొద్దుమీద' పాటను కొన్ని సెకండ్ల పాటు చూపిస్తాడు. కేసీఆర్ పాత్ర క్లైమాక్స్ లో వస్తుంది. ఈ పాత్రను ప్రియదర్శి (బలగం ఫేమ్ ) ప్రియదర్శి పోషించాడు. కేసీఆర్ పాత్రను తీర్చిదిద్దడం మాత్రం సూపర్ అని చెప్పవచ్చు. ''చావు నోట్లో తల పెట్టి వచ్చిన ' వంటి కేసీఆర్ డైలాగులు కూడా ఉన్నాయి. కేసీఆర్ పాత్రను అచ్చు గుద్దినట్టు మేకప్ చేసిన మేకప్ మెన్ కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. హీరోయిన్ కయాదు లోహార్ అందాలను అద్భుతంగా ప్రదర్శించింది. ఒక సి గ్రేడ్ హీరోయిన్ గా సూపర్ పర్ఫార్మెన్స్ చేసింది.కానీ హీరోయిన్ చేసిన ఒక పనిని ప్రేక్షకులందరూ ఛీ కొడుతున్నారు. 'ఆయా షేర్', 'ఏష నాగుల ' రెండు పాటలు కూడా బాగానే ఉన్నప్పటికీ ఈ రెండు పాటలు కూడా యూట్యూబ్ లో ఆల్ రెడీ జనాలు చూసేశారు కాబట్టి థియేటర్ లో పెద్దగా మీ అనిపించదు. అంతేకాదు విమలక్క పాడిన 'కొడుకా' అనే పాటను కూడా శ్రీకాంత్ ఇందులో పెట్టాడు. హీరోయిన్ కీర్తి సురేష్ కేవలం ఒక్క ఏష నాగుల పాట మీద తప్ప ఎక్కడా కనిపించదు. నిజానికి ఏష నాగుల పాటమీద డ్యాన్స్ కూడా పెద్దగా ఆసక్తికరంగా లేదు. అయితే ఇక్కడ కథలో భాగంగా ప్రముఖ విప్లవ గాయని విమలక్క పాడిన పాత పాట 'కొడుకా' అనే పాట పెట్టాడు దర్శకుడు. ఫస్టాఫ్ లో కొన్ని యాక్షన్ సన్నివేశాలు , సెకండ్ ఆఫ్ లో కొన్ని యాక్షన్ సన్నివేశాలను తగ్గించుకుంటే సినిమా బాగానే అనే ఉంటుంది. మాటల రచయితలు డైలాగులు చాలా బాగా రాశారు కానీ నాని చెప్పే డైలాగులు చాలా వరకు అర్థం కావడం లేదు.ఇక అనిరుద్ రీ రికార్డింగ్ ఏమి గొప్పగా లేదు. బ్లాక్ బస్టర్ అవుతుందనుకుని థియేటర్ కు వెళ్లిన ప్రేక్షకుడికి మాత్రం నిరాశే మిగులుతుంది.

## 'గ్లాడియేటర్స్ ఇన్ పర్స్యూట్ ఆఫ్ ఛాలెంజెస్' ట్రైలర్ విడుదల



ప్యాషన్, పట్టుదల, సవాళ్లను నిరంతరం ఎదుర్కొనే తపనతో సాగిన నటుడు, రేసింగ్ డ్రైవర్ అజిత్ కుమార్ అసాధారణ మోటార్‌స్పోర్ట్స్‌ను జర్నీని ఆవిష్కరించే డాక్యుమెంటరీ 'గ్లాడియేటర్స్ ఇన్ పర్స్యూట్ ఆఫ్ ఛాలెంజెస్' ట్రైలర్ విడుదలైంది. రేసర్ వెనుక ఉన్న అజిత్ కుమార్‌కు మరింత దగ్గరగా పరిచయం చేస్తూ ఈ ట్రైలర్ సాగుతుంది.ఇప్పటివరకు లేని విధంగా 'గ్లాడియేటర్స్' ట్రైలర్‌ను తొలిసారిగా నేరుగా థియేటర్లలో విడుదల చేశారు. డిజిటల్ రిలీజ్‌కు ముందే బిగ్ స్క్రీన్‌పై ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే మేకర్స్ నిర్ణయానికి థియేటర్లలో భారీ స్పందన లభించింది. తమ అభిమాన స్టార్‌ను స్క్రీన్‌పై చూసిన ప్రతిసారీ అభిమానులు సందడి చేశారు. అజిత్ కుమార్ అభిమానుల సందడి థియేటర్లలో మార్మోగింది. సినిమాల్లో ఎప్పుడూ చూసే తమ ఫేవరెట్ స్టార్‌ను పూర్తిగా భిన్నమైన అవతార్‌లో.. స్పీడ్, ఛాలెంజెస్‌పై తిరుగులేని ప్యాషన్‌తో రేసర్‌గా చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.విజయ్ దర్శకత్వం వహించిన 'గ్లాడియేటర్స్' కేవలం రేస్ట్రాక్ గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా.. మోటార్‌స్పోర్ట్స్‌ను అజిత్ కుమార్‌కు ఉన్న ప్యాషన్, ఆయన స్వీకరించిన సవాళ్లు, ఎదుర్కొన్న రిస్కులు, తన అవసరమైన డిసిప్లిన్‌ను ఆవిష్కరిస్తుంది. ట్రైలర్‌లో అత్యంత ఎమోషనల్ అంశాల్లో ఒకటి షాలిని అజిత్ కుమార్, వారి పిల్లలు అనౌష్క, ఆద్విక్ పంచుకున్న అభిప్రాయాలు. ఈ డాక్యుమెంటరీకి విజయ్ దర్శకత్వం వహించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గోల్డెన్ ట్రోఫీ ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై షాలిని అజిత్ కుమార్ నిర్మిస్తున్నారు.ఈ చిత్రం నవంబర్ 19న విడుదలకు సిద్ధం అవుతుంది.

## 'మత్స్య' గ్లింప్స్ రిలీజ్



హీరో వివస్వాన్ నటిస్తున్న అడ్వెంచర్ ఫిలిం 'మత్స్య'. ఈ చిత్రాన్ని జి.బి.ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సంహిత గణపతి ఇంటూరి నిర్మిస్తున్నారు. రవి గోలి, తేజ కనకాల దర్శకత్వం వహిస్తున్నారు. 'మత్స్య' సినిమా అఫీషియల్ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ టాప్ క్వాలిటీ విజువల్స్, వీఎఫ్ఎక్స్ తో ఒక కొత్త సినిమాటిక్ వరల్‌ను పరిచయం చేసింది.'అమ్మా కొత్త బెడ్ టైమ్ కథ చెప్పమ్మా..! అంటూ బాబు అమ్మను అడగగా, ఒక ఫిష్ కథ చెప్పనా అంటూ అమ్మ చెప్పే డైలాగ్ తో 'మత్స్య' గ్లింప్స్ మొదలవుతుంది. ఎన్నో వింతలు, అద్భుతాలు, ఒక ట్రావెలర్ ఉండే ఆ కథను అమ్మ చెబుతుంటే హీరో క్యారెక్టర్‌ను కలర్ ఫుల్ గా పరిచయం చేశారు. గ్లింప్స్ లో వివస్వాన్ స్టైలిష్ లుక్, అప్పీయరెన్స్, బాడీ లాంగ్వేజ్ తో ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రంతో ఒక ప్రామిసింగ్ యంగ్ హీరోగా వివస్వాన్ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఎక్స్‌పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. 'మత్స్య' చిత్రంలో ఫోక్ లోర్, అడ్వెంచర్ వంటి అంశాలను మేళవించి ఒక కొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నట్లు గ్లింప్స్‌తో తెలుస్తోంది. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా, ఎడిటర్ పి.ఎస్.రెడ్డి, డిఓపి సురేష్, మ్యూజిక్ ఉజ్వల్ గుప్తా, డైలాగ్స్ జే కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజీవనేత్ర.

---

### యమునా ఎక్స్‌ప్రెస్‌వే బస్సులో మంటలు...

# 9 మంది ప్రయాణికులు మృతి

20 మంది సురక్షితం




**నోయిడా:** ఢిల్లీ నుంచి ఉత్తర ప్రదేశ్‌లో మహోబాకు వెళ్తున్న బస్సులో యమునా ఎక్స్‌ప్రెస్ వేపై మంటలు చెలరేగడంతో తొమ్మిది మంది ప్రయాణికులు మృతి చెందారు. ఈ ఘటనలో మరో 20 మంది ప్రయాణికులను సురక్షితంగా రక్షించినట్లు అధికారులు గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, బిఆర్ 32 ఫిఎ 8647 రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న ఈ బస్సు న్యూఢిల్లీలోని కశ్మీరీ గేట్ నుంచి మహోబా వైపు వెళ్తుండగా, జేవర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎక్స్‌ప్రెస్‌వేపై 33వ కిలోమీటర్ మైలురాయి సమీపంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక సిబ్బంది, రెస్క్యూ టెండర్, జేవర్ టోల్ ప్లాజా వద్ద ఉన్న ఫైర్ టెండర్‌తో పాటు మరో నాలుగు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయని ప్రదీప్ కుమార్ తెలిపారు. సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సహాయక చర్యల్లో 20 మందికి పైగా ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. పొగలు కమ్ముకున్న బస్సులోకి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ప్రవేశించినప్పుడు తొమ్మిది మృతదేహాలు కనిపించాయి. మంటల్లో కాలిపోవడం లేదా ఊపిరాడకపోవడం వల్ల వారు మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. బస్సులోని ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలో మంటలు రేగడం లేదా పేలుడు సంభవించి ఉండవచ్చని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఆయన చెప్పారు. దాని కారణంగా ఇంజిన్‌లోని లూబ్రికెంట్ ఆయిల్‌కు మంటలు అంటుకుని, ఆ తర్వాత అగ్ని వేగంగా బస్సు అంతటా వ్యాపించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. మృతిచెందిన తొమ్మిది మంది ప్రయాణికుల గుర్తింపును నిర్ధారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు ప్రకటించారు. గాయపడిన వారికి సరైన వైద్యం అందేలా చూడాలని, మృతుల కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయాలు అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

### బెంగాల్ 'అధికార పీఠం' పైనే బిజెపి కన్ను...

# రూ.286.99 కోట్లు ఖర్చుతో వశం

కాంగ్రెస్ 4 రాష్ట్రాలు, యుటిలో చేసిన మొత్తం వ్యయం రూ.248.55 కోట్లే
'ఇసి'కి సమర్పించిన 'వ్యయ నివేదిక' వెల్లడి

**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బిజెపి అధిక మొత్తంలోనే తన ధనబలాన్ని ఉపయోగించి విజయం సాధించింది.ఈ ఏడాది ఆరంభంలో ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రా లు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో కాంగ్రెస్ ఖర్చుచేసిన మొత్తం రూ. 248.55 కోట్లు అయితే, కేవలం ఒక్క పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోనే బిజెపి రూ.286.99 కోట్లు ఖర్చు చేసిందని ఎన్నికల సంఘానికి సమర్పించిన వ్యయ నివేదికలో వెల్లడైంది. 5 ఎన్నికల కోసం బిజెపి చేసిన రూ.529. 38 కోట్ల ఖర్చులో సగానికి పైగా వాటా ఒక్క పశ్చిమబెంగాల్ రాష్ట్రం వాటానే ఉంది. మిగిలిన 4 ఎన్నికలు అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలలో జరిగాయి. బెంగాల్‌లో సాధారణ ప్రచారం కోసం పార్టీ రూ.217.16 కోట్లు , అభ్యర్థులపై రూ. 69.83 కోట్లు ఖర్చు చేసింది. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)ను గద్దెదించిన బిజెపి తొలిసారి గాఅధికారంలోకి వచ్చింది. ఫలితాలు వెలువడిన 293స్థానాలకు గాను, టిఎంసికి వచ్చిన 80స్థానాలతో పోలిస్తే, బిజెపి 207 స్థానాలను గెల్చుకుంది. పశ్చిమబెంగాల్‌లో నామమాత్రపు శక్తిగా ఉన్నప్పటికీ, 293 స్థానాలలో స్వతంత్రంగా పోటీచేసిన కాంగ్రెస్ రెండు స్థానాలను గెలుచుకుంది. తన కేంద్ర ప్రధాన కార్యాలయం, రాష్ట్ర విభాగం ద్వారా బెంగాల్‌లో రూ. 42.08 కోట్లు ఖర్చుచేసినట్లు ఆ పార్టీ నివేదించింది. ఇందులో సాధారణ ప్రచారానికి రూ.12.96కోట్లు, అభ్యర్థులు, సంబంధిత ఖర్చులకు రూ.29.12కోట్లు వెచ్చి ంచారు. 2011లో అధికారాన్ని కోల్పోవడానికి ముందు దశాబ్దాలపాటు బెంగాల్‌ను పాలించిన సిపిఐ(ఎం), 197స్థానాలలో పోటీచేసి ఒక స్థానాన్ని గెలుచుకుంది. అభ్యర్థులపై చేసిన ఖర్చుతో సహా, దాని రాష్ట్ర విభాగం రూ.8.23 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదించింది. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్ ఖర్చుల వివరాలు ఇంకా బహిరంగపర్చలేకపోయింది. పార్టీలు ప్రకటించిన వ్యయాల ఆధారంగా కేరళం రాష్ట్రంలో వైరుధ్యం కనిపిస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి, సిపిఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)ను పడగొట్టింది. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 63 సీట్లు, సిపిఐ(ఎం) 26 సీట్లు, బిజెపి మూడు సీట్లను గెలుచుకుంది. కాగా, బిజెపి ఖర్చుచేసిన రూ.82.67 కోట్లకంటే ఎక్కువగా, కాంగ్రెస్ తన ప్రధాన కార్యాలయం, రాష్ట్ర విభాగం ద్వారా కేరళం రాష్ట్రంలో రూ.105.34 కోట్లు ఖర్చుచేసింది. కాంగ్రెస్ పార్టీ తన ఖర్చులో రూ.71.30 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.34.05 కోట్లు అభ్యర్థులు, సంబంధిత ఖర్చులకు కేటాయించారు. కేరళంలో సాధారణ ప్రచారానికి రూ.54.93 కోట్లు, అభ్యర్థులపై రూ.27. 74 కోట్లు ఖర్చుచేసినట్లు బిజెపి తెలియజేసింది. కేరళంలో ఒక ప్రధానశక్తి అయిన సిపిఐ(ఎం) తన రాష్ట్ర విభాగం రూ. 28.60 కోట్లు ఖర్చుచేసినట్లు నివేదించింది. ఇందులో సాధారణ ప్రచారానికి రూ.26.30కోట్లు, అభ్యర్థులకు రూ.2.31 కోట్లు కేటాయించారు. 5ఎన్నికలలో కాంగ్రెస్ సాధారణ ప్రచారానికి రూ. 143 కోట్లు, అభ్యర్థులపై రూ. 105.55 కోట్లు ఖర్చుచేసినట్లు నివేదించింది. దీంతో,దాని మొత్తం వ్యయం రూ.248. 55 కోట్లకు చేరింది. సిపిఐ(యం) ఏకీకృత వ్యయం రూ. 39.04 కోట్లుగా ఉంది. బెంగాల్ , కేరళంలోని వ్యయంతో పాటు అస్సాం లో రూ.96.27 కోట్లు, తమిళనాడులో రూ. 51.56 కోట్లు, పుదుచ్చేరిలో రూ.11.90 కోట్లు ఖర్చుచేసినట్లు బిజెపి నివేదించింది. గతంలో దాఖలైన వివరాల ప్రకారం...ఎన్నికల కాలంలో బిజెపి కేంద్ర ప్రధానకార్యాలయానికి రూ. 1,472.8కోట్లు అందగా, కాంగ్రెస్ తన ప్రధాన కార్యాలయం,5 రాష్ట్ర యూనిట్ల నుంచి రూ.207. 17 కోట్లు వసూలైనట్లు నివేదించింది. ఎన్నికల ఫలితాలు ప్రకటించినప్పుడు రూ.6,72.6కోట్లుగా ఉన్న బిజెపి కేంద్ర కార్యాలయం బ్యాలెన్స్, ఎన్నికల కాలం ముగిసే నాటికి రూ.7,627.2కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో కాంగ్రెస్ ప్రధానకార్యాలయం, 5 రాష్ట్ర యూనిట్లలోని మొత్తం బ్యాలెన్స్ సుమా రు రూ.169.06 కోట్ల నుంచి రూ. 103.2 కోట్లకు పడిపోయింది.

# విస్తృతంగా వర్షాలు

### తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు ఐఎండి రెడ్ అలర్ట్

**న్యూఢిల్లీ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తూర్పు, దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కోస్తా ఆంధ్ర ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) గురువారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. తెలంగాణలో ఈనెల 24, 25 తేదీల్లో అత్యంత భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడి న వర్షాలు, బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండి తన తాజా ప్రకటనలో పేర్కొంది. ఈనెల 26న కూడా భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఒడిశాలో శుక్ర, శనివారాల్లో అత్యంత భారీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కూడా ఐఎండి తెలిపింది. కోస్తా ఆంధ్రలోనూ గురువారం అత్యంత భారీ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. బిహార్, జార్ఖండ్, కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ వర్షాలకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణమని, ఇది ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలను దాటి భూభాగంలోకి ప్రవేశించిందని ఐఎండి వివరించింది.

**రాష్ట్రంలో పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక**

**హైదరాబాద్ :** రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల పాటు వర్షాల తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వరకు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశముందన్నారు. ఈ సమయంలో అదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో కూడా ఉండే అవకాశం ఉందన్నారు. శనివారం నుంచి గురువారం వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు.

## సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. శోభాయాత్ర మార్గాల్లో విగ్రహాల నిమజ్జనం సజావుగా సాగడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. వీటి పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక నోడల్ ఆఫీసర్లను కూడా రంగంలోకి దించారు. నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఖైరతాబాద్ బడా గణేశ్, బాలాపూర్ గణేశ్ నిమజ్జనాలను మధ్యాహ్నంలోపే ముగించేలా వివిధ శాఖల అధికారులు పక్కా వ్యూహం రచించారు. చారిత్రాత్మక నిమజ్జన వేదికైన హుస్సేన్ సాగర్ చుట్టూ 40 భారీ క్రేన్లను అందుబాటులో ఉంచారు. ఎన్‌టిఆర్ మార్గ్ వైపు ఉన్న క్రేన్ నెంబర్ 6 వద్ద ఖైరతాబాద్ విగ్రహాన్ని మధ్యాహ్నం 12 గంటల కల్లా నిమజ్జనం చేసేలా ప్రణాళిక రూపొందించారు. గురువారం సాయంత్రం నుంచే దీనికి సంబంధించిన ఏర్పాట్లు విగ్రహాన్ని మధ్యాహ్నం 1 గంట కల్లా చార్మినార్ దాటించేలా చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఈ ప్రక్రియను నేరుగా పర్యవేక్షించనున్నారు. బాలాపూర్ గణపయ్యను అప్పర్ ట్యాంక్ బండ్ వద్ద నిమజ్జనం చేయనున్నారు. ఈ రెండు ప్రధాన విగ్రహాల నిమజ్జనం మధ్యాహ్నానికి పూర్తయితే నిమజ్జనోత్సవం సింహభాగం ముగిసినట్లేనని అధికారులు భావిస్తున్నారు. ఎంఎంసి పరిధిలో నిమజ్జనం పర్యావరణహితంగా, ప్రశాంతంగా జరిగేలా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎంఎంసి పరిధిలోని ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్.బి. నగర్ జోన్లలో మొత్తం 39 నిమజ్జన పాయింట్లను ఏర్పాటు చేశారు. వీటిలో 18 ప్రధాన చెరువులు, 7 కుంటలు/బేబీ పాండ్లు, 15 కృత్రిమ చెరువులు పోర్టబుల్ ట్యాంకులు ఉన్నాయి. సరూర్ నగర్, సఫిల్‌గూడ, శామీర్‌పేట్, ఎదులాబాద్ వంటి ప్రధాన చెరువులతో పాటు పార్కులు, మైదానాలు, మార్కెట్ యార్డుల్లో కృత్రిమ ట్యాంకులను అందుబాటులోకి తెచ్చారు. సిఎంసి పరిధిలోనూ నిమజ్జనోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. 16 సర్కిళ్ల పరిధిలో 53 నిమజ్జన పాయింట్లను ఏర్పాటు చేసి, 82 క్రేన్లను అందుబాటులో ఉంచారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లలో ఈ క్రేన్లను అమర్చారు. స్వచ్ఛతకు ప్రాధాన్యమిస్తూ 1,145 మంది శానిటేషన్ వర్కర్లతో గణేశ్ యాక్షన్ టీమ్లను ఏర్పాటు చేసి రౌండ్ ది క్లాక్ సేవలు అందిస్తున్నారు.

## కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కాగా, సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఖైరతాబాద నియోజవర్గానికి ఉప ఎన్నికలు ఖాయంగా కనిపిస్తున్నాయి, అయితే ఉప ఎన్నికల ఎప్పుడు జరుగుతుంది అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు, ఇప్పటికే బెంగాల్ లో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్ ఖారారైన నేపథ్యంలో వాటితో పాటుగా ఖైరతాబాద్‌కు ఉప ఎన్నికలు జరుగుతాయా? లేక మరో తేదీని ఖరారు చేస్తారా? అనేది తేలాల్సి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరపున పోటీచేసి గెల్చిన దానం ఆ తరువాత కాంగ్రెస్‌లోకి మారారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు, అసెంబ్లీ రికార్డుల ప్రకారం దానం బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నందున తనపై అనర్హత వేయడాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. కాంగ్రెస్ పార్టీలోకి మారిన దానంపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా, పరిశీలన కోసం ఈ అంశాన్ని స్పీకర్‌కు పంపింది. దానం పార్టీ మారినట్టుగా ఎటువంటి ఆధారాలు లేవని అధికారిక రికార్డుల ప్రకారం ఆయన బిఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నారంటూ స్పీకర్ రూలింగ్ ఇచ్చారు.

ఈ రూలింగ్‌ను సవాలు చేస్తూ బిఆర్ఎస్, బిజెపి విడివిడిగా హైకోర్టును ఆశ్రయించగా దానం పై అనర్హత వేటు వేస్తూ కోర్టు ఆదేశాలు జా రీ చేసింది. దీనితో దానం సుప్రీం కోర్టును ఆశ్రయించినప్పటికీ ఫలితం దక్క లేదు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com